ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక




"తెగనిసమస్య"


ఛాయా-చిత్రకారుడు : శ్రీ ఎ. వి. రత్నం, పెద్దాపురం.

28-7-48 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాల


చెన్నపట్టణమునకు భారతప్రధాని నెహ్రూ రాక



మీనంబాకం విమానాశ్రయంవద్ద పండిట్ నెహ్రూ కె. షణ్ముఖంచెట్టిగార్లు (శనివారం మధ్యాహ్నం) విమానంనుండి దిగుతూ ఉన్నారు.




విమానాశ్రయంవద్ద పండిట్ నెహ్రూ, తిరువాన్కూరు పదాతిదళమును పరిశీలిస్తున్నారు.



శనివారం సాయంత్రం పౌరసన్మానాన్ని పొందుటకు గిండి ప్రభుత్వ భవనంనుండి ఆచ్ఛాదనం లేని మోటారులో వస్తుండగా మౌంట్‌రోడ్‌లో తీసిన ఛాయాచిత్రం.



విమానాశ్రయంవద్ద ప్రధానామాత్యుడు పండిట్ నెహ్రూ, రాష్ట్రప్రధాని శ్రీ ఓమండూరు రామస్వామిరెడ్డియార్ సైనికాభివందనమును గైకొనుచున్నారు.



ప్రధాని నెహ్రూ విమానం దిగి వస్తున్నారు.



నెహ్రూ రాకకై ఎదురుచూచుచున్న మద్రాసు మంత్రివర్గము, తదితర ప్రముఖులు.



గార్డ్ ఆఫ్ ఆనర్ అందుకొనుచూ వందనపూర్వకముగ వచ్చుచున్న నెహ్రూ

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా

నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్.(మహాభారతము)

సంపుటము 40

సంచిక 46


Founder: K. NAGESWARA RAO.

సర్వధారి సంవత్సర ఆషాఢ బహుళ సప్తమి బుధవారము



కుమారి బాలసరస్వతి

స్వర్ణలతావారి 'స్వర్ణమాల'లో



ఆంధ్రపత్రిక

1948-వ సం॥ జూలైనెల 28-వ తేది బుధవారము

భారతప్రధానామాత్యుడు నెహ్రూ

"నేనీ నగరమునకు వచ్చి తొమ్మిది సంవత్సరములకు పైగా అయినది. ఈ కాలములో మనమందరము—మీరు, నేనుకూడ—ఎంతగానో మారిపోయినాము." అని భారత ప్రధానామాత్యుడు, పండిత జవహర్లాల్ నెహ్రూగారు మొన్న ఆదివారము, నగరమున జరిగిన బహిరంగసభయందుపన్యసించుచు చెప్పిరి. ఎన్ని సంవత్సరములు గడచినను, ఎన్ని పురుషాంతరములు వెళ్ళిపోయినను, మార్పు చెందనిది మాత్రము ఒక్కటే. ప్రజాసముదాయములపై పండితునకు గల వాత్సల్యము, అభిమానము, ప్రజాబాహుళ్యమునకు వారిపై గల ప్రేమ. వాత్సల్య అభిమానములు గాంధి మహాత్ముని తరువాత, భారత ప్రజల నంతగ ఆకర్షించిన, భారతీయుల హృదయముల చూరగొనిన నాయకుడు, ఒక్క పండిత నెహ్రూ అని చెప్పిన అత్యుక్తి కాదు. ప్రజాహృదయముల తరచి, వారి భావముల గ్రహింపగల శక్తి పండితునకు లేకపోవచ్చును. అది గాంధి మహాత్ముని సొమ్ము అని పండితుడే ప్రకటించి యుండెను. కాని మహాత్ముడు అంతరించుటతో ఆ బాధ్యతను కూడ వీరే నిర్వహింపవలసి వచ్చెను. ప్రజలు కూడ వీరిపైననే ఆశలు పెట్టుకొని యుండిరి.

ఈ రెండు విషయములు పండిత జవహర్లాల్ నెహ్రూ నగరమునందున్న మూడు రోజులలో స్పష్టమైనది. ఆదివారమునాటి బహిరంగ సభకు దాదాపు అయిదు లక్షలమంది హాజరైరి. ఇదే విధముగ ఈ మూడు రోజులలో పండితుడు సందర్శించిన ప్రాంతములకు వారి దర్శనార్థము ప్రజలు శతసహస్రముగ చేరి తమ ప్రేమాభిమానములు వెల్లడించిరి. 1945 వ సంవత్సరమున గాంధి మహాత్ముడు వచ్చి వెళ్ళిన అనంతరము తిరిగి ఇంతటి సంచలనము, ఇంతటి కోలాహలము నగరమెరుగదు. ఇంత ఉత్సాహమున, ఇంత ఉద్రిక్తులైకూడ ప్రజలు క్రమబద్ధులై ప్రవర్తించి భారత ప్రధానామాత్యుని అభినందనముల పొందిరి.

ప్రధానామాత్యులు నగరమున మహిళా సభలందుపన్యసించిరి. కార్మికుల, విద్యార్థుల కాంగ్రెస్ స్వచ్ఛంద సేవకుల సమావేశమునందుపన్యసించిరి. దాదాపు అయిదు లక్షల పౌరులు హాజరైన బహిరంగ సభయందు భారత రాజకీయముల సింహావలోకనము చేసి ప్రస్తుతము దేశమును కలవర పెట్టుచున్న హైదరాబాదు, కాశ్మీరు సమస్యల సాకల్యముగ, సమగ్రముగ చర్చించిరి. అనంతరము కాంగ్రెస్ ప్రముఖుల, రాష్ట్రశాసన సభ కాంగ్రెస్ సభ్యుల కాంగ్రెస్ సేవకుల సమావేశమునందుపన్యసించుచు, కాంగ్రెస్‌వాదులందు ప్రబలిన అవినీతిని, లంచగొండితనమును, ప్రభుత్వ నిర్వహణమునందిటీవల ఏర్పడిన అసమర్థతను తీవ్రముగ ఖండించిరి. పండిత జవహర్లాల్ నెహ్రూ దర్శనముకొరకు, వారి సందేశమును వినుటకు ప్రజలయందు గోచరమైన అపూర్వ ఉత్సాహము, వారి హితవును పాటించి, వారి ఆదేశములను పాలించుటయందును గోచరింపవలెను. లేకున్న ఇట్టి సభలుగాని, సమావేశములుగాని, సంచారములుగాని ప్రయోజనహీనములగును.

రాష్ట్రాభిమానము, కులతత్వము, సంకుచితత్వము, మతవైషమ్యములు ప్రమాదభరితములని, వాటిని నిర్మూలించుట భారతప్రజానీకపు విధ్యుక్తధర్మమని, భారతీయ పౌరులు యావన్మంది, స్వాతంత్ర్య ప్రయోజనములనుభవించుటతోబాటు తత్ఫలితముగ సంక్రమించు బాధ్యతలను నిర్వహించుటకు కూడ సిద్ధపడవలెనని హెచ్చరించిరి. నెహ్రూ పండితుడొసగిన అమూల్య సలహాను రాష్ట్రప్రజలు, పరిపాలకులు అక్షరాల ఆచరించెదరని ఆశించుచున్నాము.

అనతికాలముననే ఆంధ్రులకు ప్రత్యేకరాష్ట్రము ఏర్పడనున్నది. చెన్నగరము బొంబాయివలెనే ప్రత్యేకపాలకప్రాంతముగ ఏర్పడును గనుక ఆంధ్ర రాష్ట్రమునకు విజయవాడ రాజధాని కావలసివచ్చును. నూతన ప్రభుత్వ కార్యాలయముల నిర్మింపవలసివచ్చును. ఆ సందర్భమున నెహ్రూ పండితుడు తిరిగి ఆంధ్రరాష్ట్రమునకు రాగలడని, తిరిగి యావదాంధ్రము ప్రేమాభిమానముల వెల్లడించుకొనుటకు అవకాశము లభించునని ఆశించుచున్నది.

భారత ప్రధానామాత్య పదవియందుండి, స్వతంత్ర భారతమును సుస్థిరమైన పునాదులపై నిర్మించి, ప్రపంచ అగ్రరాజ్యములందు సముచితస్థానము లభింప చేయగలరని విశ్వసిసున్నాము. విశ్వకల్యాణమునకు, మానవాభ్యున్నతికి, ప్రపంచశాంతికి పండిత జవహర్లాల్ నెహ్రూ నాయకత్వమున భారతదేశము ఇతోధిక కృషి చేసి జాతి జనకుని కలలకు వాస్తవిక స్వరూపమును కల్గింపగలదని ఆశించుచున్నాము.

విశాలాంధ్ర స్థాపన

ప్రత్యేకాంధ్ర రాష్ట్రమేర్పడిన కొద్దికాలముననే విశాలాంధ్ర రాష్ట్రము సాధ్యము కాగలదని, అది అనివార్యమని, ఆంధ్రప్రజలు, ఆంధ్ర నాయకులు కూడ చాలకాలముగ విశ్వసించుచుండిరి. కాని ఇటీవలి సంఘటనలను గమనించిన రెండును ఏకకాలముననే జరుగునట్లు కన్పించుచున్నది. లోగడ ఒకదఫా హైదరాబాదు విషయమై వ్రాయుచు సంస్థానమును వివిధ భాషాప్రాంతములుగ విభజించి, ఆయా భాగములను సంశ్లిష్ట భాషాప్రాంతములలో చేర్చివేయుటొక్కటే ఈ సమస్యా పరిష్కారమునకు మార్గమని తెలిపియుంటిమి. విధిబలీయమై హైదరాబాదు సంస్థానము యథాతథముగ భారతదేశమున చేరిపోయినను కాలక్రమేణ సంస్థానము వివిధభాషా ప్రాంతములుగ విభాగము కాక తప్పదు. ప్రస్తుతపు నైజాం ధోరణిని గమనించిన సంస్థాన విచ్ఛిత్తి అనివార్యమనియే తోచుచున్నది. భారతప్రధానామాత్యుడు పండిట్ జవహర్లాల్ నెహ్రూ నగరమున జరిగిన బహిరంగ సభయందుపన్యసించుచు ఈవిషయమునే స్పష్టముచేసిరి. "హైదరాబాదు సంస్థానము సవ్యముగ భారతసమితిలో చేరకున్న సంస్థాన స్వరూపమే విధముగ మారిపోవునో చెప్పుటకు వీలుగాదు. సంస్థానము ఇప్పటివలె ఉండగలదని కూడ ఎవ్వరును చెప్పజాలరు" అని పండిట్ నెహ్రూ ప్రకటించెను.

కనుక తెలంగాణము కూడ చేరిన విశాలాంధ్రరాష్ట్రమేర్పడుట తథ్యమనియే చెప్పవచ్చును. కాని భాషారాష్ట్ర విచారణ సంఘము ఏర్పడి మాసము రోజులు అయినది. తొలి విచారణను పూర్తి చేసికొని బొంబాయి, మధ్యపరగణాలు, చెన్నరాష్ట్రములందు పర్యటన సాగింపనుండిరి. కాని ఆంధ్ర ప్రజా సంస్థలు విచారణ సంఘమువారి కృషి సుకరమగుటకు, విచారణయందు జాప్యము లేకుండుటకు వీలుగా విషయములను సేకరించి, సరిహద్దుల విషయమునను, రాష్ట్ర ఆర్థిక సౌష్ఠవమును గురించియు ఒక సమగ్రమగు నివేదికను తయారు చేయుటకు ప్రయత్నమునైనను ప్రారంభించి యుండలేదు. అసలు భాషారాష్ట్ర నిర్మాణమును వాయిదా వేయుటకే విచారణ సంఘ నియామకము జరిగినదని కొందరభిప్రాయపడుచుండిరి. పూర్వము బ్రిటిష్ వారి పాలనలో ఉండగా సమస్యల పరిష్కారమును వాయిదా వేయుటకు ప్రజల దృష్టిని అసలు సమస్యలనుండి మరల్చుటకు ఇట్టి విచారణ సంఘముల నియమించుట జరుగుచుండెను. అదృష్టవశమున బ్రిటిష్ పరిపాలన అంతమైనదిగాని దురదృష్టవశాత్తు వారి పరిపాలనా పద్ధతులు, కొంతవరకు విధానములు, అంతము కాలేదు. అందువల్లనే కావచ్చును, ఈ విచారణ సంఘము విషయమున ఇట్టి అపోహలు ఏర్పడియుండవచ్చును.

విచారణసంఘము ఏమి చేయునను విషయమును విచారించుటపై కాలహరణము చేయుటకు బదులు, సత్వరాంధ్రరాష్ట్ర నిర్మాణము సాధ్యమని, అవసరమని సహేతుకముగా ఋజువు చేయుటకు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘము, ఆంధ్రమహాసభ ప్రయత్నము చేయవలసియున్నది. ఈ సందర్భములో ఆంధ్రనాయకులు వేరొక విషయమును కూడ గుర్తింపవలసియున్నది. రాయలసీమవారు కొందరు తమకు రాష్ట్రము అవసరము లేదని, ఆంధ్రరాష్ట్రమున తాము చేరమని రాజ్యాంగపరిషత్తు కార్యాలయమునకును, విచారణసంఘమువారికిని విన్నవించుకొనినట్లు తెలియుచున్నది. ఆంధ్రులకు రెండు రాష్ట్రములేర్పడిన సంతసింపవలసిన విషయమే. కొందరు నాయకులు రాయలసీమతో చేర్చి, రాయలసీమ లేక తెలంగాణమును మాత్రము తీసికొని ఆంధ్రరాష్ట్ర ఆయవ్యయ అంచనాలను తయారుచేయుచున్నట్లు కూడ తెలియుచున్నది. అటు రాయలసీమవారి ప్రయత్నములు ఇటు కోస్తా జిల్లాలవారి ప్రయత్నములుకూడ గర్హణీయమైనవే. రాష్ట్రమేర్పడనున్న ఈ సమయముననైనను ఆంధ్రులందరూ ఏకమై ఒకే ధోరణిలో వ్యవహరింతురని విశ్వసించుచున్నాము.

నేటిప్రపంచం:

బర్లిన్‌సమస్య అతి క్లిష్టపరిణామం

బర్లిన్ సమస్య ఆనాటికానాడు అతి క్లిష్టంగా పరిణమించడంతో రష్యాతో పశ్చిమ మిత్రరాజ్యాల విభేదాలు తీవ్రతరమవుతున్నవి. సోవియెట్ ప్రభుత్వం ప్రయోగించిన దిగ్బంధన కార్యకలాపాల ఫలితంగా పశ్చిమ బర్లిన్‌లో తమ ఆక్రమణకింద వున్న దాదాపు 20 లక్షలమంది జర్మన్ ప్రజలకు, అక్కడవున్న తమ ఆక్రమణాధికారులకు నిత్యజీవితావసర పదార్థాలను పశ్చిమ మిత్రరాజ్యాలు విమానాలద్వారా సరఫరా చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. అంతమంది ప్రజలకు బ్రిటన్, అమెరికాలు ఈవిధంగా విమానాలలో ఎంతకాలమని అవసరసామగ్రిని చేరవేయగలవన్నదే పెద్ద ప్రశ్న. రష్యా ప్రస్తుతం అనుసరిస్తున్న విధానంవల్ల ఎంతకాలం విమాన రవాణాలను సైతం పంపనిస్తుందన్నది కూడా అనుమానాస్పదమైన విషయమే. విమాన రవాణాలనుకూడా పూర్తిగా అరికట్టిన మరుక్షణంలో రష్యాతో మిగతా అగ్రరాజ్యాలు యుద్ధానికైనా దిగాలి, లేదా ఎందుకొచ్చిన అవస్థ అని బర్లిన్ నుంచి తట్ట బుట్ట సర్దుకొని వెళ్ళిపోనైనాపోవాలి. బర్లిన్‌నగరాన్ని ఖాళీచేయడం తమ ప్రతిష్ఠకు లోటు. అందుచేత ఏది ఏమైనప్పటికీ పశ్చిమ రాజ్యాలు ప్రతిష్ఠకోసం చివరవరకూ పెనుగులాడి తీరుతవి. దీనిఫలితం ఏమవుతుందో చెప్పలేము.

అమెరికన్ ఆక్రమిత బర్లిన్ నగరభాగానికి మిలిటరీ గవర్నర్‌గా పనిచేస్తున్న లూసియెస్ క్లే మొన్న వాషింగ్టన్‌లో పత్రికా విలేఖరుల సమావేశములో ప్రసంగిస్తూ, "ప్రాక్పశ్చిమ రాజ్యాల వివాదం ఫలితంగా బర్లిన్‌లో తీవ్రపరిస్థితే ఏర్పడింది. దీన్ని చులకనగా తోసివేయడం నా ఉద్దేశం కాదు. ఐతే యుద్ధం చేయాలని ఏ దేశమూ, చివరకు రష్యా కూడా పరితపించడం లేదనే నా అభిప్రాయం. బర్లిన్ సమస్యను సహేతుకంగా పరిష్కరించుకోడానికి అవకాశం ఉన్నదనే నా నమ్మకం...బర్లిన్ సమస్య అజ్ఞానులైన మూర్ఖుల చేతులలో పడివున్నట్లయితే యుద్ధానికి దారితీసేదే కాని, ఇప్పుడు యుద్ధం సంభవిస్తుందని నేననుకోను," అని తెలియజేశాడు. బర్లిన్ నగరాన్ని తమ సేనలు ఖాళీ చేయడం అసంభవమనీ, ఆరు నూరైనా, నూరు ఆరైనా అక్కడనుంచి తాము కదలబోవడం లేదనీ, అవసరమైతే, ఈ క్లిష్ట పరిస్థితి ఇదే విధంగావుంటే, వచ్చే శీతాకాలమంతా కూడా పశ్చిమ బర్లిన్ ప్రజలకు విమానాల ద్వారానే అవసర పదార్థాలన్నీ అందజేయడానికి సైతం ఏర్పాట్లు చేసుకుంటామనీ కూడా క్లే ఖండితంగా చెప్పాడు.

లూసియెస్ క్లే చెప్పినట్లు బర్లిన్ సమస్య మూర్ఖుల చేతులలోనే పడి వున్నట్లయితే, ఏదో విధంగా ఇదివరకే పరిష్కారమై వుండేది. హేమాహేమీలమనుకునే అగ్రరాజ్యాల వ్యవహారం కావడం వలననే అత్యంత క్లిష్ట పరిస్థితికి వచ్చి ప్రపంచశాంతికే భంగకరంగా పరిణమించింది. అటు బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాలుకాని, ఇటు రష్యాగాని ఈ సమస్యను సామరస్యంతో పరిష్కరించుకుందామనే సదుద్దేశ్యాన్ని చూపడం లేదు. ఆరోజుకారోజు క్లిష్టస్థితి మరింత క్లిష్టమవుతున్నదేగాని, త్వరలో పరిష్కారమయే ఆశారేఖలు కూడా కనిపించడంలేదు. ఈ పరిస్థితి ఇలా వుండగా పశ్చిమబర్లిన్‌లో ఆక్రమణకిందవున్న ప్రజలకు తగినంత ఆహారాన్ని మీరు సప్లయి చేయలేకపోతే ఆ పనికి మేమే పూనుకొని ఆహార పదార్థాలు పంపుతామని కూడా రష్యా బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాలతో మరొక చిన్న పేచీని ఈవారం తెచ్చిపెట్టింది. బర్లిన్‌నగర ప్రజలను తిండిలేక అవస్థపెట్టడం తమ ఉద్దేశ్యం కాదనికూడా రష్యా ఇదే సందర్భంలో తెలియజేసింది. తమ నాక్రమించిన పశ్చిమ అగ్రరాజ్యాధికారులు తమ అవసరాలను సక్రమంగా నెరవేర్చలేకపోతున్నారని పశ్చిమ బర్లిన్ ప్రజలలో ఒకవిధమైన ద్వేషాన్ని రెచ్చగొట్టి, వారిని తమ పక్షానికి తిప్పుకోవడమే రష్యా ఈ ఎత్తువేయడంలో ఉద్దేశ్యమని స్పష్టపడుతున్నది. రష్యా వేసిన ఈ ఎత్తుకు ఎదురెత్తుగానే, అమెరికన్ మిలిటరీ గవర్నర్ లూసియెస్ క్లే వచ్చే శీతకాలంలోకూడా బర్లిన్ ప్రజలకు కావలసిన ఆహారపదార్థాలను విమాన రవాణాలద్వారా అందజేస్తామని చెప్పివుంటాడు. ఏది ఏమైనప్పటికీ, అగ్రరాజ్యాల ఎత్తుల ఎదురెత్తులమధ్య బర్లిన్ ప్రజలు నలిగిపోతున్నారు. వారి రాజకీయ, ఆర్థికభవిష్యత్తు సంపూర్తిగా అగమ్యగోచరంగా పరిణమించింది.

బర్లిన్‌లో రష్యా అనుసరిస్తున్న విపరీత విధానంవల్ల అతిప్రమాద భరితమైన అంతర్జాతీయ పరిస్థితిఏర్పడిందనీ, సోవియెట్ ప్రభుత్వం బర్లిన్‌పై ప్రయోగించిన అష్టదిగ్బంధనకార్యక్రమాన్ని ఉపసంహరించేవరకూ, బర్లిన్ సమస్యపైనేగాక మొత్తం జర్మనీసమస్యపైనే రష్యాతో సంప్రతింపులు జరుపుతామని బ్రిటన్ అమెరికా ఫ్రాన్సు ప్రభుత్వాలు పంపిన తాఖీదుకు, పశ్చిమ అగ్రరాజ్యాలే జర్మనీవిషయంలోనూ బర్లిన్ విషయంలోనూ లోగడ చేసుకున్న యాల్టా, పాట్స్‌డాం ఒడంబడిక షరతులను ఉల్లంఘించడం జరిగిందనీ రష్యా సమాధానం పంపింది. సోవియెట్‌ప్రభుత్వ సమాధానం మిగతా ప్రపంచం ఏవిధంగా వుంటుందనుకున్నదో సరిగా అదేవిధంగా వున్నది. అందుచేత రష్యన్ సమాధానం ఎవరికీ ఏవిధమైన ఆశ్చర్యాన్నీ కలిగించలేదు.

రష్యాపంపిన ఈ సమాధానంమీద మరొక అధిక్షేపణను పంపడానికి పశ్చిమ మిత్రరాజ్యాల బర్లిన్‌కమిటీ ఈవారంమధ్యన లండన్‌లో సమావేశమై సమాలోచనలు జరుపుతున్నది. అమెరికన్ ప్రభుత్వంతరఫున రష్యన్ విషయాలన్నీ తెలిసిన ఇద్దరు నిపుణులుకూడా ఈ చర్చలలో పాల్గొనబోతున్నారు. వీరిలో ఒకడు మాస్కోలోని అమెరికన్ రాయబారి బిడెల్ స్మిత్. రెండవ అధిక్షేపణ స్వరూపం ఈ వారాంతంలోపుగా తయారవుతుంది. ఎన్ని సమాలోచనలు జరిపి ఎన్ని అధిక్షేపణలు పంపినా బర్లిన్ సమస్యగాని, జర్మనీ సమస్యగాని కేవలం అగ్రరాజ్యాల ఉత్తర ప్రత్యుత్తరాలవల్ల మాత్రమే పరిష్కారమయేటంత సులభమైనది కాదు. ఈ ఆక్షేపణలు, రష్యా పంపే సమాధానాలు అగ్రరాజ్యాల విభేదాలు మరీ శృతిమించిపోవడానికి మాత్రమే సహాయభూతమవుతవి. రాజకీయంగా ఒకరినొకరు తలదన్నడానికి చేసే ఈ ప్రయత్నాలన్నీ విఫలమై, చివరకు, ఇప్పుడే గాకపోయినప్పటికీ, మరొకప్పటికైనా బాహాట సంఘర్షణకు దారితీయక మానవు. బర్లిన్ నగరాన్ని పూర్తిగా తమ హస్తగతం చేసుకోడానికి రష్యా బహు తాపత్రయపడుతున్నది. పశ్చిమ బర్లిన్ నుంచి తూర్పు బర్లిన్‌కు వచ్చే జర్మన్ పౌరులందరూ కొత్త సోవియెట్ కరెన్సీతో మాత్రమే రావాలని శాసించి రష్యా ఈ వారం మరొక ఎత్తు వేసింది. పశ్చిమ మిత్రరాజ్యాలు తమ బర్లిన్ భాగాలలో అక్కడక్కడ సోవియెట్ కరెన్సీ మారకానికి ఏర్పాట్లు చేశారు. ఇంతే కాకుండా తన ఆక్రమణ క్రిందవున్న తూర్పు జర్మనీ అంతటినీ కమ్యూనిస్టు ప్రాబల్యంకిందికి పూర్తిగాతీసుకొని రావడానికి, ఏకపక్ష నియంతృత్వాన్ని స్థాపించడానికి ప్రయత్నిస్తున్నట్లు, ఇందుకు అనుగుణముగా కొంతమంది ప్రతికూల రాజకీయ వాదులను అరెస్టు చేస్తున్నట్లు కూడా తెలుస్తున్నది.

రష్యా వేస్తున్న ఈ ఎత్తులకు బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సులు ఎంతవరకు దృఢ వైఖరితో నిలిచి తట్టుకోగలవో చూడాలి.

బర్లిన్ సమస్య విషమిస్తున్న కొద్దీ పశ్చిమ యూరప్ సైనిక పునర్నిర్మాణ కార్యకలాపాల విషయంలో బ్రిటన్, ఫ్రాన్సులు విశేష శ్రద్ధ వహించి పని చేస్తున్నవి. బ్రిటన్, ఫ్రాన్సు, బెల్జియం, హాలెండు, లక్సెంబర్గ్ దేశాల విదేశాంగ మంత్రులు ఈ వారం డచ్చి రాజధాని హేగ్‌లో రహస్య సమావేశం జరిపి పశ్చిమ యూరప్ సంయుక్త రక్షణకార్యకలాపాలను గురించి చర్చించి ప్రత్యేక పథకాన్ని ఒకదాన్ని తయారుచేసినట్లు వార్తలు వచ్చినవి. పశ్చిమ యూరప్‌రాజ్య సమాఖ్యను గత ఏప్రిల్ మాసంలో పారిస్‌లో వివిధరాజ్యాల ప్రతినిధులు సమావేశమై ఏర్పాటుచేశారు. ఆ సమాఖ్యసలహాసంఘంగా ఐదుగురువిదేశాంగమంత్రులు రెండురోజులపాటు హేగ్ నగరంలో సమాలోచనలు జరిపారు. బర్లిన్ ప్రతిష్టంభనను కూడా వీరు చర్చించారు. ఇదివరలో బ్రస్సెల్స్‌లో (బెల్జియం రాజధాని)జరిగిన ఒడంబడికప్రకారం పశ్చిమ యూరప్‌లో తమ ఆధిపత్యాన్ని దృఢతరంచేసుకునే నిమిత్తం అన్నివిధాలా పరస్పర సహకారంతో వ్యవహరించడానికి ఐదుగురు విదేశాంగమంత్రులు ఈ రెండురోజుల చర్చలలో నిర్ణయించుకున్నారు. ఇంతేకాకుండా పశ్చిమ యూరప్‌రక్షణకు ఒక ప్రత్యేక సైనిక పథకాన్ని సైతం తయారుచేశారు. ఈ సైనిక సమాఖ్యను ఉత్తర అట్లాంటిక్ ప్రాంతరక్షణ సమాఖ్యగా స్థిరపరచడానికి ఏర్పాట్లు జరిగినట్లు, కెనడా, అమెరికాలనుకూడా ఇందులో చేర్చినట్లు, కెనడా అమెరికాలు రెండూ ఇందుకు సమ్మతించినట్లు అనధికారవార్తలు తెలుపుతున్నవి. పశ్చిమ యూరప్ రాజ్యాలకు కావలసిన ఆయుధబలమూ, అంగబలమూ లభ్యం కావలెనంటే అమెరికా, కెనడాల సహాయం అవసరంగా వుండితీరాలి కాబట్టి, సమాఖ్యకు ఉత్తర అట్లాంటిక్ ప్రాంత రక్షణసైనిక సమాఖ్య అని నామకరణం చేయడం అవసరమైంది. ఎర్నెస్ట్ బెవిన్, (బ్రిటన్), జార్జి బిడాల్ట్ (ఫ్రాన్సు) కారల్ వాన్ బోల్జలేర్ (హాలెండు) పాల్ స్పాక్ (బెల్జియం) హేగ్‌లో సమావేశమై చేసిన ఈ సైనిక సమాఖ్య నిర్ణయాన్ని అగ్రరాజ్య విభేదాల పరిణామంలో అతి ప్రధానమైనదిగా పరిగణించాలి తూర్పు పశ్చిమ యూరప్‌ల విభజన క్రమక్రమంగా సైనికబల నిర్మాణధోరణిలో పడుతున్నదన్నమాట

బర్లిన్ సమస్యపై అగ్రరాజ్య విభేదాల స్థితి ఈవిధంగావుంటే, తూర్పుయూరప్ కమ్యూనిస్టు రాజ్యకూటమిలో యుగోస్లావియా సమస్యపై రష్యాతో ఏర్పడిన విభేదాలకు ఈ వారం మార్షల్ టిటో యుగోస్లావియా కమ్యూనిస్టు పార్టీ సమావేశంలో సమాధానం ఇచ్చాడు. ఇదివరలో నిర్ణయించిన ప్రకారం మొన్న 21వ తేదీన యుగోస్లావియా రాజధానిలో ఈ పార్టీ సమావేశం జరిగింది. ఇదివరలో కమ్యూనిస్టు ప్రచారసంస్థ కామిన్‌ఫార్మ్ తమపై చేసిన ఆరోపణలకు పార్టీ సమావేశంలో మార్షల్ టిటో బదులు చెప్పాడు. తమ పార్టీ నిర్ణయించుకున్న కమ్యూనిస్టు లక్ష్యాలను ఏమాత్రం సడలించలేదనీ, రష్యా నిర్బంధం గాని, తదితర దేశాల నిర్బంధం గాని, ఏమాత్రం లేకుండానే తమ దేశానికి కమ్యూనిస్టు పంథాను నిర్ణయించుకున్నామనీ, పశ్చిమ యూరప్ రాజ్యాల వైపు మొగ్గి మార్షల్ పథక సహాయం కోసం అర్రులు చాస్తున్నామనేమాట శుద్ధ అసత్యారోపణ అనీ టిటో పార్టీ సమావేశములో స్పష్టపరిచాడు. మార్క్సిస్, లెనిన్ సిద్ధాంతాల ఆచరణే తమ లక్ష్యమని కూడా చెప్పాడు. తూర్పు యూరప్ రాజ్యాలతో తమ స్నేహ బంధాలను రుజువు చేయడానికి రుమేనియా, పోలెండు, జెకొస్లోవేకియాలకు తాము లోగడ ఆహార ధాన్యాలు సప్లయి చేయడము బల్గేరియా ఇవ్వవలసిన రెండున్నర కోట్లడాలర్ల యుద్ధఋణాన్ని రద్దుచేయడమే ప్రబల నిదర్శనమనికూడా టిటో ఉదాహరణలు చూపించాడు మార్షల్ టిటో సమాధానం రష్యాకు ఎంతవరకు అంగీకారయోగ్యంగా వుంటుందో చెప్పలేము. యుగోస్లావియాను, మార్షల్ టిటోను శంకించడం ద్వారా రష్యా తన పరిస్థితిని తానే దుర్బలంగా చేసుకుంటున్నది. యుగోస్లావియా కమ్యూనిస్టు పార్టీలో టిటోపట్ల సంపూర్ణ విశ్వాసం వున్నట్లు స్పష్టపడుతున్నది. టిటోను పదభ్రష్టుణ్ణి చేయడానికి రష్యా, మిగతా తూర్పు యూరప్ కమ్యూనిస్టురాజ్యాలు వేసిన ఎత్తు ఫలించడం కల్లగానే కనిపిస్తున్నది. ఈ పరిస్థితులలో యుగోస్లావియాకు కమ్యూనిస్టు రాజ్యకూటమిలో యథాస్థానాన్ని ఇవ్వనైనా ఇవ్వాలి, లేదా, దాన్ని సంపూర్తిగా బహిష్కరించనైనా బహిష్కరించాలి. టిటోను పదభ్రష్టుని చేయడం అసాధ్యంగా పరిణమిస్తే, తిరిగి రష్యా తన ఆరోపణలను ఉపసంహరించుకొనక తప్పదు. కమ్యూనిస్టు రాజ్యకూటమిలో చీలిక ఏర్పడి యుగోస్లావియా తప్పుకోవడమే సంభవిస్తే, ఆ చీలిక ఒక్క యుగోస్లావియాతో ఆగదు. మిగతా రాజ్యాలకు వ్యాపించి తీరుతుంది. కమ్యూనిస్టు రాజ్యశ్రేణిని ఒక మహాసౌధంగా నిర్మించదలచిన రష్యాకంటున్న కలలు పగటికలలు కాకమానవు. ఈ నాడు యుగోస్లావియా ఏదారిన నడుస్తున్నదని రష్యనులు ఆరోపిస్తున్నారో, రేపు హంగరీకూడా అదేదారిన నడవదని ఎవరు చెప్పగలరు? ఇప్పటికపుడే హంగరీలో అరెస్టులు, అశాంతి ప్రారంభమైనవి.

యూరప్‌ఖండాన్ని ప్రస్తుతం బాధిస్తున్న రాజకీయ సంక్షోభంతోపాటు ఈవారం ఫ్రాన్సులో రాబర్ట్ షూమన్ మంత్రివర్గపతనం కూడా సంభవించింది. నూత్న ఫ్రెంచి రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పుడు రాబర్ట్ షూమాన్ ఆధ్వర్యంకింద సోషలిస్టు మంత్రివర్గం ఏర్పడింది. విపరీతమైన ఇన్‌ఫ్లేషన్ ప్రమాదాన్ని ఎదుర్కొంటున్న తమ దేశంలో సైనికవ్యయాన్ని తగ్గించడం అవసరమని సోషలిస్టుప్రభుత్వం చేసిన ప్రతిపాదన వీగిపోయింది. ప్రధాని షూమన్‌పై శాసనసభ అవిశ్వాసతీర్మానాన్ని సైతం ఆమోదించింది. ముందు ఏడుగురు సోషలిస్టు మంత్రులు రాజీనామా ఇవ్వడం, వెన్వెంటనే మంత్రివర్గమే రాజీనామా ఇవ్వడమూ జరిగింది. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ మంత్రిఅయిన ఆండ్రీ మేరీపై నూత్న మంత్రివర్గ నిర్మాణబాధ్యత పడ్డది. శాసనసభ్యులు ఇతడిపట్ల విశ్వాసాన్ని సైతం ప్రకటించారు. ఇతడు తన మంత్రివర్గ సభ్యుల పేర్లను త్వరలోనే ప్రకటిస్తాడు. బ్లం, రేనో, బిడాల్ట్, షూమన్ ప్రభృతులు కొత్త మంత్రివర్గంలో తప్పక వుంటారని చెప్పవచ్చు.

ద్వితీయ ప్రపంచసంగ్రామంలో ఆర్థికంగా సైనికంగా బాగా చితికిపోయినా, ఫ్రాన్సు తన సామ్రాజ్యకాంక్షను మాత్రం వదలలేకపోతున్నది. ఇప్పటికీ వలసలలో తన ప్రాబల్యాన్ని సుస్థిరం చేసుకోడానికి తాపత్రయపడుతూ, ఇండోచైనా జాతీయ ఉద్యమాన్ని అణచడానికి అంగబలాన్ని, ఆయుధబలాన్ని, ఆర్థికబలాన్ని విరివిగా ప్రయోగిస్తున్నది. పైగా, జర్మనీలో కొంత ఆక్రమణసేనను వుంచి వ్యయాన్ని భరిస్తున్నది. ఇండోచైనా యుద్ధకార్యకలాపాల మూలంగానే ఫ్రాన్సు ఇంత వ్యయాన్ని భరించి, దేశంలో ప్రజలకు ద్రవ్యోల్బణ ప్రమాదాన్ని తెచ్చిపెట్టింది. రైతులు తాము పండించే ఆహార ధాన్యాలను విపరీతమైన ధరలకు విక్రయిస్తున్నారు. ఇట్టి ప్రమాదాలను కొంతవరకైనా తగ్గిద్దామని షూమన్ సోషలిస్టు ప్రభుత్వం ఉద్దేశించివుంటుంది. ఆ ఉద్దేశం నెరవేరలేదు. ఈ సారి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థులు ఎక్కువమంది రిపబ్లికన్లతో, కొంతమంది సోషలిస్టులతో మిశ్రమ మంత్రివర్గాన్ని స్థాపిస్తున్నారు. అంటే ఇండోచైనా యుద్ధం తీవ్రతరమయే అవకాశం వున్నదన్నమాట. ఇండోచైనా ప్రజల జాతీయ వాంఛను ఫ్రెంచివారు సజావుగా పరిష్కరించరనీ, వారిలో వారికి విభేదాలను ఇక మరీ రేకెత్తిస్తారనీ చెప్పవచ్చు. సామ్రాజ్యకాంక్షను వదిలేవరకు ఫ్రాన్సుకు ఆంతరంగిక అశాంతి తొలగడం కల్ల. ఆంతరంగిక అశాంతిని ముందు తొలగించుకోనిదే ఆర్థిక సౌష్ఠవాన్ని సాధించడానికి ఫ్రాన్సు ఎంత ప్రయత్నించినా ప్రయోజనం వుండదు.



౨౬

కీర్తిశేషుడయిన ఓడింట్సోవ్ మహాశయుడికి కొత్తరకం నిర్మాణాలంటే కిట్టదు. కాని 'శాస్త్ర హద్దుల్లో లలితకళలను' అతను సహించేవాడు. అంచేత అతను తన తోటలో స్నానాల గదికీ కోనేటికీ మధ్య ఒక కట్టడం కట్టించాడు. అది ఒక గ్రీకుదేవాలయపు నమూనా. రష్యన్ ఇటుకతో కట్టినది. ఈ దేవాలయానికి వెనుకతట్టున చీకటిగా ఉన్న గోడలో ఆరు గూళ్ళు ఉన్నాయి. అవి విగ్రహాలకోసం కట్టిన గూళ్ళు. పై దేశాలనుంచి ఆ విగ్రహాలను తెప్పించడానికి ఓడింట్సోవ్ ప్రయత్నించాడు. ఈ విగ్రహాలు కొన్ని భావాలను సూచించాలని ఉద్దేశం—ఏకాంతం, మౌనం, ధ్యానం, విషాదం, అడకువ, మార్దవం. అందులో మౌనాన్ని సూచించే దేవత, పెదవులమీద వేలుపెట్టి ఉన్న విగ్రహం, ముందువచ్చింది. అది గూట్లో అమర్చిన మొదటి రోజునే కమతలలో కుర్రవాళ్ళు ఆ విగ్రహానికి ముక్కు విరగకొట్టారు. ఇరుగుపొరుగుని ఉన్న ఒక పనివాడు 'ఇదివరకు ముక్కుకంటే రెండింతలు బాగుండేటట్టు'గా ఇంకోముక్కు అతుకుతానని అన్నా, ఓడింట్సోవ్ ఆ విగ్రహాన్ని తీయించివేశాడు. ఇంకా ఆ విగ్రహం ధాన్యం నూర్పేకళ్లంలో ఒకమూల ఎన్నో ఏళ్లుగా పడే ఉంది. పాలికాపుల భార్యలకు ఆ విగ్రహాన్ని చూస్తే అమితభయం. గుడి ముందరభాగం అంతా పొదలు గుబురుగా మొలిచిపోయాయి. ఆ పొదలమీద ఎత్తుగా స్తంభాలవలస మాత్రం కనబడుతూ ఉంటుంది. గుడిలోపల మధ్యాహ్నంకూడా చల్లగా ఉంటుంది. అక్కడ ఒక నాడు ఒక పాముని చూసిన దగ్గరనుంచీ ఆనా సర్గీవ్నా ఆపక్కకు ఇంక పోలేదు. కాట్యా మాత్రం తరుచుగావచ్చి ఆగూళ్ళకిందకట్టిన రాతి తిన్నెల్లో ఒక దానిమీద కూర్చుంటూ ఉండేది. ఈప్రశాంతమయిన చల్లటినీడలో తన కుట్టుపనో, చదవడమో చేస్తూ కాలం గడిపేది. అనిర్వచనీయమయిన ఒకానొక ప్రశాంత భావస్ఫురణలో మునిగిపోయేది. అటువంటి అనుభూతి అందరికీ వస్తూంటుంది. మనలోపల, బయట నిరంతరంగా పరంపరావాహిగా ప్రవహించే జీవచైతన్యపు కలకల నాదాన్ని, సగం మత్తుగా, మౌనంగా మనం వింటూ గడిపే సమయాల్లో ఆ అనుభూతి యొక్క ఆకర్షణ మనకి తెలుస్తుంది.

బజరోవ్ వచ్చిన మరునాడు కాట్యా తన మామూలు రాతి తిన్నె మీద కూర్చుంది. ఆర్కాడీ ఆమె పక్కని కూర్చున్నాడు. ఆ 'ఆలయానికి' రమ్మని ఆమెను అతను ప్రార్థించాడు.

ఇంకా భోజనాలకు ఒక గంట వ్యవధిఉంది. ఆర్కాడీ ముఖం వెనకటిరోజుని ఉన్నట్టుగానే ఉంది. కాట్యా ఏదో ఆలోచనలో మునిగిపోయినట్టు ఉంది. ఉదయాన్ని టీ త్రాగిన తరవాత అక్కగారు ఆమెను తన గదిలోకి పిలిచి కొద్దిగా బుజ్జగించింది. ఆ బుజ్జగింపులంటే కాట్యాకు భయం. ఆమె చెల్లెలితో, ఆర్కాడీతో కలిసిమెలిసి తిరగడంవిషయంలో ఆమె కొంచెం జాగ్రత్తగా ఉండాలనీ, పినతల్లికిగాని, ఇంట్లో ఉన్న ఇతరులకుగాని అనుమానం కలిగించేవిధంగా అతనితో ఏకాంతంగా మాట్లాడ్డం మానెయ్యాలనీ సలహా ఇచ్చింది. అదిగాక, క్రిందటిసాయంత్రం ఆనాసర్గీవ్నాకూడా తనలో తను లేదు. కాట్యాకూడా సుఖంగా లేదు. ఏదో తప్పు చేసినట్టు సంకోచం ఆమెను ఆవరించింది. ఆర్కాడీ ప్రార్థనలకు ఎదురు చెప్పలేక లొంగిపోతూ ఇదే ఆఖరుసారి అని నిశ్చయించుకుంది.

"కాథెరీనా సర్గీవ్నా," ఆర్కాడీ సగం సిగ్గుపడుతూ ప్రారంభించాడు, "మీ ఇంట్లో, నీ సాహచర్యం లభించే భాగ్యం నాకు కలిగిన తరవాత నీతో అనేకవిషయాలు నేను చర్చించాను, కాని ఒక పెద్ద సమస్య......నాకు సంబంధించినది......ఒక ముఖ్య సమస్యను ఇంతవరకు నీతో ప్రస్తావించడం జరగలేదు. నిన్న నువ్వన్నావు, నే నిక్కడికి వచ్చినతరవాత కొంత మారిపోయానని," అతను కాట్యా తనకేసి చూస్తున్న చూపులతో చూపుకలుపుతూ వెంటనే ఇంకో పక్కకి తిప్పుకుంటూ అల్లా చెప్పసాగించాడు. "నేను చాలా మారిపోయాను. ఆ విషయం అందరికంటే నీకు బాగా తెలుసును—ఎంచేతనంటే, ఆ మార్పుకి కారణం నీవే."

"నేనా?...నేను?..." కాట్యా అంది.

"మొదట నేను ఇక్కడికి వచ్చినప్పుడులాగ, నే నిప్పుడు పొగరుబోతు కుర్రవాడిని కాను," ఆర్కాడీ వివరీకరించాడు. "నాకు ఇరవయి మూడో ఏడు ఊరికే రాలేదు; ఇదివరకులాగే నాకు ఇప్పుడూ లోకానికి ఉపయోగపడాలనే వాంఛ ఉంది; నా శక్తికొద్దీ సత్యాన్వేషణ చెయ్యాలని ఉంది. కాని నా ఆదర్శాలను ఇదివరకు ఎక్కడ వెతుక్కున్నానో ఇప్పుడు ఆ వేపు నేను చూడ్డంలేదు. అంతకంటే సన్నిహితమయినచోట ఆ ఆదర్శాలు నాకు ప్రత్యక్షమవుతున్నాయి. ఇంతవరకూ నన్ను నేను తెలుసుకోలేకపోయాను. నా శక్తికి మించిన పనులను చెయ్యాలని ఇదివరకు నిశ్చయించుకున్నాను... ఇప్పుడు నా కళ్లు తెరుచుకున్నాయి, ఒక మహత్తరానుభూతి కారణంగా......నే నంత స్పష్టంగా చెప్పలేకపోతున్నాను. కాని నీకు అర్థమవుతోందనుకుంటాను."

కాట్యా జవాబు చెప్పలేదు. కాని ఆమె ఆర్కాడీ వేపు చూడ్డం మానివేసింది.

"నే ననుకోడం," అతను మళ్లీ ప్రారంభించాడు. ఈసారి అతని గొంతుక స్థిరంగా లేదు. అతని నెత్తిమీద చెట్టుకొమ్మల్లో ఒక పక్షి నిర్లక్ష్యంగా కూస్తోంది—"నే ననుకోడం, హృదయం పూర్తిగా విప్పి స్పష్టపరచడం ధర్మం,......ఎవరితో అయితే......ఎవరయితే మనకి ఆప్తులవుతారో వారిముందు......అంచేత నేను...నేను ఒకటి నిశ్చయించుకున్నాను."

అంతవరకూ వచ్చేసరికి ఆర్కాడీ వాక్చక్తి అతన్ని వదలిపెట్టి ఎక్కడికోపోయింది. అతని ధోరణి తెగిపోయింది. మాటలు తడబడ్డాయి. ఒక క్షణం మౌనంగా ఉండిపోవలిసివచ్చింది. కాట్యా చూపులు పైకి ఎత్తలేదు. ఇదంతా అతను ఎందుకు చెపుతున్నాడో తన కేమీ అర్థం కానట్టు ఆమె కూర్చుంది, దేనికోసమో ఎదురు చూస్తున్నట్టు.

"నీకు వింతగా ఉంటుంది నేను చెప్పేది," ఆర్కాడీ మళ్లీ ప్రారంభించాడు, చాలా ప్రయత్నంతో తన శక్తులన్నిటినీ కూడదీసుకుని. "ఎంచేతంటే, ఈ అనుభూతి ఒకవిధంగా...... ఒకవిధంగా అన్నాను......నీకు సంబంధించినది. జ్ఞాపకముందో లేదో, నిన్న ఎత్తిపొడిచావు, నాకు ఏ విషయంలోనూ శ్రద్ధ లేదని," ఆర్కాడీ పెద్ద గుడిగుండంలో పడిపోయిన మనిషిలా కొట్టుకుంటున్నాడు, ప్రతిక్షణంలోనూ తను మునిగిపోతున్నట్టు తెలిసికూడా ఏదో ఆశతో ముందుకు శరీరాన్ని నెట్టుతూ, ఈ గండం ఎల్లాగయినా దాటిపోవాలనే కోరికతో చేతులూ కాళ్లూ ఆడిస్తున్న మనిషిలాగ అతను అంటున్నాడు; "అటువంటి ఎత్తిపొడుపు సామాన్యంగా....మామూలుగా.....యువకులకు తప్పదు, వాళ్లు దానికి అర్హులయినా కాకపోయినాసరే; నాకే ఇంకా కొంత ఆత్మస్థైర్యం ఉంటే..... " ("కాస్త నాకు సహాయపడు, ఏదన్నా అను, రా మరి!" ఆర్కాడీ నిస్పృహతో అనుకుంటున్నాడు. కాని మునపటిలాగే కాట్యా తలన్నా ఎత్తలేదు.)

"నా ఆశే గనక ఫలిస్తే......"

ఆనాసర్గీవ్నా కంఠధ్వని ఆ సమయంలో స్పష్టంగా దగ్గరగా మోగింది, "మీ రన్న విషయమయి నాకు పూర్తిగా నమ్మకంలేదు."

ఆర్కాడీ చటుకుని ఆగిపోయాడు. కాట్యా ముఖం పాలిపోయింది. గుడిచుట్టూ మొలిచిన చెత్తమొక్కల పక్కనించి ఒక కాలిబాట పోయింది. ఆనాసర్గీవ్నా, బజరోవ్‌తో కలిసి ఆ దారివెంట వెడుతోంది. కాట్యా ఆర్కాడీలకు ఆమె కనిపించదు, కాని వారనుకున్న ప్రతీమాటా వారికి వినపడుతుంది—ప్రతీ కదలిక, ఉచ్ఛ్వాసనిశ్వాసాలూ కూడా వినపడతాయి. వారిద్దరూ కొద్దిదూరం నడిచి, ఏదో పని ఉన్నట్టు గుడి ఎదట నిలబడ్డారు.

"మాశారూ," ఆనాసర్గీవ్నా అంది, "మన మిద్దరంకూడా పొరబడ్డాం. మన ఇద్దరికీ ప్రథమ యౌవనం గడిచిపోయింది, నాకు మరీను; జీవితాన్ని చూశాం, అలిసిపోయాం; మన మిద్దరం—దాచడం ఎందుకు?—తెలివయిన వాళ్ళం; మొదట్లో ఒకరిమీద ఒకరికి కుతూహలం కలిగింది. వింతగా ఒకళ్ళకొకళ్ళం కనిపించాం. ఆ తరవాత..."

"ఆ తరవాత నేను పేలవంగా అయిపోయాను," అన్నాడు బజరోవ్.

"అసలు జరిగిన పొరబాటుకి అది కారణం కాదని మీకు తెలుసును. కాని నిజమేమిటంటే, మనలో ఒకరి అవసరం ఇంకొకరికి లేదు. అదీ ముఖ్యవిషయం. మన ఇద్దరిలోనూ—చాలా—ఎల్లా చెప్పను?—సామ్యం ఉంది. వెంటనే ఆ విషయం మన ఇద్దరికీ తెలియలేదు. ఇంక ఆర్కాడీ......"

"అతని అవసరం మీకు ఉందా?" బజరోవ్ అడిగాడు.

"ఆగండి యవ్‌గనీ వాసిలిచ్. నే నంటే అతనికి అంత వ్యతిరేకభావం లేదని మీరే అన్నారు. అతనికి ఎప్పుడూ నే నంటే ఇష్టమేనని నాకు అనిపిస్తూంది. అతనికి అత్తగారు కాదగిన వయస్సు నా కుందని నాకు తెలుసు. కాని ఈ మధ్య అతన్నిగురించి ఎక్కువగా ఆలోచిస్తూన్నానన్న విషయం నేను మీదగ్గర దాచను. అల్లాంటి యౌవన సహజమయిన కొత్త అనుభూతిలో ఒకానొక చమత్కారం ఉంది..."

"అటువంటి సందర్భాలలో ఆకర్షణ అనే పదం చాలా ఉపయోగిస్తుంది," బజరోవ్ మధ్యలో అన్నాడు; అతనికి ఇదంతా వెగటుగా ఉందన్న సంగతి అతని గొంతుక ధ్వనిలోనే వ్యక్తమయింది. "ఆర్కాడీ ఒక సందర్భంలో మాయగా మాట్లాడ్డం ప్రారంభించాడు, మిమ్మల్ని గురించీ చెప్పలేదు, మీ చెల్లెల్ని గురించీ చెప్పలేదు...అదొక ముఖ్యలక్షణం."

"కాట్యాతో ఒక సోదరుడులాగ ఉంటున్నాడు," ఆనాసర్గీవ్నా అంది, "అంచేత అతనంటే నాకు మరీ ఇష్టంగా ఉంది. కాని వారిద్దరిమధ్యా అంత చనువు ఏర్పడకుండా ఉండవలిసిందేమో."

"ఆ ఆలోచన......అక్కగారుగా మీరు నిర్వహించవలసిన బాధ్యతవల్ల పుట్టిందా?" బజరోవ్ ఒద్దికంగా అన్నాడు.

"అంతే......ఎందుకిల్లా నిలబడిపోయాం? రండి అల్లా నడుద్దాం. ఎంత చిత్రంగా మాట్లాడుకుంటున్నాం మన మిద్దరమూ! ఇల్లా మీతో మాట్లాడగలుగుతానని నే నెన్నడూ అనుకోలేదు. మీరంటే నాకు భయం తెలుసా? అయినా మీరంటే నమ్మకం, మీ రసలు చాలా మంచివారు."

"మొదటి విషయం నే నంత మంచివాడిని కాను. రెండోవిషయం నే నంటే మీకు ఏ విధమయిన కుతూహలంకూడా లేదు. నేను మంచివాడినని మీ రంటారు...అది ఎల్లా ఉందంటే చచ్చిన శవంమీద పూలమాల వెయ్యడంలా ఉంది."

"యవ్‌గనీ వాసిలిచ్, మన బాధ్యత...' ఆనాసర్గీవ్నా అంది; ఇంతలో గాలివీచి తక్కిన మాటలను వినబడకుండా మోసుకుపోయింది "అవును, మీ ఇష్టం..." బజరోవ్ ఒక క్షణం ఆగి అన్నాడు. ఇంకేదీవినబడలేదు. అడుగులు నడిచిపోయాయి......అంతా నిశ్శబ్దం.

ఆర్కాడీ కాట్యావేపు తిరిగాడు. ఇదివరకు కూర్చున్నట్టే ఆమె కూర్చునిఉంది. కాని తల మాత్రం ఇంకా వంచుకుంది "కాథెరీనా సర్గీవ్నా," వణుకుతున్న గొంతుకతో అతను అన్నాడు, చేతులు దగ్గరగా ముడుచుకుని, "నేను నిన్ను శాశ్వతంగా, గాఢంగా, ప్రేమిస్తూన్నాను. నిన్నుతప్ప నే నెవరినీ ప్రేమించలేదు. ఇది నీతో చెప్పి, నీ అభిప్రాయాన్ని కనుక్కుందామని అనుకున్నాను. నీ పాణిగ్రహణానికి అనుమతి కోరదామనుకున్నాను. నే నంత ధనవంతుణ్ణి కాదు. కాని నేను నీకోసం ఎల్లాంటి త్యాగానికన్నా సిద్ధంగా ఉన్నాను......జవాబు చెప్పవేం? నేను చెప్పే విషయాల్లో నీకు నమ్మకం లేదా? వేళాకోళం అంటున్నానని అనుమానమా? అయితే ఈ ఆఖరురోజులు జ్ఞాపకం లేవూ! కొద్దికాలం క్రిందటనే, ఇదివరకు తిక్కలన్నీ నాలోనించి జారిపోయాయన్న సంగతి నువ్వు గుర్తించలేమా? వాటి ఛాయలు కూడా నాలో ఇప్పుడు లేవన్న సంగతి నీకు తెలియదూ? నాకేసి చూడు, ఒక్కమాట: ఉచ్చరించు......నేను ప్రేమిస్తున్నాను...... నేను ప్రేమిస్తున్నాను. ....నీకు......నమ్మకం ఉందా?"

కాట్యా ఆర్కాడీవైపు చూసింది, తీక్ష్ణంగా, కలకలలాడుతూ చూసింది. చాలాసేపు సందేహించి, చిన్న చిరునవ్వుతో మెల్లగా అంది, "ఆఁ".

ఆర్కాడీ రాతితిన్నె మీదినించి ఒక్క గంతులో లేచాడు.

"ఆ అన్నావుకామా, కాథెరీనా సర్గీవ్నా! ఆ, అన్నావా? ఏమిటి ఆమాటకి అర్థం? నేను నిన్ను ప్రేమిస్తున్నట్టు నువ్వు నమ్ముతున్నావనా? అంతేనా...లేక...నే నింక చెప్పలేకపోతున్నాను..."


"ఆ", అంది కాట్యా మళ్ళీ, ఈసారి అతనికి అర్థమయింది. ఆమె పొడుగాటి అందమయిన చేతులు తన చేతుల్లోకి లాక్కున్నాడు. సంతోషంతో అతనికి ఊపిరి ఆడలేదు. ఆ చేతుల్ని తన గుండెలకు అదుముకున్నాడు.

(22 వ పేజీ చూడుడు)

ప్రతిభాజీవులు :

జార్జ్ బెర్నార్డ్‌షా

శ్రీ ఆర్. ఎల్. శర్మ



లండను పట్టణమునకు 30 మైళ్ళ దూరమున అయోట్ సెంటులారెన్సు అనుగ్రామ మున్నది. అది సినీమాహాలుకూడ లేని చిన్న గ్రామము. అందు విశాలావరణములో నిర్మింపబడి, పన్నెండు గదులు కలిగిన మూడంతస్తుల మేడలో నొక వృద్ధుడు ప్రశాంతముగ జీవించుచుండును. దినమునకు 6 గంటలు పని చేయుట, గ్రంథపఠన, వాహ్యాళి, మధ్యాహ్నము చిన్న కునుకు తీయుట అతని నిత్యానుష్ఠానకర్మలు. రేడియో, గ్రామఫోను సంగీతము వినుట, ప్రక్కయింటివారితో లోకాభిరామాయణము అతని వినోదములు. అతని దినచర్య క్రమబద్ధమైనది. అతని వయస్సు, ఈ నెల 26 తో నతనికి 92 సంవత్సరములు నిండెను.

అవ్యక్తి సామాన్యుడు కాడు. నేటి సాహిత్య ప్రపంచములోని పెద్దలలో పెద్ద. నాటకరచయితగా ప్రపంచము మొత్తము మీద పెద్ద పారితోషికము పొందుచున్నవాడు. నోబెలు బహుమానమును, ప్రభు బిరుదమును, 'order of merit' వంటి గౌరవములనుగూడ తృణప్రాయముగ నిరాకరించినవాడు. ఇటీవల ఒక ఆంగ్ల పత్రిక రాబోవు 100 సం.లలో ప్రజల దృష్టిపథములో నుండు 10 మందిని సూచింపుడని 5 గురు ప్రముఖులను ఒక సామాన్యుని కోరగా ఒకరు తప్ప తక్కినవారు ఇతనికే తమ జాబితాలో ప్రథమ స్థానము నొసంగిరి. ఫేబియన్ సంఘ నిర్మాతలలో నొకడై సామ్యవాద సూత్రము లింతటి ప్రచారములోనికి వచ్చుటకు ప్రధానకారకులం దితడొకడు. Man and Superman, St. Joan వంటి మహోజ్వల రచనల కృతికర్త యీతడే. ఆ మహావ్యక్తి పేరు జార్జి బెర్నార్డ్‌షా యని ప్రత్యేకముగా వాకొనుట పాఠకులను న్యూనతిపరచుటయే అగును.

షా పొందిన కొన్ని ప్రశంసలు

జార్జి బెర్నార్డుషా ప్రతిభ—అతని మానసిక స్వాతంత్ర్యము, సున్నితహాస్యము-రచనా శైలి-ప్రపంచములోని విజ్ఞులనందరను ఆకర్షించినవి. నాగరికలోకమందలి నలుమూలలను జను లెల్లరు అయన అభిప్రాయములు వినుటకు కుతూహలపడుచుందురు. సాహిత్య ప్రపంచములోనే గాక యితర రంగములలోని ప్రముఖులుగూడ యితని ప్రతిభకు ప్రణమిల్లినారు. సుప్రసిద్ధ భౌతిక శాస్త్రజ్ఞుడైన ఆల్బర్టు ఎయిన్‌స్టీన్ షానుగూర్చి యిట్లు వాకొనినాడు:—'తమ కళా నైపుణ్యము నుపయోగించి ప్రతిభావంతమైన సున్నిత హాస్యము ద్వారా తమ తరమువారి నాకర్షించే శక్తి, వారి ముందర యథార్థ పరిస్థితులను అద్దములోలాగ చూపగల సామర్థ్యము చాల అల్ప సంఖ్యాకులకు మాత్రమే యుండగలదు. ఈ విధానాన్ని చక్కని నైపుణ్యముతో ప్రయోగించి మనలకు విద్యా ప్రబోధము గావించిన ఈ మహావ్యక్తికి నేను ఉద్రిక్త చిత్తముతో జోహారు చేస్తున్నాను." George Russel దేవతలు మానవ రూపంలో ఉండడ మెన్నడైనా తటస్థిస్తే అది షారూపములోనే నని నుడివినాడు. Sir Max Beerbohm తా నొకప్పుడు షా జన్మించక పోయి యుండవలసిందని కోర్కె, షా అమరుడై యుండాలను ఆశ-ఈనిమధ్య అల్లాడుచుంటి నని తుదకు కోర్కెపోయి ఆశమాత్రము మిగిలి యున్నదనియు నుడివినాడు. ఇట్లు షా పొందిన అసంఖ్యాకములైన ప్రశంసలనుండి ఎన్ని వాక్యములనైనా ఉల్లేఖింపవచ్చును.

షా జీవిత సంగ్రహము

1856 వ సం. జూలై 26 వ తేదీని డబ్లిను పట్టణమున George Carr అనే పేద గృహస్థుని కుమారుడుగా జన్మించినాడు. ఇతని తండ్రికి దుర్భర కష్టాలు కలిగినపుడుకూడా వాటిని చూచి పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వి వినోదించే అలవాటుండేది. ఇతని తల్లి సంగీతకళాప్రవీణురాలు. కార్యశూరత గల స్త్రీ. తండ్రి ద్వారా హాస్యము, తల్లి ద్వారా సంగీత పరిజ్ఞానము ఇతనికి సంక్రమించినవి. షా యొక్క పూర్వవంశీకుల్ని గురించి ఆలోచించేటప్పుడు రెండు విషయములు మరువరానివి గలవు. ఒకటి: తన పూర్వీకుల్లో నొకరు పైకి పెద్ద మనిషి తరహాగా కనపడుతూ చాటున డబ్లిన్‌లోని నిరుపేదల వద్ద తాకట్లు పట్టి ధనార్జన చేసేవారని సామ్యవాది యైన షా యిటీవల వ్రాసికొన్నాడు. రెండవ విశేషము: ప్రపంచమంతటిచేత ఐరిష్ వ్యక్తిగా భావింపబడే షా తాను Macduff అను స్కాచి ప్రభువు వంశస్థుడ నని చెప్పుకొంటూంటాడు.

ఇతని విద్యాభ్యాసము డబ్లిను పట్టణ మందలి వెస్లీ కళాశాలయందు జరిగినది. విద్యార్థిగా నున్న దినములలో అతనికి గల భవిష్యత్తు ఎంత మాత్రము సూచితము గాలేదు. ఉదర పోషణార్థ మితడు 15 వ ఏట గుమాస్తాగిరిలో ప్రవేశించినాడు. నెలకు 1½ పౌనుల జీతము. కాని ఆ ఉద్యోగము ఇతనివంటి స్వేచ్ఛాభిలాషికి సరిపడలేదు. దానికి స్వస్తి చెప్పి కుటుంబములోని తక్కినవారితోపాటు లండను పట్టణము ప్రయాణం కట్టినాడు. ఈలోపునే మాతృదేవి ద్వారా సంగీత పరిజ్ఞానము అలవడింది. స్వయం కృషివల్ల అతడు జాతీయచిత్రరచనా మండలిలోని రచనల్ని పరిశీలించి చిత్రలేఖనంలో విమర్శక జ్ఞానాన్ని సంపాదించినాడు. అదిగాక ఒక నవలగూడ రచించినాడు. అది గ్రంథ ప్రకాశకులందరిచేతా నిరాకరింపబడింది. 60 సం.ల తర్వాత అతను పంపి పంపగానే అదే నవల అంగీకరింపబడి ప్రచురింపబడినది.

లండనులో ఈతని తల్లి పిల్లలకు సంగీత పాఠాలు చెప్పడంవల్ల వచ్చిన స్వల్ప మొత్తంతోనే కుటుంబపోషణ జరుగుతుండేది. ఈ దారిద్ర్యము యితనికి సంఘములో గల లోపాల్ని, ఆర్థికవ్యత్యాసాలను నిరూపించింది. సామ్యవాదానికితడు సన్నిహితు డయ్యాడు. సిడ్నీ, బియాట్రిస్ వెబ్‌ల స్నేహ మితనికి లభించింది. ఫేబియన్ సంస్థతరఫున పనిచేశాడు. అనేక రాజకీయోపన్యాసా లిచ్చాడు.

మొదట యితని సాహిత్యకృషి 'ఋణం తీరికా, దమ్మిడీ ఆదాయం' లేని వ్యవహారంగా ఉంటూండేది. 1885 లో అతడు పాల్-మాల్ గెజిట్ పత్రికలో గ్రంథవిమర్శకుడుగా సంపాదనా పరుడయ్యాడు. ఆ పిదప సాటర్‌డే రివ్యూ, స్టార్ మున్నగు పత్రిక లీతనిని కళావిమర్శకునిగా నియమించుకొనినవి.

షా 1895_98 సం॥ల మధ్య, ఫ్రెంచి నాటక రంగానికి చౌకరకపు అనుకరణమై నిర్జీవమైన ఆంగ్ల నాటక రంగము వైద్వజమెత్తినాడు. ఘాటైన ఆవ్యాసావళి అతని నాటకరచనలరాకకు పరిస్థితులను సిద్ధము చేసినవి. కాని యితని నాటకములు మొదట నాటకశాలాధిపతుల్ని ఆకర్షించలేదు సరికదా, జుగుప్సతో చూడబడినవి. 1905 లో అతను తన నాటకాన్ని Court Theatre లో ప్రదర్శించుకొనే అవకాశం లభించింది. అది మొదలు అతని నాటకాలకోసము నాటకశాలలవారు ప్రాధేయపడసాగారు. ప్రజలు, నాటకశాలలవాళ్ళు అతని నాటకాలవల్ల ఆకర్షింపబడిన పిదపగూడ విమర్శకమహాశయులు తమ అభిప్రాయం మార్చుకోలేదు. వారవి నాటకాలే కావన్నారు.

ఈయననాటకరచన 40 సం.లు దాటిన పిదపనే సాగినది. తన రచనల్లో అత్యుత్తమమైన వాటిని 60_70 సం.ల మధ్య రచించినాడు.

ఈనాడు వెండి తెరకెక్కిన ప్రతి నాటకపు మొత్తము లాభాల్లో నూటికి పదిపాళ్ళనిక్కచ్చిగా వసూలు చేస్తాడు. ఇతడిదివరకు వ్రాసిన నాటకాలవ్రాతప్రతులే వేలకొలది పౌనులు తేగలవు. కాని వాటిని అతడిటీవలనే డబ్లిను జాతీయగ్రంథాలయమువారికి బహూకరించాడు.

1943 లో బెర్నార్డుషా సతీమణి చార్లెట్ షా చనిపోయింది. అప్పటినుండే షా తరచు తన స్వగ్రామమైన సెంటు లారెన్సులో ఉంటూన్నాడు. కాని లండనులో అతని కార్యాలయము యథాతథంగా పనిచేస్తుంటుంది. ఇతను పార్టు హాంములో వ్రాయగా ఆరచనలు లండనులో థేమ్సు తీరానున్న ఆ కార్యాలయంలో టైపు చేయబడుతవి.

ఇటీవలనే ఒకరు షాను "మీ నాటకాలు చిత్రాలుగా తీయబడడం చూడడానికి అమెరికా వెడతారా?" అని అడగ్గా "ఇక ప్రయాణమనేది లేదు. సెంటు లారెన్సుకు నేను అతుక్కొని పోయాను" అని జవాబిచ్చాడు.

షా అలవాట్లు

ఈ వృద్ధాప్యంలోకూడ షాకు సంగీతాభిరుచి తగ్గలేదు. తన ఉత్తరాలు ఎర్రసిరాతో స్వహస్తంతో వ్రాసి స్వహస్తంతో పోష్టులో పడేస్తాడు. ఉత్సాహం కల్గినపుడు పాడుకుంటూంటాడు. కాని అదివినే అవకాశం సన్నిహితులకు మాత్రమే లభిస్తుంది. ప్రక్కవీధనే వ్రాతపనిచెయ్యడం, పలుదోము కుంచెలతో కలముల మీద పేరుకొన్న మకిలిని తీసివెయ్యడం అతని అలవాట్లు.

విచిత్రవ్యక్తి

షా కన్న పరస్పర వైరుధ్యములు గల వ్యక్తి మనకు కనబడడు. ఒక వంక నోబెలు బహుమానం అంతటి గౌరవములను నిరాకరించిన షా, తన స్నేహితులైన వెబ్బుదంపతుల విషయంలో మాత్రము వారి అస్తికలు వెస్టుమినిస్టరు అబీలో భూస్థాపిత మయ్యేదాకా నిద్రపోక కృతకృత్యుడైనాడు. తాను పొగ త్రాగడు. మద్యము ముట్టడు. కాని "A diet of large cigars and plenty of whisky is no bar to old age and eminence" అని వాదిస్తాడు. తాను శాఖాహారి. ఎన్నిసార్లు వైద్యులు బ్రతిమాలినా మాంసము ముట్టలేదు. కాని సాహిత్యప్రతిభకు మానసికాభివృద్ధికి శాకాహారం తోడ్పడుతుందని నమ్మడు. "థోరూ నత్తలను తిని జీవించగలనన్నాడు. మానవులు దేనిని తినైనా జీవించగలరు. దేనికైనా అలవాటుపడగల శక్తి వాళ్ళకు ఉంది" అంటాడు. ఒక వంక అతడు గర్విష్ఠిలాగ కన్పిస్తాడు. కాని ఎవరైనా స్వీయ చరిత్ర వ్రాయమంటే 'అబ్బే నా కే విషయం పది నిమిషాలకంటె జ్ఞప్తిలో నుండదంటాడు." లండనులోని అతని కార్యాలయంలో అతని బొమ్మలుగాని, ప్రముఖులతో కలసి అతను తీయించుకొన్న ఛాయా చిత్రాలుగాని, అతని కార్యక్రమ పట్టికలుగాని ప్రదర్శించరు.

ఇట్టి పరస్పరవైరుధ్యానికి సంబంధించిన ఒకటి రెండు సంఘటనలు పేర్కొనదగినవి కలవు. యుద్ధకాలములో ఒకసారి బెర్నార్డుషా భారత దేశస్వాతంత్ర్యం మీద చేసిన ఒక ప్రకటనలో భారత స్వాతంత్ర్యమంటే ఇతరులతో సంబంధము లేక గోడలు కట్టుకోవడము కాకూడదంటూ ముక్తాయించి, తుదిని భారతదేశపు గొడవ నాకెందుకు? అని ముగించాడు. శ్రీ రాజగోపాలాచార్యులవారు ఆ ప్రకటనకు ప్రత్యుత్తర మిస్తూ "ఒకవంక అంతర్జాతీయంగా జాతులమధ్య సన్నిహితసంబంధము కావాలనే షా, భారతదేశపు వ్యవహారం తనకు పరాయిగొడవగా భావించడం దేనికి?" అని ప్రశ్నించారు.

సుమారు పదిసంవత్సరాల క్రిందట సర్ చిమన్‌లాల్ సెతల్‌వాడుగారు బొంబాయి రేడియో కేంద్రమునుండి మాట్లాడుతూ షా నుడివిన "The idiots are always in favour of inequality of income and the really great are in favour of equality" అన్న సూక్తిని తీవ్రముగా విమర్శించారు. "షా తన కొచ్చిన పారితోషికాన్ని పేదలకు పంచుతున్నాడా? ఆంగ్ల దేశములో వేలాది వేలు నిరుద్యోగులై యుండగా షా భోగభాగ్యాలతో సుఖంగా జీవించడం లేదా?" అని ప్రశ్నించాడు.

సర్ చిమన్‌లాల్ గారి సూటిప్రశ్న మనకు కొంత మొరటుగా కన్పించవచ్చునుగాని అందులో సత్యము లేకపోలేదని ఒక చిన్న సంఘటనవల్ల తెలుస్తుంది. ఒకసారి బెర్నార్డు

(18 వ పేజీ చూడుడు)

భారతప్రభుత్వ సంస్థానశాఖ విజయం

సంస్థానాలన్నీ రాష్ట్రాలతో కలసిపోవటమో, కూటములుగా ఏర్పడటమో జరిగిన వైనం

శ్రీ సీతంరాజు సుబ్రహ్మణ్యశర్మ

భారతదేశంలో బ్రిటిష్‌పరిపాలన ఆరంభమైన నాటినుండి భారత సంస్థానాధీశ్వరులు బ్రిటిష్‌వారికి సర్వవిధముల అనుకూలముగ వ్యవహరించుచు, ఈ దేశములో బ్రిటిష్ పరిపాలన స్థిరపడుటకు, సుసంఘటితమగుటకు తోడ్పడినారు. బ్రిటిష్‌వారికి సర్వవిధముల లొంగిపోనిచో, వారి సంస్థానములు—అప్పటివరకు స్వతంత్ర రాజ్యము అయివుండవచ్చును—బ్రిటిష్‌వారు వశపరచుకొనగలరను భయముతో కొంతకాలము, ఈ దేశమునుండి బ్రిటిష్‌వారు వైదొలగినచో తమ నిరంకుశ పరిపాలన సాగిపోదని గ్రహించి కొంతకాలము, సంస్థానాధీశ్వరులు బ్రిటిష్ ప్రభుత్వమునకు దాసిలొగ్గుచు, మద్దతుచేయుచు వుండెడివారు. భారతస్వాతంత్ర్య పోరాటమునకు, బాధ్యతాయుత ప్రజాప్రభుత్వ స్థాపనకు జరుగు కృషి అభ్యుదయమును విఘాతమొనర్చుటకు, బ్రిటిష్‌వారు సంస్థానాధీశ్వరులను చక్కగా వినియోగించుకొనెడివారు. బ్రిటిష్‌వారు భారతదేశమునుండి వైదొలగనున్నారని తెలిసికొన్నప్పటినుండి సంస్థానాధీశ్వరులు తమ భవిష్యత్తును గురించి ఆందోళన పడనారంభించిరి. బ్రిటిష్‌వారుకూడ రెండు శతాబ్దములుగా తమ ఆధిపత్యమును పెట్టనికోటవలె కాపాడిన ఈ మిత్రులకు అన్యాయము చేయదలచలేదు. కాని ఇండియా, పాకిస్థాన్‌ల ప్రజలకు ప్రత్యక్షముగా ప్రమాదము తెచ్చిపెట్టి, ద్రోహమొనర్చి వైదొలగినారని నిందింపబడుటకు అవకాశమిచ్చు కల్లోల పరిస్థితులను తెచ్చిపెట్టుటకుకూడ వారు సిద్ధపడలేదు. అటు సంస్థానాధీశ్వరులనుగాని, ఇటు భారత ప్రజలనుగాని అన్యాయము చేసినారను నింద తమపై లేకుండ, మధ్యేమార్గము ననుసరించుటకు వారు చిట్టచివరకు నిశ్చయించిరి.

బ్రిటిష్ పరిపాలనలో...

బ్రిటిష్‌వారు భారతదేశమును పరిపాలించుచున్నంతకాలము, భారత సంస్థానములపై సార్వభౌమత్వాధికారములను చలాయించుచుండెడివారు. ఈ అధికారముద్వారా, సంస్థానముల రక్షణ, రాకపోకలు, విదేశవ్యవహారములు, సుంకములు, తంతి, తపాలా, కొన్ని సమయములందు ఆంతరంగిక రక్షణ బాధ్యతలు భారత కేంద్ర ప్రభుత్వము స్వీకరించి, భారతదేశమంతయు ఒకే దేశముగ వ్యవహరించుటకు వీలు కలిగించెను. బ్రిటిష్‌వారీ దేశమునుండి వైదొలగదలచినప్పుడు, తాము వైదొలగినచో సార్వభౌమత్వాధికారమును రద్దుపరచెదమే గాని, వారసప్రభుత్వములకు వప్పగించమని సంస్థానాధీశ్వరులకు వాగ్దానమొనర్చిరి. సార్వభౌమత్వము రద్దు కాగానే, సూత్రప్రాయముగా నైనను, సంస్థానములు సర్వతంత్ర స్వతంత్రదేశములగును. అప్పుడు భారతదేశము ఇండియా, పాకిస్థాన్‌లుగా గాక దాదాపు 600 స్వతంత్రరాజ్యములుగా చీలిపోయి, త్వరలోనే యుద్ధములకు, విదేశదురాక్రమణలకు గురియగును. ఇట్టి ప్రమాదమునకు అవకాశముండుట భారత నాయకులు అంగీకరింపరు. పైగా వైదొలగు దేశమును నాశనమొనర్చినారను నింద బ్రిటిష్‌వారిపై నుండును అందువలన, సంస్థానములు స్వతంత్ర రాజ్యములగుటకు సూత్రప్రాయముగ అధికారమున్నా ఏ సంస్థానమునూ స్వతంత్రరాజ్యముగా బ్రిటిష్‌ప్రభుత్వము గుర్తింపదనీ, ఇతర ప్రభుత్వములను గుర్తింపనివ్వదనీ, సంస్థానములన్నీ ఏదోఒక అధినివేశములో, ఉభయుల ఇష్టప్రకారము ఏర్పరచుకున్న ఒడంబడిక ప్రకారము, చేరిపోవలెనని బ్రిటిష్‌ప్రభుత్వ ప్రధాని అట్లీ, రాజప్రతినిధి మౌంట్‌బాటన్ గారలు స్పష్టపరచిరి. సార్వభౌమత్వాధికారము రద్దయిపోవుటవలన తమ భవిష్యత్సంబంధమును గురించి ఐచ్ఛికముగా ఒడంబడిక చేసుకొనుటకు ఇండియా, పాకిస్థాన్ అధినివేశములకు భారత సంస్థానములకు ఏ ఆటంకమూ లేదు.

భారత సంస్థానముల సంఖ్య మొత్తము 565 అని కొన్ని లెక్కలలోను, 600 అని కొన్ని లెక్కలలోను వివరించారు. 'సంస్థాన' పదనిర్వచన భేదమువల్లనే ఇట్టి వ్యత్యాసము వచ్చినది. ఈ 600 సంస్థానములలో అత్యధికభాగము చాల చిన్నవి ఆధునిక పద్ధతులపై పరిపాలన, న్యాయ నిర్వహణ జరుపుటకు వాటి ఆదాయము ఏమూలకూ చాలదు. సంస్థానముల ఆదాయము సంస్థానాధీశ్వరుల కుటుంబ ఖర్చులకే సరిపోయి, ప్రజాశ్రేయోభివృద్ధికి, సుపరిపాలనకు వినియోగించుటకు సొమ్ము లేకపోవుటవలన, ఇవన్నియు చాల వెనుకబడివున్నవి. ఎక్కువ రాబడిగల పెద్ద సంస్థానములలోకూడ, సంస్థానాధీశ్వరులు బ్రిటిష్‌వారి అండ జూచుకుని, నిరంకుశపరిపాలన సాగించుచు, ఆదాయమును దుర్వ్యయమొనర్చుచుండుటవలన ఆ సంస్థానములుకూడ వెనుకబడియేయున్నవి. ఏ ఒకటి రెండో తప్ప, మిగిలిన సంస్థానములన్నియు బ్రిటిష్‌వారు వైదొలగువరకు ఈ దశలోనే వున్నవి. సంస్థానముల భూభాగము, బ్రిటిష్ పాలిత భారతభూభాగము ప్రక్క ప్రక్కనే వుండుటవలన, బ్రిటిష్ పాలిత ప్రాంతములోని తమ సోదరులు అభ్యున్నతికి వచ్చుచుండుట జూచి, తాముకూడ స్వపరిపాలనాధికారమును పొంది అభ్యున్నతినొందవలెనని సంస్థాన ప్రజలు పట్టుదల వహించి, ఉద్యమములు నడిపిరి. కాని బ్రిటిష్ సహాయముతో, నిరంకుశ సంస్థానాధీశ్వరులు, వారి కోర్కెలను ఏమంత మన్నింపలేదు.

ఆగస్టు 15 తర్వాత

బ్రిటిష్‌వారు వైదొలగుచు, ఏదో ఒక అధినివేశములో చేరవలసిందని ఆదేశమిచ్చినప్పుడు సంస్థానాధీశ్వరులు ఇక తమ ఆటలు సాగవని గ్రహించిరి స్వాతంత్ర్యము ప్రకటించుకొనుటకు తమకు హక్కువున్నా, అది నిరుపయోగమని వారు గ్రహించిరి తమ భవిష్యత్తు తమ ప్రజల మంచిపైననే ఆధారపడివున్నదనీ, ఏదో ఒక అధినివేశములో చేరనిచో తాము నాశనమైపోగలమనీ వారు గుర్తించిరి. ఏదో ఒక అధినివేశములో చేరుటకు హక్కున్ననూ, భౌగోళిక పరిస్థితులవలన సంశ్లిష్ట అధినివేశములో చేరుటకన్న వేరు గత్యంతరము లేదని కూడ వారు గుర్తించిరి. భౌగోళికముగా సంస్థానములు చాలవరకు భారత భూభాగములో నున్నవి. పాకిస్థాన్ భూభాగములో చాల తక్కువ సంస్థానము లున్నవి. అందువలన, గత్యంతరములేక, ఆగస్టు 15 వ తేదీలోగానే, హైదరాబాద్, కాశ్మీర్, జునగఢ్, కలత్‌లు తప్ప తక్కినవన్నియు సంశ్లిష్ట అధినివేశములతో చేరిపోయినవి. భారత భూభాగములోనున్న జునాగఢ్ పాకిస్థాన్‌లో చేరుటవలన, ప్రజలు తిరుగుబాటుజేసి, రాజును పదచ్యుతునొనర్చి, భారతయూనియన్‌లో చేరిరి. కలత్ పాకిస్థాన్‌లోను, కాశ్మీర్ భారత యూనియన్‌లోను చేరినవి. ఒక్క హైదరాబాద్ మాత్ర మింకను సూత్రప్రాయ స్వతంత్రతను పట్టుకు వ్రేలాడుచున్నది.

ప్రజా ఉద్యమములు

భారతదేశము స్వతంత్రమైన తర్వాత సంస్థాన ప్రజలలో రాజకీయచైతన్యము ఆశించనంత త్వరగా వృద్ధిపొందినది. తోటి భారత ప్రజలవలెనే తాముకూడ బాధ్యతాయుత ప్రభుత్వము లేర్పాటు చేసుకొనవలెనను వాంఛ ప్రబలినది. అన్ని సంస్థానములలో ప్రజాఉద్యమములు విజృంభించినవి. ఇన్నాళ్లు తమకు సురక్షకులుగా వున్న బ్రిటిషువారు వైదొలగి పోయిరి. కాబట్టి ప్రజాభీష్టమును నిర్లక్ష్యము చేయుటకు సంస్థానాధీశ్వరులకు బలము, ధైర్యము చాలలేదు. క్రమేణా, అన్ని సంస్థానములలోను, ఒక్క హైదరాబాద్‌లో తప్ప, బాధ్యతాయుత ప్రజా ప్రభుత్వము లేర్పడినవి. సంస్థానములలో అత్యధికము చిన్నచిన్నవై, వాని ఆదాయము పరిపాలనానిర్వహణకే సరిపోకుండుటవలన, అట్టి వానిలో బాధ్యతాయుత ప్రజాప్రభుత్వము స్థాపించినచో ఏర్పరచవలసివచ్చు సంస్థల కగు ఖర్చు భరించుట అసంభవమగును. పైగా ఈ సంస్థానములు అతి చిన్నవగుటవలన బాధ్యతాయుత ప్రభుత్వమొక తమాషాగా పరిణమించును. ఇట్టి సంస్థానములను సంశ్లిష్ట భారత రాష్ట్రములలో చేర్చవలెనని ప్రజలు ఆందోళన చాలరోజుల నుండి జరుపుచుండిరిగాని ఇప్పటికది సంస్థానాధీశ్వరుల చెవి కెక్కినది. కొన్ని ప్రాంతములలో ఇట్టి చిన్నచిన్న సంస్థానముల ప్రభువులు కూడ బలుకుకుని తామందరు ఒక కూటముగ ఏర్పడి, తమ సంస్థానముల సుపరిపాలనకు వీలుకలుగ జేయవలెనని నిశ్చయించుకొనిరి. ఇట్టి నిర్ణయములకు భారతప్రభుత్వ సంస్థానశాఖ ప్రోద్బలము చాలవరకు కారణ మనుట నిస్సందేహము.

ఒరిస్సా, సి. పి. సంస్థానాలు

చిన్న సంస్థానాలు కూటములుగ ఏర్పడవలెనని, లేక సంశ్లిష్టరాష్ట్రములతో కలసిపోవలెనని మొట్టమొదట ఆందోళన ప్రారంభించినది ఒరిస్సా, సి. పి. సంస్థానముల ప్రజలు. ఆగస్టు 15 వ తేదీ తర్వాత ఒరిస్సా, సి. పి. సంస్థానములన్నియు కలసి 'తూర్పుసంస్థానకూటమి'గా ఏర్పడి, ప్రజలపై ఎప్పటివలె నిరంకుశాధికారము సాగించుటకు ఏకపోలీసుదళము, ఏక న్యాయవిచారణ, కేంద్ర ప్రభుత్వములో ఈ సంస్థానముల ప్రయోజనములను రక్షించుటకు ఒక రకపు ఏకప్రభుత్వము ఏర్పరచవలెనని, ఈ సంస్థానముల ప్రభువులు నిర్ణయించిరి. ఒరిస్సా రాష్ట్రము చాల చిన్నది; అది ఎప్పుడూ లోటు రాష్ట్రమే ఒరిస్సారాష్ట్ర భూభాగమెంతో సంస్థానముల భూభాగమంత యున్నది. ఒరిస్సా ప్రజలు చాల ఎక్కువ జాతీయాభిమానము కలవారు; పట్టుబట్టి ఎట్లైనను తమ పంతము నెగ్గించుకొనగల్గినవారు. ఒరిస్సా, సి. పి. సంస్థానములు ఒక కూటమిగా ఏర్పడుటకన్న ఒరిస్సా సంస్థానములన్నియు రాష్ట్రములో కలసిపోయిన వాని స్థితియు, రాష్ట్రముస్థితియు మిక్కిలి బాగుపడును. అందువలన ఒరిస్సా రాష్ట్రప్రజల సహాయముతో సంస్థానప్రజలు సంస్థానాధీశ్వరులను ధిక్కరింప జొచ్చిరి. నీలగిరి సంస్థానములో ప్రజలధాటికి తాళలేక సంస్థానాధీశ్వరుడు పారిపోవలసివచ్చెను. ఎట్లైనను తమ 'రాజరికము' నిలబెట్టుకొనుట పదివేలుగా సంస్థానాధీశ్వరులందరు భావించుచుండిరి. అట్టి సమయమున ఏకీకరణోద్యమము ప్రారంభమైనది. సంస్థానాధీశ్వరులకు వారసత్వము, ఇప్పు డనుభవించుచున్న మర్యాదలు, లాంఛనములు, భరణము శాశ్వతముగా యిచ్చుట, వారి సంస్థానముల పరిపాలనను సంపూర్ణముగ భారతప్రభుత్వము వశపరచుకుని, రాష్ట్రప్రభుత్వమునకు వప్పజెప్పుట, అను ప్రాతిపదికలపై సంప్రదింపులు ప్రారంభమైనవి. సంస్థాన శాఖామాత్యుడు సర్దార్ పటేల్ డిశెంబరునెల రెండవవారములో కటక్ వెళ్ళి, సంస్థానాధీశ్వరులతో సంప్రదింపులు జరిపి పై వరతుల ప్రకారము ఒడంబడిక కుదిర్చినాడు ఈ ఒడంబడిక పై డిశెంబరు 14 వ తేదీన సంతకములు జరిగినవి ఇటువంటి ఒడంబడికయే ఒకటి 1948 వ సం. జనవరి ఒకటవ తేదీన సి. పి. సంస్థానాధీశ్వరులతో జరిగినది. ఒరిస్సా సంస్థానములు ఒరిస్సా రాష్ట్రములోను, సి. పి. సంస్థానములు సి. పి. రాష్ట్రములోను కలిపివేసిరి వీనిని గురించిన ఇతర వివరములు ఈ వ్యాసము చివర పొందుపరచిన పట్టికలో చూపించబడినది. మొదట్లో ఒరిస్సాలో చేర్చబడిన, సరికేల, ఖర్సావన్ సంస్థానములు, తర్వాత బీహార్ రాష్ట్ర ప్రభుత్వమునకు వప్పజెప్పిరి.

దక్కన్ సంస్థానాలు

ఒరిస్సా, చట్టిస్‌ఘర్ (సి. పి.) సంస్థానాలు సంశ్లిష్ట రాష్ట్రాలతో కలసి పోవటంతో భారతదేశంలోని చిన్నచిన్న సంస్థానాలన్నింటిలోను పెద్ద సంచలనం ప్రారంభమైంది. అప్పటివరకు ఒక కూటమిగా ఏర్పడవలెనను కుంటున్న దక్కన్ సంస్థానాధీశ్వరులు తమ సంస్థానాలు బొంబాయి రాష్ట్రంలో కలిసిపోవటం ప్రజలకు తమకుకూడ లాభదాయకమని గ్రహించి, ముందుకు వచ్చారు. ఒక్క కొల్హాపూర్ తప్ప తక్కిన 17 దక్కన్ సంస్థానాలు బొంబాయి రాష్ట్రంలో కలసిపోవటానికి అంగీకరిస్తూ ఫిబ్రవరి 19 వ తేదీన ఒడంబడికపై సంతకంచేశారు. వాస్తవానికి ఈ ఒడంబడిక వలన సంస్థానాధీశ్వరుల హక్కులన్నియు కాపాడబడినవి; బాధ్యతలన్నియు తొలగింపబడినవి. ఇంతకన్న వారు కోరదగిన దేమున్నది!

గుజరాత్ సంస్థానాలు

బొంబాయి రాష్ట్రంలో వున్న గుజరాత్ సంస్థానాలు, బరోడా, సౌరాష్ట్ర సంస్థానాలు గాక, బొంబాయి రాష్ట్రంలో కలసి పోవటానికి ముందుకు వచ్చాయి. వీటి సంఖ్య మొత్తం 157 వున్నా, ఇవన్నీ చిన్న చిన్నవై, ఒక కూటమిగావుండక చెల్లాచెదరుగా వుండుటవలనా, వీనిలో కొన్ని ఇండియా-పాకిస్థాన్ సరిహద్దులో నుండి, కీలక ప్రాముఖ్యత కలవగుట వలనా, వీటినన్నిటిని వేరే ఒక కూటమిగా ఏర్పరచక బొంబాయి రాష్ట్రంలోనే కలిపివేశారు. ఈ ఒడంబడికపై మార్చి 17 వ తేదీన సంతకాలు జరిగినవి. జూన్ 10 వ తేదీ నుంచి పరిపాలన బొంబాయిరాష్ట్ర ప్రభుత్వం వశపరచుకున్నది. ఇదివరకు కొంతకాలము బరోడా సంస్థానంలో కలిపివేసిన కొన్ని చిన్న సంస్థానాలను కూడా ఇప్పుడు బొంబాయిరాష్ట్ర ప్రభుత్వానికి వశపరచారు.

ఇతర ప్రాంతాలలో

లోహారూ, దుజనా, టోడీ సంస్థానాలు తూర్పు పంజాబ్ రాష్ట్రంలోను, బనగానపల్లి, పుదుక్కోట సంస్థానాలు మద్రాసు రాష్ట్రంలోను ఈ సంవత్సరారంభంలో కలసిపోయాయి.

హిమాచల ప్రదేశ్, కచ్

పంజాబ్ పర్వతాలలో సంస్థానాలు చాల వెనకబడి వున్నవి. ఈ ప్రాంతముల అభివృద్ధికి ఎక్కువ అవకాశము లున్నవి. వాని అభివృద్ధి భారతదేశమున కంతకు ప్రాముఖ్యమైనది. కాబట్టి వీనిని ఏ రాష్ట్రప్రభుత్వములోను కలిపివేయక, అభివృద్ధికి ఎక్కువసొమ్ము వినియోగించగల కేంద్రప్రభుత్వమే వశపరచుకొని, పరిపాలించవలసిందని ఈ సంస్థానాల ప్రభువులు కోరిరి. అందువలన వీని నన్నిటిని 'హిమాచల ప్రదేశ్' అను ప్రత్యేకరాష్ట్రముగా ఏర్పరచి, కేంద్రప్రభుత్వమే పరిపాలించుటకు నిర్ణయించబడినది. ఈ ఒడంబడిక మార్చి 8 వ తేదీన జరిగినది.

కచ్ సంస్థానము సింధురాష్ట్రపు సరిహద్దున, సముద్రతీరమున వున్నది. దేశరక్షణకు అతి కీలక

(16 వ పేజీ చూడుడు)

భారత రాజకీయాలు :

విదేశస్థునిచే భారతప్రభుత్వ నిషేధాజ్ఞల ధిక్కారణ

భారతప్రభుత్వ నిబంధనలను విదేశీయులు ఉల్లంఘించటం మనను అగౌరవ పరచటము న్యూతిపరచటము అగును. కాబట్టి, అట్టి విషయములను ఏ మాత్రము సహింపలేము. జూలై 19 వ తేదీన సిడ్నీ కాటన్ అను ఆస్ట్రేలియా దేశ సుడు భారతప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ కరాచీనుండి నేరుగా హైదరాబాద్ కు విమానంలో వెళ్లాడు. ఇది భారతప్రభుత్వ నిబంధనలకేగాక అంతర్జాతీయ విమానముల నిబంధనలను నిర్ణయిస్తూ తయారుచేసిన చికాగో ఛార్టర్ కే విరుద్ధమైన చర్య. ఒకటిన్నర టన్నుల మందులను పేరుతో 4 టన్నుల ఆయుధములనే అతడు హైదరాబాద్ చేరవేసినట్లు నమ్మకముగా తెలుస్తున్నది. తణిఖీకి బొంబాయిలో దిగినట్లయితే తన దొంగ వ్యాపారము బయటపడిపోవు ననియే అతడు నేరుగా ప్రయాణము చేసెను. కరాచీ నుండి నేరుగా హైదరాబాద్ రాక, కరాచీనుండి సముద్రముమీదుగా గోవా వచ్చి అక్కడి నుండి 45 మైళ్ళ దూరము మాత్రమే భారత భూభాగముపై ఎగిరి, హైదరాబాద్ భూభాగమును అతడు చేరినట్లు తెలుస్తున్నది. కరాచీనుండి నేరుగా భారత భూభాగముపై నుండి వచ్చినచో భారత విమానాలు తనను పడగొట్టగలవని తలచియే ఆతడట్లు చేసెను.

భారత ప్రభుత్వ విమానయాన నిబంధనల ప్రకారము, భారత భూభాగముపైగా వెళ్ళు ప్రతివిమానము కలకత్తా, ఢిల్లీ, బొంబాయి విమానాశ్రయములలో ఎక్కడనో ఒకచోటనైనా ఆగి, సుంకపు తణిఖీ చేయించుకుని వెళ్ళవలెను. ఈ సంగతి పాకిస్థాన్ ప్రభుత్వమునకు తెలియును. ఇట్టి నిబంధన ఉన్నట్లు సిడ్నీ కాటనుకు కూడా తెలియును. సిడ్నీ కాటన్ గత రెండు నెలలనుండి తన ఆరు విమానములలో హైదరాబాద్ కు ఆయుధాలు విరివిగా చేరవేస్తున్నాడు. తాను బొంబాయిలో దిగినచో అరెస్టు చేసెదరేమోనని అతని భయము. తన విమానము పడగొట్టి, పాకిస్థాన్ మీదా, హైదరాబాద్ మీదా భారత ప్రభుత్వం వెంటనే యుద్ధం ప్రకటింపదని అతడి ధైర్యము. అందువలననే అతడంత ధైర్యముగా భారతప్రభుత్వ నిబంధనల నుల్లంఘించెను.

ఇట్టి అకృత్యము జరిపినందుకు కాటన్ ను శిక్షించినను, అతని విమానమును పడగొట్టినను అంతర్జాతీయ న్యాయశాస్త్రమునకు ఏమాత్రము విరుద్ధము కాదు. ఒకవేళ భారత ప్రభుత్వ మిట్టి చర్యను తీసికొన్నను బ్రిటిషు ప్రభుత్వము, ఆస్ట్రేలియాప్రభుత్వము కూడ దానిని సమర్థించును.

ఈ అనధికార ప్రయాణమునకు బాధ్యత కొంతవరకు పాకిస్థాన్, హైదరాబాద్ ప్రభుత్వములు వహింపవలసియున్నది. సిడ్నీ కాటన్ జరిపినది అక్రమ చర్యయనీ, దానిని తీవ్రముగా నిరసించుచుంటిమనీ పాకిస్థాన్ ప్రభుత్వము తెలియజేసినది. అయినచో అతడు కరాచీకి తిరిగివచ్చినప్పుడు ఎందుకు అరెస్టుచేయలేదు. పైకి ఎట్టి మాటలు చెప్పినా పాకిస్థాన్ ప్రభుత్వ మద్దతులేనిదే కాటన్ ఇట్టి పని చేసినాడని విశ్వసించుటకు వీలులేదు. ఇందుకు పాకిస్థాన్ ప్రభుత్వము భారతప్రభుత్వమునకు సరియైన సంజాయిషీ యివ్వనిచో, ఇండియా పాకిస్థాన్ లమధ్య విమానయానము సాంతము రద్దుచేయబడవలెను. తూర్పు బెంగాల్ నుంచి పశ్చిమ పాకిస్థాన్ కు ఓడలపై వెళ్ళవలసివచ్చినప్పుడుగాని పాకిస్థాన్ పాట్లు తెలిసిరావు.

నిజాం భారతప్రభుత్వాల సంబంధాలు అతి క్లిష్టదశలో నున్నవి. తాము శాంతియుత పరిష్కారాలనే ఆశించుచుంటిమనీ, భారత ప్రభుత్వమే మితిమీరిన కోర్కెలు కోరుచున్నదనీ హైదరాబాద్ మంత్రులు చెప్పుచుందురు. అయినను వారి యుద్ధప్రయత్నములు వారు చేయుచునే యుందురు. ఇండియాప్రభుత్వముతో శాంతియుత పరిష్కారమునే ఆశించెడివారైనచో హైదరాబాద్ ప్రభుత్వము సిడ్నీ కాటన్ ను సంస్థానములోనికి రానిచ్చెడిదే కాదు.

కాటన్ తన బాధ్యతపైననే వచ్చినాడన్నంతనే సంస్థాన ప్రభుత్వ బాధ్యత తీరిపోదు. ఒకవేళ విదేశీయులచే ఇట్టి చర్యలు జరిపించి భారత ప్రభుత్వ సత్తాను పరీక్షింపదలచినచో హైదరాబాద్ చాల పొరపాటు పడుచున్నదని చెప్పవలెను. హైదరాబాద్ పై సైనికచర్య జరపలేక కాదు, అంతవరకు పోవట మెందుకనే భారత ప్రభుత్వము ఆలోచిస్తున్నది. హైదరాబాద్ ఇంకా ఇట్టి అకృత్యములు జరిపించుచుండినచో భారత ప్రభుత్వమును ఒక నిర్ణయమునకు వత్తిడి చేసినట్లే భావించవలెను.

బహుశః ఇకొక పర్యాయ మిట్టి సాహస చర్యకు సిడ్నీ కాటన్ పూనుకొనకపోవచ్చును. ఇక ముందెట్టి విమానము ఇట్టి అక్రమ ప్రయాణమునకు పూనుకున్నను భారతప్రభుత్వము సహింపదనుట తథ్యము. సిడ్నీ కాటన్ కు తగు శిక్ష జరిగినచో ఇతరులకుకూడ గుణపాఠముగా నుండెడిది.

సంయుక్తమహారాష్ట్ర రాష్ట్రస్థాపనకు ప్రయత్నాలు

భాషారాష్ట్ర విచారణ సంఘము ఇప్పుడు సమావేశమగుచున్నది. త్వరలోనే ఈ సంఘము వారు అన్ని రాష్ట్రములలోను పర్యటించి, ఆయా భాషా రాష్ట్రములు స్థాపించవలసిన ఆవశ్యకత, వాని సరిహద్దులను గూర్చి విచారణ సల్పెదరు. ఈ సంఘము ఎదుట తమతమ వాదములను తెలియపరచుటకు అన్ని రాష్ట్రముల వారూ, ఒక్క ఆంధ్రులు తప్ప, చాల చురుకుగా ప్రయత్నములు జరుపుచున్నారు. సంయుక్త మహారాష్ట్ర రాష్ట్రస్థాపనకు గత కొద్ది వారములుగా మహారాష్ట్రులు చేయుచున్న కృషిని పరిశీలించినచో ఆంధ్రు లెంత అలసత వహించియున్నారో బోధపడగలదు.

సి. పి., బొంబాయి రాష్ట్రములలో నున్న మరాఠీ ప్రజల నందరినీ జేర్చి ఒక్క రాష్ట్రముగా ఏర్పరచవలెనని కోరుటకు 'సంయుక్త మహారాష్ట్ర సమావేశము' నొకదానిని బొంబాయిలో ఆగస్టు నెలారంభములో జరుపనున్నారు. ఈ సమావేశమునకు ముందు, ప్రాథమిక విషయములను గురించి చర్చించుటకు నాగపూర్, మహారాష్ట్ర, మహావిదర్భ రాష్ట్ర కాంగ్రెస్ లచే నియమింపబడిన ఉపసంఘములు నాగపూర్ లో సమావేశము కావలెనని శ్రీ శంకరరావు దేవు ఆశించినాడు. ఈ సమావేశము రానున్న వారములో జరుగనున్నది

ఈ మధ్య బొంబాయిలో మహారాష్ట్ర పెద్దలందరూ కలసి ఏర్పాటు చేసిన ఒకసభలో డా. డి. ఆర్. గాడ్గిల్ సంయుక్త మహారాష్ట్ర ఉద్యమ ఆశయములను వివరించినాడు. బొంబాయిలోని మహారాష్ట్ర ప్రముఖు లందరు ఈ సభకు విచ్చేసిరి. అన్ని మహారాష్ట్ర జిల్లాల నుండి కాంగ్రెస్ వర్కర్లు గత వారములో నాలో సమావేశమై, తమతమ జిల్లాలను, ఏయే ఇతర ప్రాంతములను సంయుక్త మహారాష్ట్రములో జేర్చవలెనో, అందుకు తమ ఆధారములు, వాదములు ఏమిటో పటాస్కర్ గారికి వివరించి చెప్పిరి. భాషారాష్ట్ర విచారణ సంఘంలో మహారాష్ట్ర సభ్యుడు పటాస్కర్. బొంబాయిలోని మహారాష్ట్ర వాణిజ్యసంస్థ ఈ మధ్య సమావేశమై కార్వార్ నుండి నాగపూర్ వరకు బొంబాయి పట్టణంతో సహా, సంయుక్త మహారాష్ట్ర రాష్ట్రము నేర్పాటు చేయవలెనని ఒక తీర్మానము చేసెను. బొంబాయి పౌరులలో మహారాష్ట్ర ప్రముఖు లందరు సమావేశమై బొంబాయి పట్టణముతో సహా సంయుక్త మహారాష్ట్ర రాష్ట్రము నేర్పాటు చేయవలెనని ఒక తీర్మానము చేసిరి. మహారాష్ట్ర పత్రికా రచయితల ఉపసంఘము ఈ మధ్య సమావేశమై సంయుక్త మహారాష్ట్ర రాష్ట్ర స్థాపనకు ఎట్టి ప్రచారము జరుపవలెనో నిర్ణయించి, ప్రచారము తీవ్రతర మొనర్చుటకు నిశ్చయించెను. మహారాష్ట్ర పట్టణమేగాక, కేవలము కన్నడ ప్రాంతములగు బెల్గాం, కార్వార్ జిల్లాలను గూడా సంయుక్త మహారాష్ట్రములో జేర్చవలెనని వీరందరు కోరుచున్నారు. కన్నడిగలు ఈ సూచనను ప్రతిఘటింతురనుటలో సందేహము లేదు.

'సంయుక్త మహారాష్ట్ర' ఉద్యమము ప్రారంభమై ఇప్పటికి రెండుసంవత్సరము లైనది. అప్పుడే వారు అన్నిజిల్లాలలోను, ప్రతిగ్రామములోను తిరిగి ప్రచారముచేయుచున్నారు. మహారాష్ట్ర విద్యావేత్తలగు డా. గాడ్గిల్ మొదలగువారు విషయసేకరణలో మునిగి వున్నారు. భాషారాష్ట్రవిచారణసంఘము ఎదుట తమ కోర్కెలను సహేతుకముగ రుజువు చేసికొనగలమని వీరందరు ధైర్యముతో నున్నారు.

ఇక ఆంధ్రుల విషయమును పరిశీలించినచో ఇట్టి కార్యక్రమమేమియు జరుగుట లేదని చెప్పకనే మనకు తెలియును. ఆంధ్రమహాసభ ఎన్నో ఏండ్లనుండి వున్నది కాని మహారాష్ట్రసభ రెండేండ్లలో సాధించినంతకూడ సాధించలేదు. కాంగ్రెస్ నాయకులు, మంత్రులు రాష్ట్రమును గురించి, అస్పష్టప్రకటనలను మించి ఏ తీవ్రకృషీ చేయుటకు తీరుబడిలేకుండా వున్నట్లున్నారు. ఆంధ్రరాష్ట్రము తప్పక స్థాపింపబడగలదు. దానికి వీరి కృషితో నిమిత్తమేమియు లేదు. కాని ఆ రాష్ట్రము ఎంత అసమగ్రముగా నుండునన్నదే ఇప్పుడు ప్రజలను బాధించుచున్న ప్రశ్న.

కాశ్మీర్ లో యుద్ధవిరమణ సంభవమా?

భద్రతామండలి కాశ్మీర్ ఉపసంఘము గత మూడు వారములుగ ఇండియా, పాకిస్థాన్ ప్రభుత్వములతో సంప్రదింపులు జరుపుచున్నది. కాశ్మీరు సమస్యను పూర్తిగా వీరిప్పటికి అవగాహన చేసుకుని, ఉభయపక్షముల వాదములను గ్రహించి, భవిష్యత్తులో తామెట్లు వ్యవహరించినచో తమ కర్తవ్యమును నిర్వర్తింప గలరో నిర్ణయించుకొన్నారని భావించవచ్చును. కాశ్మీర్ ఉపసంఘమునకు భద్రతామండలి చేసిన ఆదేశములో మొదటి సూచనయగు యుద్ధ విరమణ సాధించుటకు వీరిప్పుడు ప్రయత్నించుచున్నారు.

భద్రతామండలి తీర్మానము ప్రకారమైనను యుద్ధవిరమణకు తొలిచర్య జరుపవలసినది పాకిస్థాన్ ప్రభుత్వమే. కాశ్మీర్ నుండి దుండగులను, పాకిస్థాన్ ప్రజలను పూర్తిగా తొలిగించుటకు ముందు పాకిస్థాన్ ప్రభుత్వము ఏర్పాటు చేయవలెను. కాశ్మీర్ నుండి దుండగులు వైదొలగిపోగలరని కాశ్మీర్ ఉపసంఘము భావించినప్పుడు, భారత సేనలనుకూడ, కొంతవరకు తగ్గించవలసిందని భారత ప్రభుత్వమును కోరవచ్చును. కాబట్టి కాశ్మీర్ నుండి దుండగులు వైదొలగుచున్నారను విషయము ముందు కాశ్మీర్ ఉపసంఘమునకు, తరువాత భారత ప్రభుత్వమునకు పూర్తిగా, సంతృప్తికరముగా రుజువు కావలెను. అప్పుడే కాశ్మీర్ నుండి భారతసేనల ఉపసంహరణ ప్రారంభమగును. అయితే, దుండగులను తొలగించుటకు పాకిస్థాన్ బాధ్యతవహించునా అన్నదే ఇప్పుడు ముఖ్యమైన ప్రశ్న. ప్రస్తుతము కాశ్మీరులో పోరాడుతున్నది. పాకిస్థాన్ సేనలే ననుట సైనినిస్సందేహము. పాకిస్థాన్ ఆయుధసామగ్రి, కులు కాశ్మీర్ లో వినియోగింపబడుచున్న విషయము భద్రతామండలి ఉపసంఘమునకు భారతప్రభుత్వము రుజువుపరచినది. ఈ ఉపసంఘసభ్యులలో కొందరు నేరుగా కాశ్మీర్ కే వెళ్ళెదరట వీరు 26 వ తేదీన ప్రయాణమై శ్రీనగర్ వెళ్ళెదరని తెలుస్తున్నది. దుండగుల అత్యాచారములను ప్రత్యక్షముగా పరిశీలించియు, పట్టుకొనబడిన ఖైదీలను మాట్లాడించియు వీరు పాకిస్థాన్ ప్రభుత్వ నేరమును గూర్చి ఒక దృఢనిశ్చితాభిప్రాయమునకు రాగలరు. కాశ్మీర్ లో యుద్ధము చేస్తున్న దుండగులకు పాకిస్థాన్ ఏవిధముగా బాధ్యత వహించునో చూడవలసియున్నది. కాశ్మీర్ లోని దుండగులను తాను తొలగించలేనని, వారిపై తన కట్టి అధికారమూ లేదనీ పాకిస్థాన్ ప్రభుత్వము వాదించవచ్చును. లేదా, బాధ్యత తనపై వేసుకుని, ఎట్లాగూ పోరాడుచున్నది తన సైనికులే కాబట్టి, వారిని తొలగించినా తొలగించవచ్చును. దుండగులను తొలగించటానికి పాకిస్థాన్ పూచీవహించకపోతే యుద్ధము జరిగితీరవలసిందే. అప్పుడు భద్రతామండలి సంఘము తన కర్తవ్యము నెరవేర్చలేకపోవుట అందుకు నింద పాకిస్థానే భరించవలెను. ఒకవేళ దుండగులను తొలగించటానికి పాకిస్థాన్ పూనుకుని, వారి నుపహరించినచో, భారతసేనలు సరిహద్దులలో కీలకప్రాంతములను ఆక్రమించుకుని, ఇకముందు దుండగులు మరిరారని నిశ్చయమైన తర్వాత, సరిహద్దులలో కొంతమందిని కాపుంచి, తక్కినవారిని ఉపసంహరించవచ్చును. అంతటితో కాశ్మీర్ యుద్ధము ముగిసిపోవును. అంతేగాని యుద్ధ విరమణ జరిగిన తర్వాత దుండగులు ఇంకా కాశ్మీర్ లో వుండే ఏ షరతుకూ భారతప్రభుత్వం అంగీకరింపరాదు. యుద్ధవిరమణ ఈవిధముగా జరిగినతర్వాతనే ప్లెబిసైట్ విషయం ఆలోచించవలెను. భద్రతామండలి ఉపసంఘము పూనుకున్న ఈ యుద్ధ విరమణ కార్యము జయప్రదముగా నెరవేరునని ఆశించుట కట్టిఆధారము లేదు. దుండగులను తొలగించుటకు పాకిస్థాన్ అంగీకరించుచో, ఇది వరకు వారిని పంపి శ్రమ, వృధావ్యయము ఎందుకు చేసెడిది! కాబట్టి యుద్ధము తీవ్రతరమొనర్చి దుండగులను పూర్తిగా పారద్రోలుటకే భారతప్రభుత్వము కృషిచేయవలెను గాని ఈ సంఘముపై ఏ ఆశలూ పెట్టుకొనకూడదు.

కమ్యూనిస్టుపార్టీ విరుద్ధ విధానాలు

[శ్రీ సహజానందం]

ఇండియా కమ్యూనిస్టుపార్టీ రెండవ సమావేశం కలకత్తాలో మార్చి మొదటివారంలో జరిగింది. ఈ సమావేశపు 'చారిత్రక ప్రాముఖ్యాన్ని గురించి వ్యాఖ్యానిస్తూ,పార్టీ విధానంలో కల్గిన మార్పునుగురించి ఇలా చెప్పారు:

"అయిదేళ్లనుంచి, ఇంకెక్కువకాలంనుంచి, ఉంటూవస్తున్న సంస్కారవాదపు అపమార్గాన్ని సంపూర్ణంగా విసర్జించటం జరిగింది." అని.

కొత్తవిధానం గురించి:

It (the second Congress—V. S) displayed a mgnificent and united initiative of the rank and file deleg̲ates and the leadership of the party *in evolving a revolutionary line, policy and tactice in a period of revolutionary crisis in India.*"

(ఇటాలిక్స్ రచయితవి)

భారతదేశంలో పరిస్థితి విప్లవంవైపు మొగ్గి ఉంది! ఇటువంటి విప్లవసంధిలో విప్లవపంథాను విప్లవవిధానాన్ని, విప్లవతంత్రాన్ని పార్టీ ప్రతినిధులు, నాయకులు నిర్దేశించారు.

గడచిన అయిదేళ్ళనుంచీ పార్టీ ఎక్కువగా సంస్కారవాదాన్ని అనుసరించింది. ఇకముందు విప్లవవాదాన్నే అనుసరిస్తుంది నిశ్చయంగా.

ఈ సమావేశంలో పార్టీనాయకులు బాగా స్వవిమర్శ చేసుకున్నారు. ఆ తీవ్రమైన ఆత్మవిమర్శనుబట్టి పాతవిధానాన్ని సంస్కారవాదంగా నిర్ణయించారు.

వ్యక్తికి ఎలాగో, అలాగే పార్టీకీ ఆత్మ—విమర్శ మంచిది. అవసరం. అన్ని పార్టీలకూ ఆదర్శంగా ఉండాలి. ఎవరి లోపాలను వారు బైటపెట్టుకున్నందువలన, ప్రతిపక్షులకు వ్యతిరేకప్రచారం చేయటానికి అవకాశం లభిస్తుంది. లభించినా, విమర్శవలన చెడుబదులు మంచే సిద్ధిస్తుంది. ఎవటివానికి స్వ-లోపాలు తెలియనీయకుండా కప్పి ఉంచినందువలన స్వ-పక్షం బలపడదు (ఆ లోపాలు బైటవాడు తెలుసుకోలేడనుకోటం భ్రమ. కాకపోతే ఎదటపక్షంలో ఉన్నవాడు వాటిని తన బలిమికోసం ఉపయోగించవచ్చు దుష్ప్రచారం చెయ్యవచ్చు. అంతమాత్రాన బెదిరిపోవలసిన అవసరం లేదు). తన లోపాలను తనకు తానై గుర్తించి, వాటిని తొలగించుకొనేందుకై ప్రయత్నించటం వలన స్వ-పక్షం ఉన్న దౌర్బల్యం పోయి స్థిరంగా బలపడుతుంది. ఈ ఆత్మ-విమర్శ సరిగా ఉందా? లేదా? ఇది కూడా లోపభూయిష్ఠంగా ఉందా? అనే విషయం అతిముఖ్యం. ఎందుకంటే, పాత తప్పులను గుర్తించటం ఎక్కువ కష్టంకాదు. కాని, మళ్ళీ నిర్వచించబోయే విధానంలో కొత్త తప్పులు లేకుండా పరిశీలన చేయటం బహుకష్టం. అత్యవసరం. ఈ సూత్రాన్ని పాటించినప్పుడే, సరైన మార్గం కనబడుతుంది.

ఈ దృష్టితో కమ్యూనిస్టుపార్టీ వ్యవహారాలను పరిశీలించాలి.

గతాన్ని గురించిన విమర్శ మొదట చూద్దాం.

యుద్ధకాలంలో పార్టీ ఆలోచన ఎంత లోపభూయిష్ఠంగా ఉందీ కామ్రేడ్ రణదేవు చెప్పాడు.

"ఫాసిస్టుశక్తులకు యుద్ధరంగంలో కలిగే పరాజయంవలన సామ్రాజ్యతత్వంకూడా అదంతట అదే తనకు తానై క్షీణించి నిర్మూలితమవుతుందని, తత్ఫలితంగా ప్రజలందరి విమోచనా సిద్ధిస్తుందని తప్పుగా భావించటంవల్ల ఆ సమయంలో పొరపాట్లు జరిగినయ్."

ఆ రోజుల్లో ఇది ప్రజాయుద్ధంకాదు అన్నవారిని పార్టీనాయకులు నిందించారు. జపాను, జర్మనీ ఏజంట్లని దూషించారు. పైవిధంగా కమ్యూనిస్టులు భావించారంటే, వారి మార్క్సిస్టు దృక్పథం ఎంత పటుత్వంగా ఉందీ వేరే చెప్పనక్కర్లేదు. మార్క్సిజం ఎరగని కొద్దిపాటి సామాన్యవిమర్శకునికి కూడా ఈ భ్రమ కల్గదు—ఈ యుద్ధంవల్ల సర్వప్రజలకు స్వాతంత్ర్యం సిద్ధిస్తుందనే భ్రమ.

ఒక విషయం: ఈ యుద్ధకాలంలో, రణరంగంలో చిక్కుకొన్న దేశాల స్వాతంత్ర్యం కోసమే దేశాలు పోరు సల్పినయ్. కాని, యుద్ధరంగానికి అవల, పరాధీనమైయున్న దేశాల దాస్యవిమోచనకు ఏ దేశమూ పాటుపడలేదు. ఉదాహరణకు మనదేశంసంగతి తీసుకుందాం. ఇంగ్లండులో సోషలిస్టు, కన్సర్వేటివు మిశ్రమ మంత్రివర్గపు అనుగ్రహంవల్ల, గాంధీజీ, నెహ్రూ, పటేల్ ప్రభృతులు కారాగృహాల్లో నిర్బంధితులయారు. ఇంగ్లండు సోషలిస్టు మంత్రులు, పార్టీ ఇందుకు అంగీకరించారు.

రూజువెల్టు ఏవో సూచనలు చేయబోయాడు కాని వాటిని బ్రిటిషుప్రభుత్వం పెడచెవిని పెట్టింది.

కామ్రేడ్ స్టాలిన్‌కు ఈ అస్వతంత్రుల గోడు పట్టనేలేదు మనస్సుకు. మచ్చుకు కూడా, ఇండియాగురించి ఎప్పుడూ ప్రస్తావించలేదు.

ఇలా కళ్ళెదుట పరిస్థితులు కన్పడుతుంటే, 'అస్వతంత్ర దేశాల జాతీయ నాయకులు జైళ్లలో మ్రగ్గుతూ, వందలు, వేల ప్రజలు సామ్రాజ్యవాదుల దౌర్జన్యానికి ఆహుతి అవుతున్నప్పుడు, ఇది ప్రజాయుద్ధం, ఈ యుద్ధాంతంతో ప్రజల దాస్యాంతం సిద్ధిస్తుందనుకోటం తమ పరిశీలనా శక్తి లేక పోవటం. ఆలోచనా విధానంలో, మూలంలోనే తప్పుసూత్రం నాటుకొందని రుజువవుతుంది.

అప్పట్లో పార్టీవారు ఇంకోమాట అన్నారు. ఇది ప్రజాయుద్ధమని ఇదివరకే గ్రహించి ఉండవలసింది. తగినంత మార్క్సిస్టు ప్రాజ్ఞత లేకపోయింది. అని. కాని అప్పటికైనా సిద్ధించిందనుకొన్న మార్క్సిస్టు ప్రాజ్ఞత మళ్ళీ ఈనాటికీ లోపభూయిష్ఠంగా కనబడుతోంది.

రణదేవు ఇంకా విమర్శించాడు:

"ప్రజాయుద్ధకాలంలో సామ్రాజ్య తత్వపు ప్రవర్తనను సంపూర్ణంగా లెక్కలోకి తీసుకోలేదు. దాని ప్రాముఖ్యాన్ని తగినంతగా గుర్తించలేక పోయాం అందుమూలాన, సామ్రాజ్యతత్వపు మర్మాలను బహిరంగపరచి, ఫాసిస్టు వ్యతిరేక యుద్ధవ్యూహం మధ్యనే దానితో పోరుసల్పాలనే దృష్టి మనకు లేకపోయింది".

యుద్ధకాలంలో కార్మికులపట్ల పార్టీ అవలంచిన వైఖరినిగురించి కామ్రేడ్ రణదేవు ఇలా విమర్శించాడు:

"కార్మికుల జీవనపరిస్థితుల భద్రతకు భంగం కానంతవరకూ, ఉత్పత్తిని 'భగ్నం చెయ్యనీయకుండా (Sabotage), సమ్మెలు జరుగనీయకుండా చేశాం. అది సరైన మార్గమే. కాని ఫాసిస్టు వ్యతిరేకతకంటె లాభాలవైపే ఎక్కువగా మొగ్గి ఉన్న సామ్రాజ్య ప్రభుత్వం, పెట్టుబడి దార్లు. .. వీరి చేతులలో ఉత్పత్తి ఉన్నంతవరకూ ఉత్పత్తిని వృద్ధి చెయ్యటం గాని, సమీకరించటంగాని సాధ్యంకాదని మనం అవశ్యం గ్రహించి ఉండవలసింది."

స్వాతంత్ర్యసమరంలో కార్మికులను పాల్గొననీయకుండా చేసినందువలనే, ఈనాడు పార్టీ కార్మిక విషయాల్లో ప్రజల ఆమోదాన్ని సహాయసంపత్తిని తగినంతగా చేకూర్చుకోలేకపోతోంది.

యుద్ధకాలంలో పెట్టుబడిదార్లు కోట్లకొద్ది ధనరాసులను పోగుచెయ్యటానికి తోడ్పడ్డది—పార్టీ విధానం. జాతీయ ఉద్యమానికి వ్యతిరేకంగా, పెట్టుబడిదార్లకు అనుకూలంగా పార్టీ పనిచేసింది. ఆనాడు అలా ప్రవర్తించి ఉండకపోతే, ఈనాడు పెట్టుబడిదార్ల కింతటి శక్తి ఉండేదికాదు. జాతీయఉద్యమంతోపాటుగా అప్పుడు కార్మిక ఉద్యమంకూడా విప్లవాగ్నిలో పునీతమైయుంటే, ఈనాడు శ్రమజీవు లింతటి నిస్సహాయస్థితిలో ఉండేవారు కారు.

ముస్లింలీగు విషయంలో పార్టీ అవలంబించిన వైఖరిగురించి కూడా రణదేవు విమర్శించాడు:

"సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలు సల్పే పోరాటంగురించి ముస్లింలీగు నాయకులైన పెట్టుబడిదార్లు, జమీందార్లు ఏ వైఖరి అవలంబిస్తున్నారనేది మనం వారి నడగలేదు. పైగా, విచ్ఛేదకమైన ముస్లింలీగు పాకిస్తాన్ కోర్కెకు మద్దతు ఇచ్చేట్టుగా మనం స్వయం-నిర్ణయసూత్రాన్ని ఎక్కువగా వినియోగించాం."

కాంగ్రెసును, లీగును; నెహ్రూను జిన్నాను సమానంగా పరిగణించే పార్టీ దృక్పథం ఎంత శాస్త్రీయమో వేరే చెప్పనక్కర్లేదు. ఈ తప్పును కూడా కొంతవరకైనా ఒప్పుకున్నారు.

మతకలహాల గురించి

"1946-47 కొట్లాటలలో గాంధీ, నెహ్రూల విధానాన్ని బైటపెట్టటం బదులు వారితో ఏకీభవించే ధోరణి ఆరంభమైంది. కొట్లాటప్రియులైన సామ్రాజ్యవాదులు, జమీందార్లకే గాంధీ, నెహ్రూల విధానం అనుకూలంగా ఉండేది. తరచు గాంధీ, నెహ్రూల విధానం కొట్లాటలను నూటికి రెచ్చగొట్టేది. మతతత్వపు అభివృద్ధి నిరోధకతత్వాన్ని ఎదుర్కొంటున్నాం అనే పేరుతో బూర్జువానాయకులైన గాంధీ, నెహ్రూలను గురించి భట్రాజు పొగడ్తలు జరిగేవి."

"గాంధీ నెహ్రూలను గుడ్డిగా సమర్థించేందుకుగాను, ఓ పక్కన పటేలుకు, ఇంకో పక్కన గాంధీ నెహ్రూలకూ ముఖ్యఅభిప్రాయభేదాలున్నవనే సిద్ధాంతాన్ని కల్పించాం. నిజానికి గాంధీ నెహ్రూలు సర్దారు పటేలు విధానాన్నే అవలంబిస్తున్నారు."

ప్రజాయుద్ధం అనే ఆవేశంలో సామ్రాజ్యతత్వాన్ని సరిగా అర్థంచేసుకోలేదని; కార్మిక విధానం లోపభూయిష్ఠమైందని; ముస్లింలీగు పాకిస్తాను కోర్కె బలపడేట్టుగా స్వయంనిర్ణయ సూత్రాన్ని అనుసరించినట్లు చేసుకున్న ఆత్మవిమర్శ సవ్యంగానే ఉంది కొంతవరకైనా. కాని గాంధీ, నెహ్రూలవిషయమై చేసిన విమర్శవలన పాతలోపాలను తెలుసుకోలేకపోటమేకాక, అసత్యానికి, అజ్ఞానానికి ఆస్కారం ఇవ్వటం జరగుతుంది.

గాంధీజీని గోడ్సే హత్యచేసినప్పుడు. 'గాంధీజీ శాంతిదూత.' అని పార్టీ నాయకులు ప్రకటించారు; ఉపన్యసించారు. కాని పై విమర్శ ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది.

ఎంతటి ముస్లింలీగరు కూడా గాంధీజీ కొట్లాటలను రెచ్చగొట్టు న్నాడని అనలేదు జనవరిలో గాంధీజీ శాంతి స్థాపనకోసం ఉపవాసదీక్ష ఆరంభించినప్పుడు, మహమ్మదీయ నాయకులంతా గాంధీజీని తమ రక్షకుడని కొనియాడారు. కాని కమ్యూనిస్టులు గాంధీజీ విధానం మతకలహాలకు దారి తీసిందన్నారు. ఇది అసత్యం. అపనింద. అంతేకాదు, ఇదివరలో ఏదో తప్పటడుగులు వేశాం, అని చేసుకుంటున్న ఆత్మ-విమర్శ మళ్ళీ తప్పుడుదారిలో వెళ్తోంది. నెహ్రూని గురించిన అభిప్రాయం ఇలాంటి అసత్యంలోంచే పుట్టింది.

రెండోపార్టీని, పార్టీనాయకులను ఎలాగైనా ఎల్లకాలమూ, యుక్తాయుక్తాలు లేకుండా, సందర్భశుద్ధి లేకుండా నిందించటం, దూషించటం, నేరాలు ఆరోపించటం శాస్త్రీయ మార్క్సిస్టు విమర్శనా విధానం కాదు. సభ్యతా కాదు.

ఈ కమ్యూనిస్టు సమావేశంలో కామ్రేడ్ భవానీసేన్ కాశ్మీరునుగురించి ఇలా విమర్శించాడు.

"ఇండియను సేనలు కాశ్మీరులో ప్రవేశించటం ప్రజాస్వామిక శక్తుల పురోగమనమేనని, అందువలన మహమ్మదీయ రైతాంగానికి పరానుల, పాకిస్తానీయుల దాడినుంచి విముక్తి లభిస్తుందని ప్రజలు నమ్మేట్టు మనం చేశాం. కాని ఏమి జరిగింది?

"అంతకాలం యుద్ధం జరిగాక, కాశ్మీరు స్వతంత్రం కాలేదు. ఆంగ్లో - అమెరికను ఆధిపత్యానికి లోనవబోతోంది."

"ఇండియను యూనియను అభివృద్ధిగామియని, పాకిస్తాన్ అభివృద్ధినిరోధియని మనం అనుకున్నాం. అందువల్లనే ఈ పొరబాటు వచ్చింది. ఇండియన్ యూనియన్ అభివృద్ధిగామికనుక, అందులో చేరటం ముందడుగు వేయటం అనే నిర్ణయం దీనికి పర్యవసానం."

ఇదివరకల్లా షేక్ అబ్దుల్లాను కొండ కత్తారు. ఇప్పుడతను మహారాజాకాలికింద నలుసు అని ఖండిస్తున్నారు. ఈ కొత్తవాదం ప్రకారం, సంస్థానాలు ఇండియన్ యూనియన్‌లో చేరకూడదు. ఈ వాదం హైదరాబాదు విషయంలోనూ విన్నాం.

ఈ కొత్తవాదం మళ్ళీ కమ్యూనిస్టు పార్టీ తప్పటడుగులనే సూచిస్తోంది. సంస్థానాధీశులను సింహాసనాలమీదనుంచి దింపించి, ఆ ప్రదేశాలను ఇండియాలో కలిపి, సర్వత్ర సంపూర్ణమైన ప్రజాస్వామికరాజ్యాంగాన్ని నిర్మించటం తీవ్రవాదుల లక్ష్యం ఇందుకు విరుద్ధంగా, ఏసంస్థానాని కాసంస్థానంలోనే సంపూర్ణ విప్లవాన్ని సాగించాక, ఇండియాలో చేరటమా, చేరకపోవటమా అనేది ఆలోచిస్తాం అనటం విప్లవసూత్రానికే విరుద్ధం. ఇండియా ప్రజల స్వతంత్రశక్తి, సహాయ, సంపత్తులద్వారా సంస్థానాల్లో మార్పును తేవాలి ఇండియా ప్రజలకు, సంస్థాన ప్రజలకు మధ్య గోడలు నిర్మిస్తా మనటం ఓ విధంగా అసహనాన్ని నిరూపిస్తోంది. ఇండియాలోని బూర్జువాలు సంస్థానాల్లోని ప్రజలను పీడించకుండా చేయటంకోసం ఈ వాదన లేవదీశారందాం. అలా అయినా తప్పే. కమ్యూనిస్టుపార్టీ ఆవరణ సంస్థాన పరిహద్దుల మధ్యనే కాదుగా ఉంది. ఇండియాలోనూ తీవ్రంగా తమ కార్యక్రమాన్ని ఆచరిస్తున్నారు. ఇండియాలోని బూర్జువాలను నిర్వీర్యం చెయ్యటమే కమ్యూనిస్టుల కర్తవ్యం అయినప్పుడు, వారివలన సంస్థాన ప్రజలకు ముప్పు వస్తుందనటం మళ్ళీ సిద్ధాంతంలో తప్పు. కొత్తగా, మళ్ళీ తప్పటడుగులు వేస్తున్నారు.

గాంధీ, నెహ్రూలు మతకలహాల విషయములో అవలంబించిన వైఖరిగురించి; కాశ్మీరు గురించి పార్టీ నాయకులు పాత విధానాన్ని ఖండించి, చేసిన కొత్త విమర్శ కమ్యూనిస్టు పార్టీ నాయకుల ఆలోచనా విధానం లోపభూయిష్ఠంగా ఉందని నిరూపిస్తున్నయ్. మళ్ళీ ఒకసారి నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవటం అవసరం—ఉపయోగం సంగతి ఎలా ఉన్నా. ఈ లోపాలను సవరించుకోనంతవరకూ మళ్లీ తప్పటడుగులు తప్పవు. ఏ లిబరల్ పార్టీయో తప్పటడుగులు వేస్తే పెద్ద ప్రమాదం లేదు. ప్రజలను విప్లవోన్ముఖం చేసి స్వతంత్రి కార్యాచరణకు తయారుచేసే విప్లవపార్టీల తప్పటడుగుల వలన ప్రజ లనవసరమైన ద్వేష దౌర్జన్య దైన్యాలకు గురిఅవటమే కాక, ఉద్యమం దెబ్బ తింటుంది. ఇప్పటివరకూ సిద్ధించిన విజయం అపజయం అవుతుంది. 'విప్లవం ఆట' కాదు అనే హెచ్చరిక ఈనాడు ఎంతైనా ముఖ్యం.

ఈ సమావేశంలో పి. సి జోషి స్థానే, కామ్రేడ్ రణదేవును కొత్త కార్యదర్శిగా ఎన్నుకొన్నారు.

రణదేవు జోషీని తీవ్రంగా విమర్శించాడు. కొన్ని లోపాల నెత్తి చూపించి ఖండించాడు. అయిదేళ్లనుంచీ పార్టీ అవలంబిస్తున్న విధానం సంస్కారవాదప్రేరితంగా ఉంది. కాని విప్లవప్రేరితంగా లేదన్నాడు.

'నెహ్రూ ప్రభుత్వాన్ని బలపఱచండి' అని జోషీ పార్టీకి ఆదేశించాడు. నగరాల్లో, బస్తీల్లో,

(20 వ పేజీ చూడుడు)

కథానిక.

"చింతకు చిగురు - పిల్లకు పొగరు"

శ్రీ కవికొండల వెంకట్రావు

"చింతపిక్కలాడినాను ;
చింతచిగురు కోసినాను !
అంతులేని యీ జగ
త్తంత తెలుసుకున్నాను"

అయితే నే నాడిన పిక్కలే మొక్కలై యిక్కడిలా చిగిర్చాయా ? చెప్పగల్గురేమో ఆ బామ్మర్ల చిన్నోడు—"ఏమండో మిమ్మల్నే ! ఇలా చూడరేం? నే నాడిన పిక్కలే లా మొక్కలై చిగిరించాయో !" అని తాను కోసిన చింతచిగురు తట్ట వంచి చూపెట్టింది, హరిజన తరుణి యొక్కర్తు, హైరోడ్డు పొరొరెండెం పులావరుసగా పెరిగిన పెద్దపెద్ద చింతచెట్ల క్రింద నిలుచుండి. ఆ చింతచెట్లు ఆమెకు "గార్డు ఆఫ్ ఆనర్" ఇచ్చినట్లు ఆర్చితేలి, కొమ్మల చుంకల కంటా చిగురు మయమై అమందానందాన్ని చేకూరుస్తూ వున్నాయి.

లేకలేక, ఆ క్రితం రాత్రి కురిసిన వేసంగి వానకు, తెల్లారితే, ఆ చెట్లు ఆ చిగురుతో ఏలా కనబడుతున్నాయి! ఇంకా నింగి నిను డాడుతూ వున్న నల్ల మబ్బుక్రింద ఏలా కనబడాలో అలా కనబడుతున్నాయి, చల్లగా, వల్లమాల్ని రుచి అంతా తమ సొల్లేగా, ఇల్లలికి ముగ్గెట్టినంత ముచ్చటగా, ముద్దుగా, కనబడుతున్నాయి! కాలంతోపాటు దేశం కూడా నిర్దేశిస్తే ఏనాడైనా కనుగొంటూ డో పొంకుడు కాకపోతే వో పొంకుడైనా; రాజమహేంద్రానికి ధవళేశ్వరానికి సరిగ్గా మధ్యన, ఇటో పది అటో పది వున్నాయిలేండి చిరంతనపు చింతలు, కరువు తీఱ ఏయేటి కాయేడు చిగురుపట్టి.

"చింతకు చిగురు
అంచుకు తొగరు
గొల్లకు తగరు
పిల్లకు పొగరు"

ఉండాలి అని అనచేస్తాయి తప్పకుండా అవి!

"అంచుకు తొగరు" అంటే జ్ఞాపకం వచ్చినది, అక్కణ్ణే వుంది, ఆ చింతచెట్ల వరుసలో, ధవళేశ్వరం వెంపు ఆఖరు చింతచెట్టు కావల, ఈ వైపునుంచి వెడుతూ వుంటే హైరోడ్డుకు కుడితట్టు; సరిగ్గా ఆనిందో లేదో పొరకుల చూపు,—ఒక తురాయిచెట్టు !

"చెట్టంత పువ్వు!
పువ్వంత ఎఱుపు!"

అన్నట్టు నెడామడా విరగబూసి, వెఱ్ఱెత్తినదానిలా కనిపిస్తూ, బట్టలను బెదరించే తీరగా వొంగి వూగుతూవుంది, పిల్లగాలికి రవ్వపులుసు అందుకుంటూన్న మాదిరిగా, చింతను తొకుతూ, తప్పించుకుంటూ !

తరుణి పలకరించిన బ్రాహ్మణ కుమారుడు, అపరవిప్రప్రవరాఖ్యునిలా, అందుకుంటూ వున్నాడు తురాయి పువ్వు, పువ్వుపువ్వు చెట్టునుండగానే, రొబ్బపాళంగా త్రుంచుదామనో ఏమో వాని యూహ. విరిగి అతగాడి చేతిలో కొచ్చింది, ఒక్కరేకా కూడా నేల పడకుండా, అంతరొబ్బా, అంత పువ్వుతోటీని !

హరిజన తరుణి కన్నెఱ్ఱగా ఆ పూరెమ్మకేసి చూస్తూ—"నా కందలేదండీ యీదాకా ఎంత తంటాలుపడ్డా, ఆ తురాయిపువ్వు మీ రిట్టే అందుకున్నారు! మీ బామ్మర్లనోట మంత్రం నిజంగావుంది కామోసు" అని కూకేసినంతగట్టిగా నిర్వచించింది.

బ్రాహ్మణవర్చస్వి మాటాడకూరుకోవచ్చునా ? ఊరుకోలేదు. ఊరుకోక ఏమన్నాడు!—"నీకు చిగురెల్లా అందిందో నాకిది అల్లాగే అందింది, మరి కొంచెం ఎగిరితే! ఈ కాలంలో అందటిదీ ఒకటే మంత్రం, కైంకర్యమంత్రం!" అన్నాడు.

హరిజన తరుణి అంది "అంటే, అప్పుడే నే కోసిన చింత చిగురుమీద తంవరి కన్ను పడిందన్నమాటే!" అని కళ్లెగరేసింది.

యువకుడు "ఏం? అమ్మతావా?" అన్నాడు.

యువతి "నడిబజార్లో అమ్మతాం గాని చెట్టుక్రింద, అందులోను ఏ చెట్టునుండి కోసామో ఆ చెట్టుక్రింద అమ్మం దొరగారూ!" అని అంది. "తంవకు కావలిస్తే ఉత్తినే తీసికోండి!" అంది, నిజవృత్తి మెఱసేలా !

యువకుడున్నూ తనచేత పూరెమ్మ అలా వుంచుకునే ఆ జవ్వనికడకు చన్నవాడై "ఎంతుందేంటి?" అంటూ తట్టలోకి తొంగిచూచాడు. ఆమె తట్ట వంచుతూ రెండు గుప్పిళ్ల కుంటుంది. గొప్పలేదు అని అనుకోకండి. మేలింలాంటి సిగురు ! ఏలా పట్టుకెడతారు?" అంటూ తన కుడిచేతను బులబుల్గాగా ఆ కూర నొల్లమా పైకెత్తి చూపించింది. చూపిస్తూ ఆ విప్రవటుణ్ణి,—వానిని వటునిగా భావించమని మనవి—నఖశిఖ పర్యంతం పరీక్షగా పరకాయిస్తాంది.

తెల్లటి ఖద్దరు లాల్చీ, పక్కజేబు గలదాన్ని, తొడిగా డతగాడు. నెత్తిమీద అంతాంటె తెల్లటి గాంధీటోపీ పెట్టాడు. ఎడంబుజంమీద చాకలిపెట్టిన మడతకండువా వేసికొన్నాడు. పంచి కూడా అందుకు పరిసమానంగా కుచ్చెళ్లు పోసి మిక్కిలి పరిశుభ్రంగా రికృకలపని పొలలా వున్నాడు.

ఆ వేషం ఆ సీటూ చూస్తూ హరిజనాంగన పరిపరివిధాల యోజింపదొడంగింది—అడిగిందికూడాను, "పంచి పట్టరాదండీ! కండువా పరవకూడదండీ! టోపీలో వేసుకుంటే తప్పా? జేబులో వేసెయ్యమంటారా? తంవరి చేతుల్లో పువ్వులున్నాయి కందా, మరెల్లా పట్టుకెడతారు?" అని ప్రశ్నమీద ప్రశ్నగా.

దేనికీ జవాబుచెప్పకుండా బ్రాహ్మణ చిన్నవాడు ఆ ఆడది ఖాళీచేసిన తట్టలోకి తన చేతనున్న పూరెమ్మనంతనూ అలా విసరి, తన దోసిలి పట్టి, దోసిట్లోకి ఎత్తి పడెయ్యి అన్నట్టు 'పడెయ్యి' అని అభినయించాడు.

హరిజన స్త్రీ "తమ కింకా 'అస్పృశ్యత' రోగం పోలేదటండీ! అలాగే కానీయండి" అని ఎత్తి పడేస్తూ—అతగాడు దోసిట్లోని చిగురు జేబులోకి కళ్ళు వంచుకుంటూ కుక్కుకుంటూ వుంటే, తాను, అనగా ఆ తరుణి, ఆ తురాయి పూరొబ్బ పూరొబ్బా, కొప్పులో కుక్కుకుంటూ, వట్టి తట్ట చంకనెట్టుకు చక్కాపోసాగింది. ఇతగాడు తలెత్తి కనుగొని, తిరిగి పూరెమ్మ తట్టలోంచి తాను తీసికొందాం అని అనుకునేసరికి ఎవరికీ అందనంత దూరంలో కొప్పు కాపరుస్తూ కొప్పులో పువ్వు నప్పిస్తూ, ఎదర అంకవేసే కోడెదూడ నప్పుడే తన చిరునవ్వుతో కవ్విస్తూ వుంది!

"ఆడమనిషిముందు పంచీ పైకి ఎగ్గట్టడం మంచి పని కాదు, అని నే నాలోచించి దోసిలి పడితే, ఎంత తొందఱగా నా చేతిలో చిగురడేని చెదిరిపోయింది చెప్పరాని చిన్నది!" అని విస్తుపోసాగాడు, విప్రుడగు గాక విటుడగు గాక! ఆ మగవాడు!—టోపీ పట్టే గొడవ అతగాని తలపున కసలు రానే లేదో ఏమో! ఏమైతేం, మోసపోయినా ననుకున్నాడు అయ్యోర్లవకశిఖామణి. "బలే కిల్లాడీగా వల్లో వేసుకు, తన కాక్క వలసిన పువ్వులు తల్లో పెట్టుకు మరీ చక్కాపోతూవుందే జవ్వని" అని డిల్లపోయి చూస్తూ "కండువాలో వేసికొందామంటే ఇది రెండు జేనెలకంటె వెడల్పు లేనిది" అని బుజంమీదనుండి జారిపోతూవున్నదాన్ని సరిచేసుకుంటూ ఆమె వెనకాలే వెల్లడి పల్లంలోకి నాలుగ్గజాలు నాలుగడుగులుగా నడిచాడు.

అంతలో, పైని ఆదాకా బిగపట్టుక్కూర్చున్న మేఘం పగిలినట్టుగా మెఱసి, ఉఱిమి బడబడా కురియసాగింది. హరిజనస్త్రీ తడిసిపోయింది. అధరామరుడున్నూ తడిసిపోయాడు. చెంతనున్న ఒక పాకలోకి ఇతగాడు చేరుకున్నాడు. వాడి వెంబడినే ఆమె కూడా ఆ పాకలోకే వణుకుతూ ప్రవేశించింది.

"ఇది మీ యిల్లా?" అన్నాడు ఆమె తల్లో పూలు, వానకు తడిసి, సొంపు రెట్టింపుగా, కాపరస్తూవుంటే కనుగొంటూ ఆ పురుషుడు. ఆమె "కాదుండి! ఇది మా గొల్లపాకండి. ఇందులోనే ఒకమూల మాం వండుకోడం, వుండడం అన్నీని! మీరు తేమెక్కిపోయినట్టున్నారు" అని అదో విశ్వజనీనప్రేమావసర ప్రశ్నగా అడిగింది, తను తడవనట్టు. "నేనే అన్నమాటేం. నీవుమాత్రం తడిసిపోలే?" అని అడిగాడు బ్రాహ్మణుడు. "తడిసిన కొద్దీ మేం శుభ్రపడతాం! చెమటా గట్రా కడిగి వేయబడి! పడపలాజిగి తేరతాం. తమరు నెయ్యి వొణ్ణం వొంటబట్టిన మా రాజులు, భరించలేరు ఇంతటిహోరు గాలి, జోరువాన; మమ్మల్ని తాకనూలేరు. తలపనూలేరు" అంది.

ఆమె యీమాట వింటూ అతగాడు ఒక లిప్త తలపోశాడు, ఆమె నుదుటిని గన్న యీదయపు చెమ్మట, ఆమె నోటను విన్న "అస్పృశ్యత" పదనూతనోచ్చారణ, 'అసుప్రస్యత'.

వెంటనే అతని హృదయంలో వినూతన వికాస మేం కలిగిందో—"అదివఱకు మనం ఏలా వున్నా ఈ వాన మనకు ఇద్దఱకూ పరిశుభ్రస్నానాన్ని ఒడగూర్చింది. అజ్ఞానాన్ని తొలగించింది. నీవు నిజంగా ఈ భారతదేశానికి చక్రవర్తినివి కాదగ్గ కాంతవు. ఇవే నీకు నా జోహారులు!" అని తన టోపీ తీసి ఆమె ముందు మోకరిల్లాడు.

ఆమె అతగాడి బట్టతల పరికిస్తూ—పెద్ద నవ్వు నవ్వి "ఇందుచేతనా టోపీ పెట్టారు కాదు, చిగురుకోసం ఇందాకా? దానికేం లేండి కాని" అని, తన సవరపు కొప్పి కనబడకుండా కొప్పులోని పూల్తో కప్పెట్టుకొంటూ, "వినకటికి గాంధిగారూ, చచ్చి సొర్గాన్ని వున్నారు!, ఇల్లాగే అన్నారు! మాకు మీ రాచకీయ రంధులేమీ తెలీయవు.

"పూచిన చెట్టూ
పొడ వెంతో
కాచిన చెట్టూ
వల మెంతో
కొలిచే దానిని
నే నండోయి!"


అని పాడుతూ.. ....


"కూడూ గుడ్డా కలిసుంటే
కులముగద్ద లేకుంటేం?"


అని ఆడిపోయింది!

భూసురవరుడు "ఓ. కె. ఐడియా!" అని ఆమె నభినందించాడు.

వాన వెలిసింది. కథ కంచె మేస్తూవుంది. కథలోని పాత్ర లిరువురూ పాకవుల దారి కాస్తూ వున్నారు!







ఎలెక్ట్రిక్ చీపుర్లు, వంట వండేందుకు స్టౌవ్‌లు బట్టలుదికి ఇస్త్రీచేసే యంత్రాలూ—ఇల్లా అనేకం ఇంట్లో వాడే యంత్రాలు తయారయాయి.

అమెరికాలో ఈ యంత్రాలు పల్లెటిజక్క న కూడా ప్రతిఇంటిలోనూ ప్రతివారూ ఉపయోగించేందుకు, పల్లెటిజక్కకు కూడా ప్రతియింటికీ విద్యుచ్ఛక్తిని ప్రభుత్వం సరఫరా చెయ్యగలిగి ఉండాలి. ఇల్లా చేసేందుకు, హైడ్రో ఎలెక్ట్రిక్ విద్యుదుత్పత్తి కేంద్రాలైన జలపాతాలనుంచి, పెద్ద యంత్రాగారాల ద్వారా విద్యుచ్ఛక్తిని అపారంగా ఉత్పత్తిచేసి, దేశమంతటా నెట్‌వర్కుగా పవర్ స్టేషనులు నెలకొల్పి, పల్లెటి పొలాలకూ, ఇళ్ళకూ, పారిశ్రామిక కేంద్రాలకూ, సర్వప్రదేశాలకూ విద్యుచ్ఛక్తిని విలాశంగా సరఫరా చేసేందుకు, 1946 నాటికే ప్రభుత్వ వ్యవసాయ శాఖవారు పంచవర్ష ప్రణాళికను తయారుచేసుకొని చురుకుగా పనిసాగిస్తున్నారు. ఈ వ్యావసాయిక ప్రణాళిక ప్రకారము, అమెరికన్ రైతులు అధమం నాటికి ఎనభైయైదుమంది దాకానైనా, విద్యుచ్ఛక్తిద్వారా, వ్యవసాయమూ, పల్లెటి గృహకృత్యాలూ అన్నీ చేసుకొనేందుకు వీలుకలగాలని ప్రణాళిక ఉద్దేశము.

విద్యుచ్ఛక్తిని ఇల్లా అందరికీ, అనువుగా అందించేలోపలే, ఈ శక్తిని నిత్య ఉపయోగంలోకి తెచ్చుకోగలిగేందుకు—గృహోపయోగమైన యంత్రాలు—చాలా ఆశ్చర్యం కలిగించేవి, గృహిణికి ఇతర సహాయమేమీ అవసరం లేకుండానే, ఇంటిపనులన్నీ చక్కదిద్దిపెట్టేవి, ఉల్లాసము, సౌఖ్యమూ కూడా కలిగించేవి చాలా విద్యుద్యంత్రాలు తయారయాయి.



ఈ ఎలక్ట్రిక్ కుక్కర్‌లో అనేక విధాలైన ఉష్ణపరిస్థితి, పచనస్థితి తెలుపటమే కాకుండ

విద్యుచ్ఛక్తి ద్వారా


నంటకాలను యథాతథంగా భద్రపరుచుకొనేందుకు ఎలక్ట్రిక్ ఫ్రీజర్ యంత్రము లోపల వివిధ వస్తువుల నుంచేందుకు, ఒకదానిలోనుంచి ఒకదానిలోకి మార్చేందుకు, అనేక అరలూ, యంత్రాలూ ఉన్నాయి.

యుద్ధకాలంలో, అమెరికాలోని శాస్త్రకారులూ, ఇంజనీర్లూ, పారిశ్రామికులూ, పరిశోధకులూ—అందరూకూడా యుద్ధ యంత్రాల తయారుకూ, పరిశోధనలకూ తమ సర్వశక్తులనూ వినియోగించారు. యుద్ధకాలావసరమైన యంత్రాలకై చేసిన పరిశోధనలలోనే, తయారుచేసుకొన్న యంత్ర భాగాలలోనే, శాంతికాలాలలో, నాగరజీవన సౌకర్యాలకు అనువైన పరిశోధనలుకూడా, ప్రక్కవాటుగా ఫలిస్తూంటాయి. కాని శాంతి సమయం సమకూరేదాకా వాట్లను నిత్యజీవిత ప్రయోజన వస్తువుల తయారుకై ఉపయోగించటానికి పారిశ్రామిక వర్గాలకూ, శాస్త్రపరిశోధకులకూ గూడా అనువు చిక్కలేదు. యుద్ధంఅయిపోయినప్పటినుంచీ, ఈ ఇంజనీర్లూ, శాస్త్రకారులూ, పరిశోధకవర్గాలూ, పారిశ్రామికులూ—అందరూ కూడా నిత్యజీవితంలో, సామాన్య గృహస్థు, గృహిణీ—వీరి జీవితంలో ఎక్కువ సౌకర్యాలు కల్పించి, పనిపాటులు తేలిక చేసుకగల్గటంకోసమై కావాల్సిన గృహ పరికరాలనూ, యంత్రాలనూ విరివిగా తయారు చేసేందుకే తమ శక్తినీ, ప్రతిభనూ, యుద్ధకాల అనుభవజ్ఞానాన్నీ అన్నిటినీ ఉపయోగిస్తున్నారు.

ఈనాడు అమెరికన్ గృహాల్లో, గృహిణి పని, విద్యుద్యంత్రాల సహాయంవల్ల, అతి తేలికగానూ, చాలా సౌఖ్యదాయకంగానూ తయారయింది. ఇల్లు ఊడ్చి శుభ్రం చేయటానికి వంటయింట్లో వంట వహాయానికి, బట్టలుతికి ఇస్త్రీచేసి పెట్టేందుకు, ఇల్లు ఊడ్చి, పరిశుభ్రం చేసేందుకు, పురుగూ పుట్రా పట్టి వస్తువులు చెడిపోకుండా, క్రిమినాశనకరమైన కిరణాలను ప్రసరింపజేసి, ఇంట్లో భద్రంచేసిన తినుబండారాలు, ధాన్యాదులు మొదలైన వాటిని పాడైపోకుండా కాపాడే దీపయంత్రాలు—ఫ్రిజిడెయిర్‌లు—మొదలైన వనేక యంత్రాలను పారిశ్రామికులు తయారు చేశారు.

బట్టలుదికే ఆటోమాటిక్ యంత్రం—బట్టలుదికి, పిండి, ఎండబెట్టి—అరగంటలో తయారుచేసి ఇస్తుంది. చేతితో బట్టలను మధ్యలో ముట్టుకోవలసిన పనికూడా గృహిణికుండదు. ఆటోమేటిక్ డ్రైయర్ సహాయంతో యంత్రంలోని వేడిగాలిలో బట్టలు పూర్తిగా పొడిగా తయారవుతాయి. వీట్లలో "స్పిన్-వాషర్లు" యంత్రాలూ, చిన్నవాషరు యంత్రాలూ, ఇల్లాంటివాటితోటి కొద్దిపాటి బట్టలనే తడవ తడవకూ, ఈ ఎలెక్ట్రిక్ 'చాకలిరేవులో' ఇంట్లో శుభ్రంగా ఉతికించవచ్చును. ఈ చిన్నివాషరు యంత్రాలు ఒక్క బట్టలనే కాకుండా, చిన్న చిన్న పళ్లాలలాంటి ఇతర వస్తువులను కూడా, వేరే అంట్లు తోముకొనే పని లేకుండా శుభ్రం చేసుకోవచ్చును. ఈ యంత్రాలతోపాటు ఉండే ఎలెక్ట్రిక్ 'ఇస్త్రీ' యంత్రాలతో ఏ రకమైన బట్టలనూకూడ 'ఇస్త్రీ' మడతలుగా తయారుచేసుకోవచ్చును.


భోజనానికి, ఫలహారాలకు వాడుకొన్న పళ్లాలు, కప్పులూ, సాసర్లూ శుభ్రపరచేందుకు, ఆటోమాటిక్-డిష్‌వాషర్' అనే యంత్రం తయారయింది. కడగవలసిన అంట్లు, పళ్లాలు



ఇంటిలో చాకలిరేవు గది:— కిటికీక్రింద, ఎలక్ట్రిక్ యంత్రాలు బట్టలుదికేవి, ఆరబెట్టేవి ఉన్నాయి. కుడివైపున ఇస్త్రీయంత్రము, ఇస్త్రీబట్టలు పెట్టుకొనే అలమారులు ఉన్నయి.



బట్టలుఉతికే లాండ్రీయంత్రము:—ఉదికిన బట్టలుమూట ఆరుతుండగానే మరొకమూట ఉ



వంటకాలన్నీ ఒకసారే తయారుచేసుకోవచ్చు. క్రింద నున్న బల్ల వివిధవస్తువుల
', అప్పటికప్పుడు వంటగిన్నెలు పెట్టుకొనేందుకుకూడా ఉపయోగపడుతుంది.



ఎలక్ట్రిక్ వంటయిల్లు :—ఇక్కడ పని మూడు అంచెలుగా చేసుకోవచ్చును. కూర, నార తరగటం మొదలైనపని, వంటకాలు భద్ర
చేసుకోటం మొదటి యంత్రంలో అవుతాయి. పళ్ళాలు, పాత్రలు కడిగే యంత్రం మధ్యనుంటుంది. ఎడమవైపుఎలక్ట్రిక్ పొయ్యి.

గృహిణులకు వివిధ సౌకర్యాలు

న్నీ యంత్రంలో అమర్చి, స్విచ్ వేస్తే
లును. కాసేపటిలోగా
ంత్రం వాట్లను శుభ్రంగా తోమి, కడిగి,
సగా పేర్చి, ఆరబెట్టి, మళ్ళీ తన పని అయి
గానే ఆగిపోయి ఊర్కొంటుంది.

అసలు గృహిణికి వంటయింట్లో బాదర
ంతా, చెత్త, చెదారం, కాయగూరల
తొక్కలు, గంజి, ఇల్లా వంటలో చెత్తగా
గిలిన నిరుపయోగమైన వస్తువులను సర్దుకోటం
ే ఎక్కువ ఉంటుంది. ఇల్లా ఎక్కడి
క్కడ అనవసరం అయిపోయిన ప్రతి పీలికనూ
యంత్రం తనలో జీర్ణంచేసుకొని, మురుక్రింద
రేసి, ఎక్కడా ఇంట్లో మురికీ, గలీజూ కన
నీయకుండా డ్రైనేజ్ గొట్టాలలోకి కడిగి
ంచేస్తూ ఉంటుంది.


వంటలో కొత్త పద్ధతుల ఆటోమాటిక్ కుక్కర్లు, అనేకరకరకాల పదార్థాల నొకేసారి తయారుచేసే ఎలెక్ట్రిక్ కుక్కర్లు తయారు చేశారు. ఈ కుక్కర్లలో, గాజు కిటికీలలోనుంచి, వంటకాలు పచనంలో ఏ స్థితిలో ఉన్నాయో, గృహిణి చూస్తూ ఉండగలిగే అవకాశం ఉంది. ఈ వంటకాలనూ, పచ్చి వస్తువులనూకూడా ఎల్లా ఉన్నవాటిని అల్లాగే ఉష్ణ స్థితుల్లో భంగం రానీకుండా, కావలసినంతసేపూ, కావలసి నన్నిరోజులూకూడా భద్రంగా ఉంచేందుకు ఫ్రీజింగ్ యంత్రాలున్నాయి. వీటిసహాయంవలన ఆదరాబాదరాగా వస్తువులకోసం వెదుక్కో నక్కరలేకుండా, నాలుగు వస్తువులూ ముందే జాగ్రత్తపరుచుకొని ఎప్పుడేవి కావలసివస్తే, అప్పుడల్లా వాటిని కొత్తగా కొనితెచ్చినవాటిని వాడుకొన్నట్టే వాడుకోవచ్చు. ప్రతిక్షణమూ, బజారుకూ, మార్కెట్టుకూ పరుగెత్తవలసిన అవసరం తగ్గిపోతుంది.

ఇన్నాళ్లూ ఎలెక్ట్రిక్ దీపాలు ఊర్కే ఇంట్లో వెలుగు ఇచ్చేందుకుమాత్రమే తయారు చేసేవారు. ఇప్పుడు కొత్తరకందీపాలు తయారు చేస్తున్నారు. ఇంట్లో పప్పులూ, పిండ్లూ, ఊరగాయలూ, మొదలైనవి పురుగూ, బూజూ పట్టకుండా ఉండేందుకు ఈ కొత్త ఎలెక్ట్రిక్ బల్బు కాంతిలో ఉంచుతూ వస్తే చాలు. ఆ కిరణాల శక్తివల్ల పురుగూ, బూజూ పట్టి వస్తువులు చెడిపోకుండా ఉంటాయి. పుస్తకాలూ, బట్టల అలమార్లూ కూడా, గాజువి చేయించి, ఈ దీపాల వెలుగులో ఉండేట్టు ఉంచితే, పురుగూ చీడా పట్టి పాడైపోకుండా ఉంటాయి.

తలంటుకొన్నాక తలకట్టు ఆర్చుకొనేందుకూ ఇల్లుఅంతా శీతకాలంలో కూడా వెచ్చగా ఉంచుకొనేందుకు—మొదలైన అనేక ఉపయోగాలకు పనికివచ్చే "ఇన్ఫ్రారెడ్" లాంపులను తయారుచేశారు.

"అల్ట్రావయిలెట్ రే" లాంపులకి రకాలు క్రిమిసంహారులుగా ఇళ్లలో మూలమూలకీ ప్రసరిస్తూ ఉపయోగపడగల "అల్ట్రావైలెట్" ఎలెక్ట్రిక్ దీపాలు తయారయాయి. వీట్ల కిరణాలు వాట్లని వాడే మనుష్యులకళ్ళకి సరాసరి తగలకుండా, ఆ లాంపులకు షేడ్‌లు అమర్చి ఉంటాయి. ఆరోగ్యంకోసం తీసుకోవలసిన "ఆతపస్నానాలు" మొదలైన ఆరోగ్య విధానాలు ఇళ్ళల్లోనే చేసుకొనేందుకుకూడా ఈ అల్ట్రావైలెటు లాంపులు ఉపయోగపడుతాయి.

ఇంటికి వాడే ఎలెక్ట్రిక్ దీపాలలో కూడా, కంటికి చీకాకు గలిగించకుండా వెల్తురును "డిఫ్యూజ్" చేసి (అంటే పగటిపూట ఇంట్లో వెల్తురున్నట్టుగా, మందంగా ప్రసరింపజేసి) కంటికి హాయిగూర్చే వెలుగు నిచ్చే, ఫ్లూరెసెంటుదీపాలు కూడా, అక్కడ సామాన్య గృహస్థుల కందరికీ అందుబాటయేంత చవుకలో అక్కడ తయారు చేస్తున్నారు. శీతాకాలంలో, చలికి కాళ్లూచేతులూ కొంకర్లు పోతూ తిమ్మిరి ఎక్కవలసిన పరిస్థితి లేకుండా, ఎలెక్ట్రిక్ దుప్పట్లూ, బూర్నీసులూ తయారుచేశారు. ఇన్ని సౌకర్యాలూ కూడా పల్లెటి దిక్కున జీవించే సామాన్య గృహస్థుని ఆదాయంలోపలే అమరగల సౌకర్యాన్ని సమకూర్చే పరిస్థితికై అమెరికన్ ప్రభుత్వము ఈ పంచవర్ష గ్రామ విద్యుత్సౌకర్యాల ప్రణాళిక ద్వారా కృషి చేస్తోంది.



లోపుగా యంత్రానికందిస్తూ ఉండవచ్చును.



పళ్ళాలు తోమి శుభ్రంచేసే ఆటోమాటిక్ యంత్రం. ఈ యంత్రంలో కడగవలసిన పాత్రసామగ్రిని పెట్టి మూతవేసి, స్విచ్ వేస్తే చాలు. సామగ్రిని అంతా శుభ్రంగా కడిగి, తొలిచి, ఆరబెట్టి, పని పూర్తి అయాక యంత్రం తనంత తనే పని ఆపేసుకొని ఆగిపోతుంది.



అల్లీబిల్లీ లోకంలో అమ్మాయికథ

'ఆలీస్ ఇన్ ది వండర్లాండు' రచన: **లూయీ కెరోల్** ౧౩ అనుకరణం "ఆప్లవాన్"

జమీందారిణీ, పాపా మాత్రమే అక్కడమిగిలారు.

"అమ్మామోయ్, నిన్ను మళ్ళీ చూసేటప్పటికి నాకెంత సంతోషంగా ఉందని చెప్పనూ!" అంటూ జమీందారిణి ఆప్యాయంగా పాప చేతిలో చెయ్యి కలుపుతూ నడవటం మొదలు పెట్టింది.

జమీందారిణి ఇంత హుషారుగా, నవ్వుతూ పల్కరించినందుకు, పాపకు కూడా సంతోషమే వేసింది. అసలు ఇందాక ఆవిడ అంత కోపం తాపంతోటి కారాలూ - మిరియాలూ నూరుతూ కనబడటానికి, ఆ వంటయింటి పోపులో ఉన్న కారాలూ మిరియాలే కారణం గాబోలని పాప అనుకొంది.

"నేనే జమీందారిణీ నయితే,"— తాను జమీందారిణి ఎప్పటికీ కాలేనని ఓ మూల చప్పరించుకొంటూనే పాప తనలో అనుకోటం మొదలు పెట్టింది. "నేనే జమీందారిణీ అయితే వంటయింట్లోకి కారాలు - మిరియాలు అసలే రానీయను. కారాలు-మిరియాల వల్లనే మనుష్యులకు కోపతాపాలు ఎక్కువవుతాయి. చింతపండు, వక్కాయలూ, ఇల్లాంటి పులుపులు తింటేనే, పుల్ల మొహాలతో చిడుముడులాడుతూ తయారవుతారు. చేదు కాకరకాయలూ (అబ్బ వెధవకాకరకాయకూర) అవీ తినబట్టే, విషపుచ్చులతో తయారవుతారు. చక్కగా పంచదారనే తిమిరాయీ తింటే తియ్యగా ఉందురు. అందుకనే పిల్లలెప్పుడూ తియ్యగా మాట్లాడుతూ కమ్మగా ముద్దొస్తూ ఉంటారు. పెద్దవాళ్ళకి, ఈ మాత్రం తెలియదేం? తెలిస్తే పిల్లల కింకా ఎంత ఎక్కువగా మిఠాయిలు, చాకలేటులు-అన్నీ..."

అల్లా వరుసగా ఆలోచించుకొంటూ జమీందారిణి మాటే మరిచిపోయింది పాప. అక్కడదాకా వచ్చేటప్పటికి, జమీందారిణీ మాట చెవిలో వినబడింది. "ఏ అమ్మాయి, ఏమిటో ఆలోచిస్తున్నావుకాదూ? అందుచేత ఏమీ పలక్కుండా ఉన్నావు. నా కిప్పుడు జ్ఞాపకం లేదుగాని దీని కేదో నీతి ఉండి ఉంటుంది".

"ఆలోచిస్తూ పలక్కపోటానికి నీతి ఏమిటి? ఏముంటుంది?" అంది పాప.

"ఆ! అల్లా అనకు; ప్రతిదానికీ ఏదో ఒక నీతి ఉండి ఉంటుంది. మనం కాస్త ఆలోచించి తెలుసుకోవాలే గాని తప్పకుండా ఉంటుంది" - అంటూ జమీందారిణి మరీ ఆప్యాయంగా పాప మొహంలోకి మొహం పెట్టి మరీ కౌగలించుకొంటూ దగ్గరకు జరిగింది.

పాపకు మరీ ఉత్కృష్టంగా ఉంది. అసలే జమీందారిణి మొహం చాలా అసహ్యంగా ఉంది. పైపెచ్చు, సరిగ్గా పాప చెవులదాకా వచ్చే ఎత్తున ఉందేమో, జమీందారిణి సన్నపాటి నిడుపు గడ్డం పాప బుజానికి ఆనించి మరీ గుచ్చుకునే టట్టుగా నొక్కుతూంది. పాప కాస్త తప్పించుకొందామనుకొంది గాని, ఏమైనా కదిలి నడక మారిస్తే మరీ మోటుగా ఉంటుందేమో నని, అల్లా ఉత్కృష్టంగానే నడుస్తూ ఉంది. అయినా మాట్లాడకపోయినా మోటుగానే ఉంటుందేమో నని, "ఇప్పుడు రాణీగారి ఆట కొంచెం బాగా సాగుతున్నట్లు ఉందే" అంది.

"ఆ. సాగుతూనే ఉంది. దానినీతి ఏమిటో తెలుసా? "తినగా తినగా వేము తియ్యబడుతుంది; తియ్యగా తియ్యగా రాగం చక్కబడుతుంది. అనే" అంది జమీందారిణీ.

"అబ్బ! ప్రతిదానికీ ఏదో సామెతా, నీతీ చెప్తాందేమిటి ఈవిడ? నీతులంటే పడి చచ్చే ట్టుంది" అనుకొంది పాప.

జమీందారిణి ప్రతిమాటకూ అల్లా ఏదో సామెతో, నీతో కల్పించి చెపుతూనే ఉంది.

పాప మళ్లీ ఏదో ఆలోచనలో పడింది.

"ఏమిటో? మళ్లి ఆలోచిస్తున్నావు" అంటూ జమీందారిణీ గడ్డం మరీ గట్టిగా పాపబుజంమీద నొక్కింది.

పాపకు అప్పటికే చిరాకు వేసుకొస్తూంది.

"ఆలోచించుకొనేందుకు నాకు హక్కు లేదా?" అని పాప కాస్త చిరాకుగా అడిగింది.

"పందులు ఎగరటానికీ పాప ఆలోచించటానికీ హక్కేమిటి? దానినే..."

అంతవరకు వచ్చి తన 'నీతి'కి సగంలోనే జమీందారిణి నోరు కట్టడిపోయి, వళ్ళంతా వొణికిపోవడం మొదలుపెట్టింది.

పాప తల వంచుకు నడుస్తూందేమో, జమీందారిణి హఠాత్తుగా ఇల్లా అయిందెందుకో తెలియక తలఎత్తి చూసింది.

ఎదురుగుండా రాణి ఒళ్ళంతా బిగుసుకుపోయేటంత కోపంతో ఉరుముతూన్న పిడుగులాగా, కళ్ళు చింత నిప్పులు చేసుకొని జమీందారిణివంక చూస్తూంది.

"ఇదిగో నీకు ఆఖరిసారి చెప్తున్నాను. ఇక్కడనుంచి నీ తలకాయైనా ఎగిరిపోవాలి, లేదా నువ్వైనా ఎగిరిపోవాలి, ఎల్లా చేసుకొంటావో. అర నిమిషం సైమిచ్చాను" అని రాణీ ఉరిమింది.

జమీందారిణి, పాపను విడిచి ఒక్క పరుగులో అక్కడినుంచి మాయమైపోయింది.

"దా! ఆట కానిద్దాం" అంటూ

బాలా

కథా గేయం:



ఆణిముత్యం

'ప్రసాదరావు'

౧౪

గడచినవి రెండేండ్లు, మూడును
గడచినవి, దిన మొక్కయుగముగ,
ఏడ, నెవ్వరివలన, ఆణీ
జాడె తెలబోదూ. 1

కడగండ్ల పుట్టిన్న బిడ్డడు
కడతేర కట్టుల్లె గిట్టెను;
మిగులు శిశులకుకూడ దుఃఖపు
మేతె మిగిలిందీ. 2

జీవనము గడపంగ, బిడ్డల
చేరి సాకగ, పూనుపనికిని,
మునుపటీ ఉత్సాహ మెరుగదు
ముత్య మీనాడూ. 3

దినము దిన మట్టులే సంద్రపు
తీరమందున నిలిచి, నిస్పృహ
బారి వడి, నిర్జీవప్రతిమగ
మారివస్తుందీ. 4

ఒక సందెచీకటిలో-వేణూ
ఒక్కడూ అటువస్తు - ముత్యము
జూసి, ఆయమ ఉన్నరూపును
చూసి-నిలిచాడూ. 5

పెండ్లి ఐనప్పటీనుంచీ,
పెద్దకాలము చూడ డామెను,
ఆణినీ—సుఖముల్ల నున్నా
రనుచు తలచాడూ. 6

వలపువహ్నికి దూరమునె ఇన్నా
ళ్ళిలిచి, తన కాపురం ఇద్దరు,
వారి సుఖములనుంటె చాలని
ఊరడిలినాడూ. 7

ఈరూపుదైన్యమున, ముత్యం
కారువడి శిలవోలె, నొంటిరి
నిలువ, తానును, విభ్రమముతో.
నిలచె నట వేణూ. 8

రాణి పాపను వెంటబెట్టుకొని పచ్చిసు ఆటదగ్గిరకు వెళ్ళింది.

రాణీ కాస్త ఇవతలకి వచ్చేటప్పటికి, ఆటలో వాళ్ళంతా చెట్లకిందికి చేరి కాస్త అయాసం తీర్చుకొంటున్నారు రాణీని చూసేటప్పటికి అడావుడిగా పరుగెత్తుకొంటూ, గబ్బగా వంగి నిలిచే వాళ్ళు గళ్ళస్థానాలలోనూ, గవ్వలూ, పావులూ, ఎవళ్ళ స్థానాలలో వాళ్ళు కంగారు కంగారుగా నిలబడ్డారు. పాపకు రాణీని చూస్తే భయంగానే ఉందిగాని తప్పుకుపోటానికి దోవ కనబడటం లేదు.

ఆట మళ్ళీ సాగింది. అరగంట అయేటప్పటికి ఆటలో ఉన్న వాళ్ళందరినీ ఒకళ్ళనొకళ్ళనే "తల కొట్టేయ్!" అంటూ ఆజ్ఞ యిచ్చి, అవతల కూర్చోపెట్టింది.

చివరికి "తల కొటెయ్య" మన కుండా ఆటలో మిగిలినవాళ్ళు, రాణీ, రాజూ, పాపా, ముగ్గురు మాత్రమే. అందుచేత ఆట కూడా ఆఖరయిపోయింది.

రాణీ ఆట ఆడిన ఆయాసంతో వగర్చుకొంటూ, "'మాయతాబేలు' నెప్పుడన్నా చూశావా?" అని పాప వంక తిరిగి అడిగింది.

"చూడలేదు-అసలు మాయతాబేలేమిటో నాకు తెలియదు" అంది పాప.

"అయితే దా, నాతో దా; చూపిస్తాను. నక్కా-గుంటనక్కా, కొక్కూ-పందికొక్కూ, అనం? అల్లాగే తాబేలూ-మాయతాబేలూ ఉంటాయి. దాని కథంతా అదే చెప్తుంది. విందాం, పద; చాలా బాగుంటుంది" అని రాణి పాపను లాక్కుపోయింది.



రాణీ, పాపా, ఇవతలికి కదలి రాగానే, రాజు నెమ్మదిగా "సరే, మిమ్మల్నందరినీ క్షమించేశాను, పొండి," అని అంటూండటం పాపకు వినబడింది. రాణీ ఆ ధోరణి పట్టించుకొన్నట్లుగా పాపకు కనబడలేదు. "బహుశా, రాణీ ఆ మాట విన్నట్లు లేదు" అనుకొంటూ పాప రాణీతోటి నడవ సాగింది.

పోతూండగా దోవలో వాళ్ళకొక వింత జంతువు ఎండలో పడుకొని నిద్రపోతూ కనబడింది. ఆ జంతువు తోక, కాళ్ళూ, గిట్టలూ, చెవులు, అన్నీ మామూలు జంతువు లాగానే ఉన్నాయి. కానీ పక్షిలాగా పేద్ద గద్దముక్కూ, రాంబందు రెక్కల్లాగా రెక్కలూకూడా ఉన్నాయి.

"ఏయ్, రావణాబందూ! ఓసీ సోమరిపీనుగా, లే! లే!" అంటూ రాణీ ఆ జంతువును నిద్రలేపింది.

"రాంబందు ఉన్నట్లుగానే రావణాబందుకూడా ఉందే" అనుకొంది పాప.

"ఇదిగో! ఈ పిల్లను మాయతాబేలు దగ్గిరకు తీసుకుపో! మాయతాబేలు కథ వింటూందట- నాకు పని ఉంది పోవాలి, తలకాయలన్నీ సరిగ్గా కొట్టేశారో, లేదో చూడలి." అంటూ పాపను రావణాబందుదగ్గిర వదిలి రాణీ వెనక్కు తిరిగిపోయింది

'రావణాబందు'ను చూస్తే పాపకు ముందు భయమే వేసింది. కాని "తల కొట్టేసే" రాక్షసిరాణితో వెళ్ళటం కంటే, ఈ జంతువుతో ఉండటమే, నయం అనిపించింది.

"రావణాబందు" లేచి కూర్చుని కళ్ళు నులుముకొని ఆవులించింది. తర్వాత రాణీ వెనక్కి వెళ్తూన్నదిక్కే చూస్తే, మళ్ళీ ఆవులించి "భలే తమాషాయే" అంది.

పాప తెల్లబోయి "తమాషా ఏముంది?" అని అడిగింది.

"తమాషా కాదూ — ఈ రాణీ అన్నీ అనుకోటం, అంటం తప్ప ఏమీ జరగనే జరగవు. అంతా రాణీ భ్రమ. ఎందుకూ, ఇక్కడ ఎవళ్ళ తలా ఎప్పుడూ కొట్టేయనే లేదు. సరేలే, నడు పోదాం" అని పాపకు ఆజ్ఞ ఇస్తూ కదలింది.

"అబ్బ! ఇక్కడ అందరూ ఏమిటో ఊ, ఆజ్ఞలివ్వటమే— ఇంతగా నా జన్మలో ఎప్పుడూ ఎవళ్ళూ నన్ను ఆజ్ఞాపించనే లేదు — ఛా!" అనుకొంటూనే పాప రావణాబందు వెంటనే బయలుదేరింది.

కాస్త దూరం నడిచేటప్పటికే, మాయతాబేలు దూరాన ఒక రాతి గుట్టమీద కూర్చుని ఉస్సురుస్సురని నిట్టూరుస్తూ కళ్ళనీళ్ళతో ఎక్కులు పెడుతూ కూర్చుంది.


మాయతాబేలు, అంతా తాబేలు లాగే ఉందిగాని, తల, చెవులూ, వెనకకాళ్ళూ, కాళ్ళగిట్టలూ, తోకా, ఆవుదూడవి లాగా ఉన్నాయి. వీపు మీది బొరుసుల చిప్పా, ముందరి పాదాలూ, మాత్రం, అచ్చు తాబేటివి లాగానే ఉన్నాయి. ఆ నిట్టూర్పులూ, శోకన్నాలూ, దూరానికే, పాపకు వినబడ్డాయి.


"అల్లా విచారంగా ఉంది; ఏం కష్టమొచ్చిందా ఏమిటి?" అని పాప రావణాబందు నడిగింది.

"అదంతా దాని 'భ్రమే'. అంతకంటే ఏమీ లేదు. తను ఎప్పుడూ ఏదో కష్టాల్లో ఉన్నానని భ్రమ పడుతుంది" అంది రావణాబందు. "ఇందాకా రాణీదంతా భ్రమ అంది. ఇప్పుడీ తాబేలుదంతా భ్రమ అంది — అందరిదీ భ్రమ గాబోలు" అనుకొంది పాప.

మాయతాబేలుదగ్గరకు రాగానే "రావణాబందు" పాపను మాయతాబేలుకు చూపిస్తూ, "ఈవిడగారికి నీ కథ వినాలని ఉందిట-చెప్పు" అంది.

"చెప్తాను కూర్చోండి" - అంటూ ఏడుపుగొట్టు కంఠంతో ముక్కు చీదుకొంటున్నట్టుగా అంది మాయతాబేలు. "ఇద్దరూ కూర్చోండి - కథ పూర్తి అయేదాకా ఎవళ్ళూ ఏమి మాట్లాడకూడదు."





చిట్టెలుక

పిల్లల కథలు

చి॥ వి. బి. సుబ్రహ్మణ్యం

ఒక చిట్టెలుక పండ్లు ఫలహారాల పెట్టెలో చేరి తృప్తిగా తిని హాయిగా కాలము గడుపుతుండేది. ఏ ఎలుకకూ తన చోటుచూపకుండా తానే అన్నిటికంటె గొప్పదాన నని ఎవరితోనూ మాట్లాడకుండా గుట్టుగా వుండేది. ఇన్నివున్నా అపుడపుడు పిల్లి భయమూ, ఆ ఇంటి మనుష్యుల భయమూ వుండేది.

కాని తెలివితేటలతో తప్పించుకొంటూ వుండేది. పిల్లి వస్తే పెట్టె కన్నము గుండా లోపలి కెళ్ళి కూర్చొనేది. ఆ ఇంటి వాళ్ళు ఆ పెట్టె తలుపు ఎపుడైనా తీస్తే నెమ్మదిగా జారుకొని వాళ్ళు వెళ్ళిన తరువాత మరలా వచ్చి దూరుతూ ఉండేది.

ఒక రోజు ఆ చిట్టెలుక పట్టరాని సంతోషంతో తల్లి దగ్గరికి వచ్చి అమ్మా అమ్మా! లాగ కీచు కీచుమంటూ ఇలా చెప్పడం మొదలుపెట్టింది: "ఈ ఇంటి వాళ్ళు చాలా మంచివారు. నేనంటే చాలా ప్రేమ అనుకొంటాను. ఒక చక్కని ఇల్లు తయారుచేసేరు నేను ఉండడానికి. అచ్చంగా నాకు సరిపోయేది. నాకు ఎంతో బాగుగా వుంటుంది. ఆ ఇల్లును తెచ్చి నేనుండే పెద్ద పెట్టెలోనే పెట్టేరు. అందులో కావలసినంత ఫలాహారముకూడా పెట్టేరు. ఆ ఇంటిని మూడువైపుల చెక్కతో, పైవైపు కమ్ములతోనూ చేసినారు. నాకు ఇంకనుండి పిల్లివలన ఎటువంటి భయమూ లేకుండా కాపాడేరు. ఆ ఇంటికి ముందున్న తలుపుగుండా పిల్లి రాలేదు. అది నాకుమాత్రమే సరిపోతుంది. అని ఏవేవో చెప్పి నీవు కూడా వస్తే మనమిద్దరము సుఖంగా వుండవచ్చు; వస్తావా?" అనగానే, అప్పటివరకూ నవ్వుతూ విన్న చిట్టెలుక తల్లికీ, కీలాగ, "నా చిట్టిఎలుకా! నీవు అందులోకి పోక పోవడం చాల సంతోషము. ఆ ఇంటిని బోను అంటారు. అది మనలను పట్టుకోవడానికి తయారుచేసినది. దానిలోనికి మనము ఒకసారి వెళ్ళితే రెండవసారి మనలను వదలడం పిల్లినోటివద్దనే.

"మనుష్యుడు పిల్లిఅంత భయంకరుడు కాకపోయినా అతడూ మన విరోధే. ప్రపంచములోని ప్రాణులలో జిత్తులమారి ప్రాణి. ఇంకెప్పుడూ ఆ పెట్టెలోకి వెళ్ళొద్దు" అనగానే ఇంత కాలము నుండి వున్న పెట్టెను వదలి తల్లి దగ్గరనే వుంటూ వచ్చింది ఆ చిట్టి చిట్టెలుక.

భారత ప్రభుత్వ సంస్థానశాఖ విజయము

(8 వ పేజీ తరువాయి)

స్థానమున నున్న దీనిని రాష్ట్రప్రభుత్వములకు అప్పజెప్పకుండా, కేంద్రప్రభుత్వమే నేరుగా, ఒక చీఫ్ కమీషనర్ ద్వారా, పరిపాలించవలె నని నిర్ణయించిరి. ఇందుకు అంగీకరిస్తూ ఆ సంస్థానాధీశ్వరుడు మే 4 వ తేదీన ఒడంబడికపై సంతకంచేశాడు. జూన్ 1 వ తేదీనుండి దీని పరిపాలనాబాధ్యత కేంద్రప్రభుత్వం వహిస్తున్నది.

ఈ విధంగా సంశ్లిష్ట రాష్ట్రప్రభుత్వాల లోనో, నేరుగా కేంద్రప్రభుత్వంతోనో ఏకమై పోని చిన్నచిన్న సంస్థానాలు భౌగోళికముగా వీలైనచోట్ల, ప్రత్యేక సంస్థానకూటములుగా ప్రత్యేక రాష్ట్రములుగా ఏర్పడినవి. కొన్ని పెద్దసంస్థానాలు కూడా ఈ కూటములలో చేరి, దేశ ఐక్యతకు, పరిపాలనా సౌలభ్యమునకు, కూటమి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుచున్నవి. ఇట్టి కూటములకు దారితీసినవి సౌరాష్ట్ర సంస్థానములు.

సౌరాష్ట్ర

బొంబాయిరాష్ట్రం ఉత్తరభాగంలో గుజరాత్ ద్వీపకల్పంలో 217 సంస్థానా లున్నవి. వీని భాగస్వాముల సంఖ్య 449. వీనిలో భావనగర్, నవానగర్ సంస్థానాలు రెండు మాత్రమే కొంచెం పెద్దవి. కొన్ని చదరపుమైళ్ళకన్నా ఎక్కువ విస్తీర్ణంలేని సంస్థానాలుకూడా ఈ ద్వీపకల్పంలో వున్నవి. సంస్థానం చిన్నదైనా, దాని భూభాగం నాలుగైదు ముక్కలుగా చెల్లా చెదురుగా వుండి, ఒకభాగంలోనుండి ఇంకొక భాగంలోనికి వెళ్లటానికి ఇతర రెండు మూడు సంస్థానాలగుండా వెళ్ళవలసివచ్చేటట్లుండి, రాకపోకలకు, సంస్థానాల ఆర్థిక అభ్యున్నతికి చాల ఆటంకముగా నుండెను. ఈ చిన్నచిన్న భాగాలన్నీ కలిసి ఒక పెద్ద కూటమిగా ఏర్పడి, ఏక పరిపాలనక్రిందకు వస్తే ఈ ప్రాంతము చాల అభివృద్ధిచెందుటకు అవకాశమున్నదని ప్రజలు, సంస్థానాధీశ్వరులు కూడ గుర్తించిరి. సంస్థాన శాఖమంత్రి సర్దార్ పటేల్ ఈ ప్రాంతమువాడే అగుటవలన ఆయన మాటప్రకారం ఒక సంస్థాన కూటమి ఏర్పరచటానికి అందరూ అంగీకరించారు. పెద్ద సంస్థానాలకు నవానగర్, భావనగర్ల పాలకులు కూడా ఈ కూటమిలో చేరటానికి మొదట్లోనే అంగీకరించటం వల్ల, ఇతర సంస్థానాధీశ్వరులను అంగీకరింప జేయటం చాలవరకు సులభమై పోయింది. సౌరాష్ట్రమను పేరతో ఈ సంస్థాన కూటమిని ఏర్పరచుటకు ఏర్పాట్లన్నీ జనవరి నెలలో జరిగి, జనవరి 23 వ తేదీన ఒడంబడికపై సంతకాలు జరిగాయి.

సంస్థానకూటములను ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పరచినప్పుడు, అందు కలసిన సంస్థానముల పాలకులనుండి ఒకరిని 'రాజప్రముఖ్' గాను, ఒకరిని 'ఉపరాజ ప్రముఖ్' గాను ఎన్నుకుని, పరిపాలన అంతయు వారి పరముగ, బాధ్యతాయుత ప్రజాప్రభుత్వ సూత్రముల ప్రకారము ఏర్పడిన మంత్రులు నిర్వహించునట్లు ఏర్పాటు చేయబడినది. సంస్థానకూటమిలో చేరిన సంస్థానాధీశ్వరుల వారసత్వము, మర్యాదలు, లాంఛనములు, వ్యక్తిగతఆస్తి, భరణము శాశ్వతముగా గుర్తించుటకు భారతప్రభుత్వము, రాష్ట్రములలో కలసిపోయిన సంస్థానముల విషయములో వలెనే, అంగీకరించినది. సంస్థానాధీశ్వరుల భరణము, వారి సంస్థానముల ఆదాయమునుబట్టి పాలకులకు 10-15 లక్షల రూపాయలు మొదలుకుని 3, 4 వేల రూపాయలవరకు వుండునట్లు నిర్ణయింపబడినది. కాబట్టి కూటముల స్థాపనతో సంస్థాన ఏకీకరణ, ప్రజాస్వామ్య పద్ధతుల ప్రవేశపెట్టుట ఒకే పర్యాయము జరిగినది.

సౌరాష్ట్ర కూటమికి నవానగర్ పాలకుడు జాం సాహెబ్ 'రాజప్రముఖ్' గాను. భావనగర్ పాలకుడు 'ఉపరాజ ప్రముఖ్' గాను ఎన్నుకొనబడిరి. ఈ సంస్థానకూటమి ఫిబ్రవరి నెల 15 వ తేదీన అములులోనికి వచ్చినది. సర్దార్ వల్లభాయ్ పటేల్ దీనికి ప్రారంభోత్సవం జరిపాడు.

మత్స్య రాజ్య కూటమి

సౌరాష్ట్రకూటమి స్థాపనతో, సంస్థాన ఏకీకరణోద్యమం మరింత చురుకుగా సాగినది. ఆళ్వార్, భరతపూర్ మొదలగు ఉత్తరదేశ సంస్థానములు కలసి, అవన్నియు కొంచెము పెద్దవే అయినను, మత్స్యరాజ్యకూటమి నేర్పరచుటకు నిశ్చయించినవి. ఇట్టి సంస్థానకూటముల పరిపాలనాప్రాంతము పెద్ద దగుటవలన, తక్కువ ఖర్చుతో సుపరిపాలనా సంస్థలు ఏర్పరచుటకు, ప్రజాప్రభుత్వము లేర్పరచుటకు, ఆర్థికాభివృద్ధికి కృషిచేయుటకు వీలగుచున్నది. అందువలన సంస్థాన శాఖవారు చురుకుగా పనిచేసి, ఆయా సంస్థానాధీశ్వరులకు నచ్చజెప్పి, సంస్థానకూటముల స్థాపన సాధ్యమగునట్లు జేసిరి. మత్స్యరాజ్యకూటమి స్థాపనకు ఒడంబడిక ఫిబ్రవరి 28 వ తేదీన జరిగి, కూటమి మార్చి 18 వ తేదీన స్థాపింపబడెను. దీనికి ప్రారంభోత్సవం అధివేశమంత్రి గాడ్గిల్ గారు జరిపారు. ఈ కూటమికి ధోల్‌పూర్ మహారాజా 'రాజప్రముఖ్' గాను, ఆళ్వార్ మహారాజా 'ఉపరాజప్రముఖ్' గాను ఎన్నికైరి.

వింధ్య ప్రదేశ్

బుందేల్‌ఖండ్, బాగెల్‌ఖండ్ సంస్థానములు 35 కలసి 'వింధ్యప్రదేశ్' అను పేరతో ఒక సంస్థానకూటమి నేర్పరచుకున్నవి. రేవా సంస్థానము కూడా ఈ కూటమిలో చేరినది. ఈ మధ్యప్రాంతములో ఖనిజసంపద విస్తారముగా నున్నది. ఈ సంస్థానకూటమికి సంబంధించిన ఒడంబడికపై మార్చి 13 వ తేదీన సంతకములు జరిగినవి. దీని ప్రారంభోత్సవం ఏప్రిల్ నాలుగవ తేదీన జరిగినది. దీనికి 'రాజప్రముఖ్' గా రేవా మహారాజాయున్నూ, 'ఉపరాజప్రముఖ్' గా పన్నా మహారాజాయున్నూ ఎన్నుకొనబడిరి.

రాజస్థాన్

రాజపుత్రస్థానములోని 9 చిన్న సంస్థానములు కలసి ఒక కూటమిగా ఏర్పడవలెనని మొదట్లో నిర్ణయమయ్యెను. ఇందులో ఉదయపూర్ మహారాజా చేరునని ఎవ్వరూ ఆశించలేదు. ఉదయపూర్ చాలా పెద్ద సంస్థానము కాబట్టి, అది కూటమిలో చేరవలెనని కోరుటకు కూడ అవకాశము లేకపోయినది. కాని ఉదయపూర్ మహారాజా స్వయముగా ముందుకు వచ్చి ఈ కూటమిలో చేరెను. అందువలన ఈ 10 సంస్థానములు కలసి 'రాజస్థాన్' అను కూటమిగా ఏర్పడినవి. ఈ కూటమికి రాజప్రముఖ్ గా ఉదయపూర్ మహారాణాయున్నూ ఉపరాజప్రముఖ్ లుగా కోట, బుంది, దుంగర్‌పూర్ పాలకులు ముగ్గురున్నూ ఎన్నుకొనబడిరి.

రాజస్థాన్ కూటమి ఒడంబడికలో ఇంకొక ప్రత్యేకతవున్నది. భారతదేశములో చేరిన సంస్థానములన్నీ రక్షణ, రాకపోకలు, విదేశవ్యవహారములను మూడు విషయములపైననే అధికారమును దఖలు పరచెను. ఈ సంస్థానకూటమి, రాష్ట్రప్రభుత్వములు కేంద్ర ప్రభుత్వమున కన్ని అధికారములను దఖలు పరచునో అన్ని అధికారములు, ఒక్క పన్నువిధించు అధికారము తప్ప, కేంద్రప్రభుత్వమునకు దఖలు పరచినది. తరువాత ఏర్పడిన కూటములన్నియు భారత ప్రభుత్వమునకు ఇట్టి అధికారములనే దఖలుపరచినవి. ఇంతకుముం దేర్పడిన వింధ్యప్రదేశ మత్స్య, సౌరాష్ట్ర కూటములు కూడ వేరొక ఒడంబడిక ద్వారా ఇట్టి అధికారమును కేంద్ర ప్రభుత్వమునకు దఖలు పరచినవి. రాజస్థాన్ కూటమి ప్రారంభోత్సవం పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఏప్రిల్ 18 వ తేదీన జరిపారు.

మధ్య భారత్

గ్వాలియర్, ఇండూర్, మాళ్వా సంస్థానములు మరి ఇతర 20 చిన్న సంస్థానములతో కలసి మధ్యభారతకూటమిగా ఏర్పడినవి. గ్వాలియర్, ఇండూర్ సంస్థానములు పెద్దవగుటచే ఈ కూటమిలో చేరవని ముందు భావించిరిగాని ఆ సంస్థానాధీశ్వరు లిరువురు కూటమిలో చేరుటకు ముందుకు వచ్చిరి. గ్వాలియర్, ఇండూర్ లలో ప్రజాభిప్రాయము ముందు వ్యతిరేకముగా వున్నా క్రమేణా ఈ కూటమి స్థాపనకు సుముఖత వహించినది. ఈ కూటమి ఒడంబడిక ఏప్రిల్ 22 వ తేదీన జరిగినది. మే 28 వ తేదీన పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఈ కూటమికి ప్రారంభోత్సవం జరిపాడు. గ్వాలియర్ మహారాజా 'రాజప్రముఖ్' గాను, ఇండూర్ మహారాజా 'ఉపరాజ ప్రముఖ్' గాను ఎన్నుకొనబడిరి.

పాటియాలా, తూర్పుపంజాబ్ సంస్థానకూటమి

సంస్థానకూటములలో చిట్టచివరిది తూర్పు పంజాబ్ సంస్థానకూటమి. ఇందులో మొత్తం 8 సంస్థానాలు చేరినవి. పాటియాలా మహారాజా రాజప్రముఖ్ గాను, కపుర్థలా మహారాజా ఉపరాజ ప్రముఖ్ గాను ఎన్నుకొనబడిరి. ఈ ఒడంబడికపై మే 5 వ తేదీన సంతకాలు జరిగినవి. జులై 15 వ తేదీన సర్దార్ పటేల్ దీనికి ప్రారంభోత్సవం జరిపాడు.

ముగింపు

ఈ విధముగా భారత సంస్థానాలన్నీ ఏకీకరణ చేయబడినవి; వానిలో ప్రజాస్వామ్య పద్ధతులు ప్రవేశపెట్టబడినవి. ఇంకా 12 పెద్ద సంస్థానాలు, 9 చిన్న సంస్థానాలు మిగిలివున్నవి. చిన్న సంస్థానాలు బహుశః త్వరలోనే సంశ్లిష్ట రాష్ట్రములతో కలసిపోవచ్చును. పెద్ద సంస్థానాల అస్తిత్వము మన్నించినా, వాటి అధికారాలను తగ్గించి, వానినికూడా రాష్ట్రముల స్థాయికి తీసుకుని రావలసి యున్నది. ఇప్పుడా పెద్ద సంస్థానము లన్నిటిలోను ప్రజాప్రభుత్వములే అధికారము నిర్వహించుచున్నవి కాబట్టి ఈ పని ఏమంత కష్టముకాకపోవచ్చును.

స్వాతంత్ర్య ప్రాప్తి సందర్భమున భారతదేశము నుండి కొంతభాగము విడిపోయినా, తక్కిన భాగమైనను ఇదివర కెన్నడు లేనంతటి ఐక్యతను పొందుటకు వీలైనది. ఈ ఐక్యత నూహించి, కృషించి, సాధించిన సంస్థానశాఖామాత్యుడు సర్దార్ పటేల్, ఆయన ఉద్యోగులు ఈ ఉద్యమము జయప్రదమగుటకు తోడ్పడిన సంస్థానాధీశ్వరులు, ప్రజలు ఎంతేని అభినందనీయులు.

పట్టిక 1.

సంశ్లిష్టరాష్ట్రాలలో కలసిపోయిన సంస్థానాల వివరాలు

రాష్ట్రము.	చేరినసంస్థానముల సంఖ్య	విస్తీర్ణము (చ. మైళ్ళు)	జనాభా (లక్షలు)	ఆదాయము (రూ. లు లక్షలు)
1. ఒరిస్సా	23	23,637	40 46	98.74
2. సి. పి. బీరార్	15	31,749	28.34	88.31
3. బీహార్	2	628	2.08	6 45
4. మద్రాసు	2	1,444	4 88	30.81
5. తూర్పుపంజాబ్	3	370	.80	10 38
6. బొంబాయి	174	26,951	43.67	307.15
మొత్తం	219	84,774	120.18	541.84

పట్టిక 2.

కేంద్రప్రభుత్వ పరిపాలనక్రిందకు తీసుకొనబడిన సంస్థానాల వివరాలు

పేరు.	సంస్థానాల సంఖ్య.	విస్తీర్ణము. చ. మైళ్ళు	జనాభా లక్షలు	ఆదాయము రూ. లక్షలు.
హిమాచలప్రదేశ్	21	10 600	9 86	84.56
కచ్	1	8,461	5.01	80 00
మొత్తం	22	19,061	14.37	164.56.

పట్టిక 3.

సంస్థానకూటములుగా ఏర్పడిన సంస్థానాల వివరాలు

కూటమి పేరు.	చేరిన సంస్థానాల సంఖ్య	విస్తీర్ణము చ. మైళ్ళు.	జనాభా లక్షలు	ఆదాయము రూ. లక్షలు.
1. సౌరాష్ట్ర	217	31,885	35.22	800 00
2. మత్స్య	4	7,536	18 38	183 06
3 వింధ్యప్రదేశ్	35	24,610	35.69	243 80
4. రాజస్థాన్	10	29,977	42.61	316 67
5. మధ్యభారత్	20	46 273	71 50	776 42
6. పాటియాలా, తూర్పుపంజాబ్	8	10,119	34.24	500.00
మొత్తం	294	150,400	237 64	2819.45

పట్టిక 4.

ఇంకను మిగిలివున్న చిన్న సంస్థానాల వివరాలు

పేరు.	విస్తీర్ణము చ. మైళ్ళు	జనాభా
1. బెనారస్	866	451,428
2. కూచ్-బీహార్	1,318	640,842
3. జైసల్మీర్	15,980	93,246
4. కాసీసంస్థానాలు	8,789	213,586
5. మణిపూర్	8,620	512,069
6. రాంపూర్	894	477,042
7. సాండూర్	158	15,814
8. తెహరి-ఘర్‌వాల్	4,516	397,369
9. త్రిపురా	4,116	513,010

పట్టిక 5.

పెద్దసంస్థానాల వివరాలు

పేరు.	విస్తీర్ణము చ. మైళ్ళు	జనాభా లక్షలు
1. బరోడా	8,235	28 55
2. హైదరాబాద్	82,313	163.38
3. జమ్మూ, కాశ్మీర్	84,471	40.21
4. మైసూర్	29,458	73.29
5. భోపాల్	6,[illegible]21	7.85
6. కొల్హాపూర్	3,219	10 92
7. తిరువాన్కూర్	7,662	60.70
8. బికనీర్	23,181	12 92
9. కొచ్చిన్	1,493	14.23
10. జైపూర్	15,610	30.41
11. జోధపూర్	36,120	25.56
12. మయూర్భంజ్	4,034	9.91

కులాసాకబుర్లు

'అది ఉంటే ఇది ఉండదు'

శ్రీ జి. యస్. సూరి

'అరిచే కుక్క కరవదు' అని నిర్ధారణ చేశారు అనుభవజ్ఞులు. అంటే అరవని ప్రతి భైరవుడూ కరుస్తాడని ఎంతమాత్రమూ అనుకోకూడదు. కుక్కలు రెండు రకాలని, అరుపూ కరుపూ రెండూ ఉన్న శునకాలు సాధారణంగా ఉండవని, అరుస్తూ కరిచే జంతువు ఈ జాతికి చెందినది గాదని, నిర్భయంగా భావించ వచ్చునన్నమాట.

ఇది సృష్టిలో ఉండే వింత అని చెప్పాలి. ఈ లక్షణం ఏదో ఒకరూపంలో మానవులలో గూడ ప్రత్యక్ష మవుతుంది. ఎన్ని నిదర్శనాలయినా చూపించవచ్చు. మచ్చుకు రచయితలను తీసుకోండి. పెట్టిన కలం పైకి ఎత్తకుండా పుస్తకాలకు పుస్తకాలు బరికివేయగల ప్రతిభావంతులు ముచ్చటగా మూడు మాటలు పలకలేరు. ఇంపుగా ఉపన్యాసాలను ఇవ్వలేరు సరిగదా తాము వ్రాసిన రచనలనైనా రంజింపచేసేట్లు చదువలేరు. రేడియోలో వచ్చే స్వీయకవితల ప్రోగ్రాములు వింటే ఈ విషయం రుజువవుతుంది. అదే విధంగా గంటకు నూరు పద్యములు ఘంటము లేక రచించే ఆశుకవికిశోరాలు ఉత్తమ తరగతికి చెందిన పది పద్యాలనైనా కాగితంమీద వ్రాయలేక పోతున్నారు.

వక్తలు కూడ ఇందుకు భిన్నంగాదు. బ్రహ్మాండమైన మీటింగులలో వేలకు వేల జనాన్ని అనర్గళవాగ్ఝరితో ఉఱ్ఱూతలూగించగలిగిన ఉపన్యాసకులు మూడు కొట్టివేతలు, ఆరు హంసపాదులు లేకుండా ఒక్క వాక్యం వ్రాయలేరు. పార్టీలు మెచ్చుకునేట్లు, జడ్జీలు విసుక్కునేట్లు బల్ల గుద్ది గర్జించ గల లాయర్లు కాగితంమీద కలం పెట్టవలసి వచ్చేప్పటికి ఉడ్డుకుడుచుకుంటారు. ప్రీవికౌన్సిలుకు పోయినా తిరుగులేని పత్రాలను వ్రాయగల న్యాయవాదులు కోర్టులో నోరు తెరిస్తే "యువర్ ఆనర్, మిలార్డ్" అనే మాటలు తప్ప పెగిలిరావు. గుక్క తిప్పుకోకుండా పాఠాలను నూరి పోయగల పంతుళ్లు బోర్డుమీద సీమసున్నం పెట్టటానికిగాని, ప్రశ్నలకు సమాధానాలు వ్రాసి ఇవ్వటానికి గాని జంకిపోతారు. వాక్స్థానంలో మందగ్రహం ఉన్న ఉపాధ్యాయులు పబ్లిక్ పరీక్షలకు నోట్సు పుస్తకాలు వ్రాసుకుంటారు.

ఈ లక్షణపు వికృతరూపం అనేక విధాలుగా ప్రస్ఫుట మవుతుంది. ఒక్కొక్క విధంగా గోచరిస్తుంది. రంగస్థలం మీదగాని, సినిమా లోకంలో గాని నటులను గమనించండి. శ్రావ్యంగా సంగీతం పాడేవాడి నటన అయోమయంగా ఉంటుంది. కళ్ళుమూసుకుని, నోరు తెరిచి, చెవిదగ్గర చెయ్యి పెట్టి చెవులు గింగురుమనేట్లు పద్యాలను పాటలను ఊదిపారవేయగలిగినవాడు వచనం చెప్పవలసివచ్చేప్పటికి యమయాతన అనుభవిస్తాడు. అభినయంఅంటే మూతి తిప్పటంకాదా అని అడుగుతాడు. అప్యాయనంగా మాటలాడి, అద్వితీయంగా నటించగలిగినవాడు తప్పని సరిగా పాట పాడవలసివస్తే ముచ్చెమటలు పోసి నీరైపోతాడు. గొంతుకు, శృతికి లంగరందక ప్రేక్షకులవంక దైన్యంగా చూస్తాడు.

నాట్యంచేసేవాళ్ళూ అంతే. ఆటగత్తెలు పాటగత్తెలు కాలేరు. పాటగత్తెలు ఆటగత్తెలు కాలేరు. అందువల్లనే ఒకళ్ళు ఆడుతుంటే మరొకళ్ళు వంత పాడడం ఆచారమయింది. ఈ కారణంవల్లనే సినిమాలలో గొప్పగొప్ప నటులకు, నర్తకులకు పాటలుపెట్టవలసివస్తే పెదవులు మాత్రం వారిచేత కదలింపచేసి, సంగీతం మరొకరిచేత పాడించి, రెంటినీ జోడిస్తారు.

అదేవిధంగా సంగీతం పాడేవాళ్లు వాయిద్యాలను మోగించలేరు. ఏ వాయిద్యాన్ని అయినా జీవం పోసినట్లు పలికించగలిగినవాళ్లు, అపశృతి లేకుండా నోటితో సాపాసా అనలేరు. రెండూ ఉన్నవని ప్రజ్ఞకోసం పాకులాడేవాళ్లు నిజానికి ఉన్నదానిచేత లేనిదానిని కమ్మదలచేస్తూ నటించటంతప్ప మరొకటికాదు.

వైద్యులలో ఈ లక్షణం కొట్టినట్లు కనబడుతుంది. రోగిని చూడగానే వ్యాధినిరూపణచేసి చిటికలలో మందులవల్ల రోగం కుదర్చగల డాక్టర్లు గజ్జిపొక్కునుచూసి గడగడ లాడుతారు. ఎంత ఆపరేషన్లనయినా కత్తిపట్టి సొరకాయలను తరిగినట్లు చీల్చిచెండాడగల డాక్టర్లు జలుబుకు మందివ్వవయ్యా అంటే ప్రిస్క్రిప్షనును ఆరుసార్లు చిత్తు, రఫ్‌చిత్తు, అఖండ చిత్తులుగా వ్రాయవలసివస్తుంది. ఇటు మందు సీసాను, అటు కత్తిని సమానంగా ఝుళిపిస్తామనే భిషక్కులు ఎందులోనో సమర్థత లేకుండా భేషజంమాత్రం ప్రదర్శిస్తున్నారని గ్రహించవచ్చు.

ఇక ఇంజనీర్లను గమనించండి. ఎంత గొప్ప బ్రిడ్జిలకైనా, డాములకైనా, యంత్రాలకైనా సునాయాసంగా ప్లాను గీసి బ్లూప్రింట్లు తయారు చేయగల విశారదుడు నిర్మాణం చేయవలసి వచ్చేప్పటికి మేస్త్రీ అన్నదానికల్లా గంగిరెద్దు మాదిరి తల ఊగిస్తాడు. ఎప్పుడు పోయి బల్లదగ్గర కాగితం పెన్సిలు పట్టుకుని కూర్చుందామా అని మీనవేషాలు లెక్కపెడుతూ ఉంటాడు. ప్లాను తయారుచేయమంటే కుడితిలో పడ్డ ఎలుకలాగ తన్నుకునే ఇంజనీరు నిర్మాణకార్యక్రమంలో మెరికలాగా విజృంభిస్తాడు. అందాకా ఎందుకు మోటారు డ్రైవర్లను చూడండి. వళ్ళు కదలకుండా, గాలిలో విమానంమాదిరి కారును నడిపేవాడు, పెట్రోలు గొట్టానికి నలుసులు అడ్డం వచ్చినా ఏమీ తోచక మిడిగుడ్లు మిటకరిస్తాడు. కన్నుమూసి తెరిచేంతలో ఇంజనును యావత్తూ ముక్కలు ముక్కలుగా ఊడతీసి బిగించగలిగినవాడు కారు నడుపుతుంటే, ప్రాణం ఇన్సూర్ చేసుకుని కూర్చుంటే మంచి దనిపిస్తుంది. ఇదే విధంగా పోటీపరీక్షలలో బహుమతులు పొందే ఫొటోగ్రాఫర్లు, చీకటిగదిలో ఎఱ్ఱదీపం ముందు కూర్చుని ప్రింటుచేసుకోవాలన్నా, డెవలప్ చేసుకోవాలన్నా యమయాతన పడుతున్నట్లు ప్రవర్తిస్తారు.

వర్తకుల గొడవగూడ ఇట్లాగే ఉంటుంది. ఆఫీసుగదిలో టెలిఫోను దగ్గరకూర్చుని ఉత్తరాలమీద లక్షల వ్యాపారం చేసే పెద్దమనిషి సరుకు కొనటానికి బయలుదేరితే కాటా దగ్గర నుంచి ప్రతి విషయంలోను టోపీ వేయించుకుంటాడు. మార్కెటు దరలకంటె తక్కువరేటుకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్మకం చేసి మసిపూసి మారేడుకాయ చేయగల వర్తక శిఖామణి కంటిముందు సరుకుకు బదులు కాగితం కనబడితే తెల్లముఖం వేసి కాళ్ళు పారజాపుతాడు.

ప్రపంచరాజకీయాలను గురించి పండితులను పామరులనూ విస్మయపరచే సంపాదకీయాలు వ్రాస్తూ రిపోర్టర్లను మొదట సహాయసంపాదకుల వరకూ హడలగొట్టే పత్రికాసంపాదకుడు, ఒకే విషయంలో వచ్చిన రెండు టెలిగ్రాములను ఎడిట్ చేసి హెడ్‌లైను వ్రాయటానికి క్రిందు మీదవుతాడు. వచ్చిన న్యూస్‌కంటే మజాగా శీర్షికలు తయారు చేయగల బుద్ధిమంతుడికి సంపాదకీయం ఒప్పగిస్తే ఆదిమధ్యాంతాలకు అంతుదొరకక కాగితాలు చెడబరికి చించి పారేస్తాడు.

ఎంత గొప్ప వ్యక్తికైనా ఒకటి ఉంటే మరొకటి లోపించక తప్పదు. అందుకు ఎవ్వరూ బిడియపడ నక్కరలేదు. రెండూ ఉన్నవాడంటూ ఉంటేవాడికి మేము సాష్టాంగం.

మానసిక శాస్త్రము :

పరావర్తన వ్యాపారాలు

శ్రీ పారనంది జగన్నాథస్వామి

౧

మనోవ్యాపారాలను అధమ మధ్యమ ఉత్కృష్టములు అని మూడు రకములుగ అంగీకరింపవచ్చును. శరీరరక్షణ సంబంధమైన ప్రధాన వ్యాపారములు అధమవర్గము. ప్రాణము నిలుపుకొనుటకు చేసే వ్యాపారాలు అవి. ఉచ్ఛ్వాస నిశ్వాసములవంటివి. ఇవి సమస్త ప్రాణికోటికి తుల్యములు. ఈవ్యాపారాలకు ఉపచరించే నరములు వెన్నుపాములో ఉండును. ఈవ్యాపారాలు జరగడానికి మెదడుయొక్క ప్రసక్తి అంతగా అవసరము ఉండదు. వీటికే పరావర్తన (reflex) వ్యాపారాలు అని అంటారు. మంచి నిద్రలో ఉండినన్నీ దోమ, నల్లి కరిస్తే చేతితో దానిని కొట్టడము ఇందుకు ఉదాహరణము. ఇట్టిదే పుట్టిన శిశువు చేసే స్తన్యపానము. ఇవి చాలా అధమమనోవ్యాపారాలు. మధ్యమవర్గమునకు చెందినవి మెదడువరకు పోనక్కర లేకుండా ఇచ్ఛాబుద్ధుల ప్రసక్తి అంతగా అవసరము లేకుండా ఇంద్రియ శిర మాంసకండర శిరముల మధ్యనే జరిగేవి; ఇందుకు ఉదాహరణముగా ఇంద్రియ వ్యాపారాలను పేర్కొనవచ్చును. కన్ను రెప్పలు మూయుట, తెరచుట వంటివి. కంటి పాపపై పడే వెలుతురుయొక్క తీక్ష్ణతనుపట్టి ఆ పాప విడడము ముడుచుకొనడము ఈ పొందలైనవి. ఉత్కృష్టవర్గమునకు చెందినవి బుద్ధి మొదలైన వ్యాపారాలు.

శాస్త్రీయముగా మూడు రకములు చూపించినా, గౌణముగా రెండు రకములుగా భావింపవచ్చును. బుద్ధిప్రేరణ అవసరము లేనివి అధమ వర్గములోనివి. బుద్ధిప్రేరణవలన జరిగేవి ఉత్కృష్టములు. మొదటివి కేవల శారీరక కృత్తులవలెనే ఉంటవి; ఆ శారీరకకృత్తులకు సంబంధించిన చైతన్యము ఉంటుదా లేదా అనే విషయము వివాదగ్రస్తమై యున్నది. ఇప్పుడు మనకు ఆ చర్చ అప్రస్తుతము. కాని మనస్సుయొక్క సుస్థితినిబట్టి ఈ అధమవర్గ వ్యాపారాల స్థితి ఉంటుందని చెప్పవచ్చును. మెదడు రోగగ్రస్తమైతే ఈ వ్యాపారాలు సరిగా ఉండవు.

ఇవి స్వయంప్రేరితము లని చెప్పవచ్చును. ఇచ్ఛాబుద్ధుల ప్రేరణ అవసర ముండకనే ఇవి ప్రవర్తించగలవు. జీవ పరిణామములలో ఇవి ప్రాథమిక ప్రాణులలో ప్రధానముగా ఉండినవి. కాబట్టే ఈ వ్యాపారాలకు సంబంధించిన చైతన్యము అధమస్థితిలో నున్నది. అధమ ప్రాణులలోని ఈ వ్యాపారాలకు చైతన్యము కలదా అనే శంక కలుగుతుంది. రానురాను జంతువులు అధమస్థితిని దాటి ఉన్నత స్థితికి పరిణమిస్తూఉంటే, ఈ వ్యాపారాలకు లీనచైతన్యము వాసనారూపచైతన్యము ఉన్నట్లు స్పష్టమైనది.

ఇట్లు క్రమముగా సోపానముకంటె సోపానము ఉత్కృష్టత పొందసాగింది. ఏ సోపానము ముందుగా తయారైనదో ఆ సోపానము వ్యుత్క్రమ క్రమములో తుదివరకు చెడకుండా ఉంటుంది. చైతన్యము క్షీణించునపుడు అనగా వార్ధక్యములోగాని, రోగము చేతను గాని, ఔషధ ప్రయోగమువలనను గాని, చైతన్య క్షీణము వస్తున్నప్పుడు, మొట్టమొదట నశించేది ఇచ్ఛాబుద్ధి రూపమైన ఉత్కృష్టచైతన్యము. ఇది పరిణామములో చాలా ఆలస్యముగా వ్యక్తమయింది గదా. అనగా మనుజుని స్థితినాటికి గాని, ముఖ్యముగా నాగరక మనుజుని స్థితి నాటికిగాని ఈ ఉత్కృష్ట మనోవృత్తులు పరిణమించలేదు. ఆహారాదిసంబంధమైన వ్యాపారాలు వాటి చైతన్యము స్వయంప్రేరిత మైనవి. పరావర్తనమైనవి తుదవరకు ఉంటవి ఇది ప్రతిలోమ క్రమములో జరుగును. ఏది మొదట వ్యక్తమో అది తుదివరకు ఉంటుంది. ఏది ఆలస్యముగా వ్యక్తమో అది ముందర పోతుంది.

౨

మనస్సు పొందే సంస్కారాలు మనస్సులో ప్రవేశించినప్పుడు విడి విడిగా వచ్చినా మనస్సులో మాత్రము అలాగు వేరువేరుగా ఉండిపోవు. ఏవో కొన్నికొన్ని సంస్కారాలు కూడుకొని గుంపులుగా తయారవుట వాటి స్వభావము. ఆ గుంపులైనా వేరువేరు గుంపులుగా ఉండిపోవు. ఇరుగు పొరుగు గుంపులతో సంబంధము కలుగజేసుకొనును. తుదకు అంతా ఒక ముద్దగా అవుతుంది. అదే దాని ఐక్యతా గుణము.

ఈ గుంపులు ఏ అంతస్తులో ఏ సోపానములో ప్రాదుర్భావము పొందుతవో అక్కడే అలాగే ఉండిపోక అన్ని అంతస్తులలోకి అన్ని సోపానాలలోకీ ప్రసరిస్తవి. వాటి ప్రాదుర్భావము కనుగొనాలంటే, పైన కనబడుతున్న దగ్గర నుండి వెదకగా వెదకగా వాటిజన్మ ఏదో ఒక వాసనలో అయినట్లు విశద మవుతుంది. ఆ వాసనా సంబంధమైన భావోద్రేకమును కలిగియుండి, ఆ భావబలముచేత స్థిర రూపాన్ని దాల్చుతూ అది ఉంటుంది. ఎట్లంటే :— ఒక విద్యార్థిమనోవ్యాపారాలన్నీ సాధారణముగా విద్యాసంబంధము గలవే అయి యుంటవి గదా? ఏదైనా ఒక ఆలోచన ఉదయించినపుడు అది త్వరలో విద్యాసంబంధమైన మనో వ్యాపారాలలో దేనితోనో ఒకదానితో పత్తుకొంటుంది. కాని విద్య అతనికి ముఖ్యవ్యాపారమే అయినా, మరికొన్ని ఇతర వ్యాపారాలు అనుషంగికములుగానైనా ఉండవచ్చును. ఆహార సంపాదన, తల్లిదండ్రుల సేవ, గృహకృత్యములు, ఈ మొదలైన వ్యాపారాలు ఏవైనా ఉండవచ్చును గదా? ఇవి విద్యయంత ముఖ్యమైనవి కానందున బాహ్యముగా చైతన్యమున వ్యక్తముగాక లీనములో కొంతవెనుకను ఉండి ప్రవర్తిస్తూ ఉండును. అక్కడను ఉండే ప్రవర్తిస్తూ, వేళ్ళు తంతూ, వేళ్లను ఈ ప్రక్కకు ఆ ప్రక్కకు పంపుతూ, గుంపులను నిర్మిస్తూ ఉండును.

ఇట్టి గుంపులలో ఉన్న దేదైనా ఒక ఆలోచనను అనుసరించి ప్రవర్తించేటప్పుడు, ఆ ఆలోచన వేటివేటితో సంబంధము కలిగి ఉంటుందో, అవి అన్నీ గాని అందులో కొన్ని గాని జ్ఞప్తికి రావచ్చును. వీటిలో ఏదైనా త్వరలో జ్ఞప్తికి రాకపోతే జ్ఞప్తికి వచ్చినదానిని అట్టి ప్రయత్నిస్తే, అదికూడా వీటితో సంబంధి అయిఉండుటచేత జ్ఞప్తికి రావచ్చును. ఈ సూత్రము జాగ్రచ్చైతన్యము అంతస్తులలో ఉపచరించినట్లు అపగత చైతన్యానికి వర్తించదుగాని అందులో లీనమై యున్న కొన్నియైనా, ఎక్కువగా ప్రయత్నించి ప్రోత్సహిస్తే, జల్లెడ దాటి పైకి రావచ్చునని శోధకులు ఆశించి, అపగతచైతన్యస్వరూపాన్ని తెలుసుకొనుటకు ప్రయత్నిస్తున్నారు.

ఈ సంబంధాలను వర్గీకరించి చూస్తే, కొన్ని నియమములు ఉన్నట్లు కనబడుతూ ఉంది. ఒక్క విషయమైన ఆలోచనలు ఆ విషయసంబంధాన్ని విశదపడవచ్చును. ఒకేకాలమున మనస్సులో పడి ఉన్నందున కాలసంబంధాన్ని జ్ఞప్తికి రావచ్చును. కార్య కారణ సంబంధము ఉండవచ్చును. ఇట్టి సంబంధము ఉండవచ్చును. ఇట్టి సంబంధము ద్వారా జ్ఞప్తి నిర్మాణము ప్రవర్తిస్తూఉంటుంది.

జార్జి బెర్నార్డ్‌షా

(7-వ పేజీ తరువాయి)

షా సామ్యవాదుల సమావేశ మొకదానిలో ఉపన్యసిస్తున్నాడు. సంఘంలోని ఆర్థిక వ్యత్యాసాలు ఆనాటి ఉపన్యాస విషయం.

"మహాజనులారా,! నేను నేటి సమావేశంలో కాలిడుతోంటే బైట 2000 పౌనులు ఖరీదుగల రోల్సురాయిస్ కారు కనబడినది. ఒకమనిషికి అంత ధన ముండడము న్యాయమేనా అని నా ప్రశ్న. మీరే వెళ్లి చూడవచ్చు. చూసి ఆ ధనాన్ని పేదజనుల ఉద్ధరణకు ఉపయోగిస్తే ఎంతబాగుంటేదో ఆలోచించండి" అన్నాడు షా.

సభాసదులు కొందరు లేచారు. కారును ముక్కలు చెక్కలు చేద్దామన్న తీవవాంఛ వారి కళ్ళలో కనబడుతోంది. వెంటనే అందు కొన్నాడు షా.

"అయ్యలారా! మీకు నా సానుభూతి! ఆ కారును ధ్వంసంచేసేముందు ఆ కారు నాదని మాత్రము గుర్తుంచుకోండి" అన్నాడు బెర్నార్డుషా.

నాటక రచనా విధానము

నాటక రచయితగా షాను గురించి కొలది మాటలలో ముగించడం బహు కష్టసాధ్యమైన పని. 17-19 శతాబ్దుల మధ్య ఆంగ్ల నాటకరంగము నిర్జీవమై, ఫ్రెంచి నాటక రంగానికి చౌకరకపు, అనుకరణమై గొప్ప నాటకకర్తల మీదగాక నటులపై నాధారపడియుండేదని అట్టి రంగముమీద ధ్వజమెత్తిన షా తన స్థానముకొరకు బహుశ్రమించవలసి వచ్చిందని మనవిచేశాను. నాటకకర్తగా షాను గురించి గుర్తుంచుకొనవలసిన విషయములు ఒకటి రెండు గలవు. షా ఆంగ్ల నాటకరంగము ఫ్రెంచి నాటకముల ప్రతిబింబము గాకూడదని పాశ్చాత్యగ్రీకు నాటకకర్తల విధానము పునరుద్ధరించినాడు. ఆ విధానాన్ని నవీన సమస్యల పరిష్కారాని కుపయోగించినాడు. అందు మనకు కనబడే దీర్ఘోపన్యాసములు ఆ విధానము ననుసరించినవే. అదిగాక షా తన నాటకాలను తన భావాన్ని ప్రచారములోనికి తెచ్చుటకు సాధనాలుగా ఉపయోగించడంచేత అందు రాజకీయాలు, మతము, సంఘము, వివాహము, విద్య వగైరా విషయాలపై దీర్ఘచర్చలు కనబడుతవి. ఆ చర్చలే మొదట విమర్శకులకు వెంగము మొత్తించినవి. ఇతని నాటకాలు సంఘ ప్రతిబింబములు కావు. కొన్ని సంఘముయొక్క వ్యాఖ్యానాలు. కొన్ని సంఘముమీద నెత్తబడిన ఘనధ్వజములు.

కల్పనా విధానము (Plot) విషయములో ముందు నిర్ణయము చేసికొనకపోవడం షా నాటకాలలో ప్రత్యేకత. ఒక పేజీ వ్రాస్తూంటే ముందుపేజీలో వ్రాయబోయేది ఆలోచించడు. చిత్రవిచిత్ర కల్పనా రీతులు ప్రేమవ్యవహారాలు, హత్యలు యిందు కానరావు. బెర్నార్డుషా తన మొదటి నాటకంలో తొలిఅంకములు Henry Arthur Jones అనే స్నేహితునికి చదివి వినిపిస్తూంటే అతడు "ఇందులో ఖూనీ ఎక్కడ జరుగుతుంది!" అని ప్రశ్నించాడట. షా తనకు వధలు, ఖూనీలు వగైరా అక్కర్లేదనీ, అవంటే తనకు ఏవగింపనీ, పేదజనుల పూరిగుడిసెలలోని ఆర్థిక పరిస్థితులే సామగ్రిగ తను నాటక రచన చేయగలననీ ప్రత్యుత్తర మిచ్చినాడు.

ఈ యుగమువారి భావపరివర్తనలో షా ప్రభావము

ఒకరు వాకొనినట్లు వాల్టయిర్‌కు తన యుగమున ఆ కాలమునాటి జనుల భావములపై ఎంతటి పలుకుబడి గలదో నేటికాలమువారి భావములపై షాకును, అంతటి పలుకుబడి గలదు. సామ్యవాద సూత్రముల కింతటి ప్రచారము కల్గుటకు ముఖ్యకారకులందు షా ఒకడని మనము గుర్తించియే యున్నాము. నేటి ప్రజాస్వామ్యములోని బూటకపుతనముగూర్చి విస్తారప్రచారము చేసినవారిలో అగ్రతాంబూలము షాకు చెందవలసియుండును. ఇటీవలనే 'Tribune' పత్రికకు వ్రాసిన వ్యాసములో షా నేటి మాటల పోగు శాసనసభలందు ప్రజలకు జనించిన నిస్పృహయే హిట్లరు, ముస్సోలినీ మున్నగువారి ఉద్భవమునకు హేతువని షా వాకొనియున్నాడు. 'Everybodys what is what' అను గ్రంథమున నుడివిన వాక్యములు అతని దృక్పథమును చక్కగా స్పష్టపరుపగలవు —

". Until Popular Franchise is Constitutionally guided and limited, political ignorance and idolatry will produce not only Hitlerisque dictatorships but stampeds led by liars or lunatics like Titus Oates and Lord George Gorden. The Choice should therefore be limited to panels of Persons who have passed such tests as we can devise of their wisdom, comprehension, knowledge and energy." .

పార్లమెంటరీ విధానముపై ఆ గ్రంథమున షా చేసిన విమర్శ సామ్యవాదవర్గమువారి కాగ్రహము కల్గించినది. లిరియువార్డు ఫుల్ఫ "Shaw has now reached a stage when he is unable to distinguish between his own sense and nonsense" అని షాపై దుమ్మెత్తి పోసినాడు. నేటి ప్రజాస్వామ్యంలో ప్రజాదరణకై రాజకీయవేత్తలు పడవలసిన తంటాలను గూర్చి షా వ్రాసినమాటలు వినదగ్గవి :—

"The politician who once had to learn how to flatter Kings has now to learn how to fascinate, ammuse, coax, humbug, frighten or otherwise strike the fancy of the electorate .. . . .He who holds popular convictions with prodigious energy is the man for the mob, whilst the frailer sceptic who is cautiously feeling his way towards the next century has no chance of coming to power unless he happens by accident to have also the specific artistic talent of the mountebank, in which case it is as a mountebank that he catches votes and not as a meliorist.'

షా స్త్రీజనాభ్యుదయాభిలాషి. సంఘములో గల వ్యభిచారవృత్తికి కామతృష్ణ హేతువు గాదనియు, ప్రధాన కారణము ఆర్థికమైనదనియు అతని నిశ్చితాభిప్రాయము. జాతుల మధ్య వివాదాలు నిర్మూలించుటలో స్త్రీల కెక్కువ పాలు యివ్వబడాలని అతని కోర్కె. పార్లమెంటు మొదలుగా అన్ని సంస్థలలోనూ స్త్రీలకు చెరిసగం పాలుండాలని అతని అభిలాష. ఆ విషయంలో తా నేమీ చెయ్యలేక పోతున్నానని విచారిస్తూ ఆ విషయంలో కృషి చెయ్యాలని గాంధీమహాత్మున కితడు దేవదాస్ గాంధిచేత కబురు పంపినాడు. స్త్రీ పురుషులు ప్రత్యేకంగా ఓటింగు హక్కు చెలాయించక భార్యాభర్తలు కలసి ఈ హక్కు చెలాయించాలని (Coupled Vote) ఏ ఒకర్నీ ప్రత్యేకం ఎన్నికకు ప్రతిపాదించడము కాని ఎన్నుకొనడం కాని కూడదని అత డిటీవల వెలువరించిన అభిప్రాయము.

రెండవ ప్రపంచ యుద్ధకాలమున షా మిత్రమండలివారు విజయము నొందినపిదప కేవలము కక్ష సాధించుటకొరకు జర్మనీని క్రూరముగ చూడరాదని అసంఖ్యాకములగు ప్రకటనలు చేసి అంతర్జాతీయ పక్షపాతకు-వృద్ధుడయ్యె—యథాశక్తిని సేవ చేసినాడు. మిత్రమండలివారు ఎదుటివారిని నాజీలనియు నేషనల్ సోషలిస్టులనియు నిందించే ముందు ఆత్మపరీక్ష చేసుకొనవలసి యున్నదనియు, నిందలు యుద్ధకాలమునకేగాని శాంతిసమావేశ విజయమునకు తగవనియు, కేవలము పగతో జర్మనీకి బుద్ధి చెప్పవలయునని హింసించుట వలన హిట్లరు, కైజరువంటివారుద్భవించుటకు దారిదీయుననియు, దయాధర్మసూత్రములను బట్టి కూడ పరాజితికైన జర్మనీని హింసించుట హర్షింపదగిన చర్య కాదనియు, షా తీవ్రప్రచారము గావించినాడు. "మనము దురాగ్రహపు ప్రభావో ద్రేకముతో జర్మనీని కొల్లగొట్టి నాశనము గావించిన ఎడల దాని ఫలితము ననుభవించిననాడు విచారింతుము" అని హెచ్చరిక గావించినాడు.

షానుగూర్చిన పిట్టకథలు - ఛలోక్తులు

నేడు సాహిత్యలోకములో షా స్థానము అసమానమైనదని యిదివరకే గుర్తించినాము. నేడు అతనికిగల స్థానము 18 వ శతాబ్దిలో సాహిత్యనియంత అని పేరుబడిన Dr. Johnson స్థానమువంటిది ఆ విధముగనేగాక మరొక విధముగా కూడ ఈ యిర్వురికి పోలిక గలదు. ఈ యిర్వురిని గూర్చినన్ని పిట్టకథలు మరే రచయితనుగూర్చీ వ్యాపిలో నుండవు. అట్లే ఈ యిర్వురిఛలోక్తులంత ఏ యితరరచయితవీ అంత ఎక్కువ వ్యాప్తిలో లేవు.

షాను గూర్చి ప్రచారమందున్న పిట్టకథలను పేర్కొనాలంటే ప్రత్యేక వ్యాసము వ్రాయవలసి యుంటుంది. ఈ పిట్టకథలలో చాల భాగము అతడితరులను చేసిన ఎగతాళికి సంబంధించినవే. "మనిద్దరము పెళ్ళాడితే నీ తెలివితేటలు నా అందం గల అబ్బాయి పుడతాడు కదూ?" అన్న సుందరాంగితో అతను "కొంప తీసి నా అందం, నీ తెలివితేటలు వున్న అబ్బాయి పుడితే?" అని జవాబిచ్చిన కథ, "నిన్ను చూస్తే ఇంగ్లండులో క్షామం ఉందనుకొంటారు" అన్న చెస్టరుటనుకు "నిన్ను చూస్తే ఆ క్షామానికి కారణం తెలుసుకొంటారు" అని అతనిచ్చిన ప్రత్యుత్తరం, తెలియనివారుండరు. వితేకొన్ని సందర్భాల్లో షా కూడా 'సంభావన' పొందవలసి వచ్చేది. Cornelia otis Skinner అనే అమెరికన్ నటి యితని కాండిడా అను నాటకంలో నటించింది. "అద్భుతంగా" ఉందని షా తంతి నిచ్చాడు. మొహమాటంతో కార్నీలియా "పొగడ్తకు తగిన అర్హత లేదు" అని జవాబిచ్చింది.

"నే నన్నది నాటకం మాట" అని షా జవాబు పంపాడు.

"నే నన్నదీ ఆ మాటే" అని ఆ నటీమణి ప్రత్యుత్తరం.

ఛలోక్తుల విషయంలో డాక్టర్ జాన్సనుతో పోల్చవచ్చని మనవిచేశాను. జాన్సను స్కాట్లండు వాళ్ళను గురించి యిచ్చిన నిర్వచనం జగద్విఖ్యాతి పొందినది అల్లాగే "The noblest prospect which a scotch-man ever sees is the road that leads him to England." అన్న వాక్యంగూడ ఆంగ్లభాష తెలిసిన ప్రతివారికీ పరిచితమే. అట్లాగే షా యొక్క "Every man above forty is a scoundrel" అన్ననుడి, "Titles distinguish the mediocre, embrass the superior, and are disgraced by the inferior" అన్న పలుకు, gentleman అనేమాటకు "A gentleman of our days is one who has money enough to do what every fool would do if he could afford it . that is consume with out producing" అని అతడిచ్చిన నిర్వచనం విననివారుండరు. ఇటీవల షా యొక్క ఛలోక్తి గాంధిమహాత్ముని అస్తమయమునకు పూర్వము ఆయన దృష్టిలోనికి తేబడినది. అది ఆంగ్లేయుల తత్వమును గురించి.

"The Englishman does every thing on principles. He fights you on patriotic principles. He robs you on business principles. He bullies you on manly principles. He supports the King on loyal principles and cuts off his King's head on republican principles."

పై వాక్యము నుల్లేఖించి ఒక విలేఖరి ఆంగ్లేయులు ఈ దేశమును వదలుట ఏ సూత్రము ననుసరించి అని మహాత్ముని ప్రశ్నించినాడు. షా జాబితా పరిపూర్ణమూ గాదు, ఆంగ్లేయుల తెలివితేటలంతటితో ఆగేవీ కావని, మహాత్ముడు ప్రత్యుత్తర మిచ్చినాడు.

షా ఛలోక్తులతోపాటు అతని జేబులోని గోసాయిచిట్కాలు కొన్నింటిని పరామర్శించడం అనావశ్యకం గాదు. సౌఖ్యముగా నుండడానికి షా చెప్పేచిట్కా, మనము సౌఖ్యముగా నున్నామా, లేదా?" అని ఆలోచించే వ్యవధయినా లేకుండా ఏదో పనిచేస్తుండటం. అట్లాగే ఒళ్ళు పెరగకుండా సన్నగా ఉండాలంటే ప్రాతఃకాల భోజనానికి ముందు ఆరు మైళ్ళు నడవాలట!

బెర్నార్డుషా: భారతదేశము

ఇటీవలివరకు స్వరాజ్యము లేక అల్లాడుతూ స్వాతంత్ర్యఅరుణోదయమునకు అల్లాడిపోయే భారతీయులు ప్రపంచమునందలి మహావ్యక్తుల సానుభూతి నర్థించుట సహజం. కాని అట్టి అర్థింపులు కేవల వృథాశ్రమ అని షా అభిప్రాయము. ఆ మధ్య అతడు హిందూపత్రిక లండన్ విలేఖరితో మాట్లాడుతూ "భారతదేశపు పత్రికలు ఐరోపియను ప్రముఖుల సదభిప్రాయ పత్రికలకొరకు దేవుళ్లాటం ఎప్పుడు మానుతవి?" అని ప్రశ్నించినాడు. ఇట్లా అంటూనే షా భారతసమస్యలపై అనేకసందర్భములలో చక్కని అభిప్రాయము లిచ్చినాడు. అంతేకాదు.— భారతదేశపు నాయకులపై అనేకులచే చేయబడిన దుష్ప్రచారము ఖండించినాడు. ముఖ్యముగా సర్ ఫిరోజ్ ఖాన్‌నూను గాంధిజీ కాంగ్రెసు నాయకత్వమును నెహ్రూకు వదలి విరమించవలెనని చేసిన ప్రకటనకు షా యిచ్చిన ప్రత్యుత్తరము చాల యుక్తముగా నున్నది. రాయిటర్ ప్రత్యేకవిలేఖరి రోనాల్డు బెడ్‌ఫర్డుతో మాట్లాడుతూ (10 మే 1945 న) "గాంధి ఎక్కడనుంచి విరమించడం? ఆయన ఆక్రమించింది సహజమైన స్థానముగాని ఉద్యోగపు హోదా కాదు బదలాయించడానికి, నాయకత్వము చిలుముగొట్టములాంటిది కాదు. నేడు సిగ్గులేని పిరికిపందలచేత బందీకృతుడైనా, నెహ్రూ పరిగణింపదగ్గ నాయకుడు గాంధీవల్ల అతను తన ఔన్నత్యాన్నేమీ కోల్పోలేదు" అన్నాడు. అగ్రజాతి హిందువులకు ప్రజాస్వామ్యము సరిపడదని జిన్నా చేసిన ప్రకటనను గూడా షా ఖండించి ప్రజాస్వామ్యమునకు అగ్రజాతి ఆంగ్లేయులకన్న అగ్రజాతి హైందవులు క్రొత్తవారు కాదు" అని వాకొనినాడు. ఇటీవలి ఒక గ్రంథములో షా హైందవమతమును గూర్చి వ్రాసిన వాక్యా లుల్లేఖింపదగినవి :—

"Apparent multiplicity of God, In India is bewildering at first glances but you soon discover they are all the same God, in different aspects, functions and even in sexes. There is as, ways an uttermost God who defiel personification. This makes Hinduisum the most tolerant religion in the world because its one transcendent God includes all possible Gods. In fact, Hinduism is so elastic and so subtle that the profoundest methodist and crudest idolator are equally at home in it."

షా ఈ నెల 26 ని 93 వ జన్మదినోత్సవము జరుపుకొన్నాడు. నూటయేబది సంవత్సరాలు వస్తేగాని మానవులకు పరిపూర్ణత సిద్ధించదని అతని నమ్మకము. ఆ ప్రకారం మీతడు 150 సం॥ జీవించి ఆ పరిపూర్ణతను చేకొంటాడని ఆశిద్దాం. ప్రసిద్ధ కవియైన John Masfield, ఈ మహారచయిత 90 వ జన్మదినోత్సవ సందర్భములో వ్రాసిన వాక్యాలతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను

"Honour him, living, all Earth' brightest brains. Let Ministers of Fine Arts, centuries hence order him statues let us have more sense and call grand man GREAT while he remains."

సాహిత్య మీమాంస :

కవిత్వము - కథాసాహిత్యము

శ్రీ దోనేపూడి రాజారావు

౧

కవిత్వమునకు అనేకమంది అనేకవిధములుగ పరిభాష నిచ్చియున్నారు. ప్రాచ్యులు, పాశ్చాత్యులు కవిత్వమున కిచ్చిన పలువిధములైన పరిభాషలో ఎంతో తేడాలేదు. వీ రిద్దరిలో ప్రతిపాదన పద్ధతిలో మాత్రము కొద్ది తేడా అగుపడుతున్నది. మమ్మటాచార్యులు, విశ్వనాథుడు, జగన్నాథుడు మొదలైన సంస్కృత సాహిత్యార్చకు లిచ్చిన పరిభాష సర్వమాన్యమైనది. మమ్మటాచార్యులు "దోషరహితగుణ అలంకార యుక్త శబ్దార్థములను కవిత్వమని" కావ్యప్రకాశమందు చెప్పియున్నాడు. రసమునకు ప్రాధాన్యతనిస్తూ "వాక్యం రసాత్మకం కావ్యం" అని విశ్వనాథుడు సాహిత్యదర్పణములో అనియున్నాడు. "రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యం" అని రసగంగాధరంలో జగన్నాథుడన్నాడు. రమణీయ అర్థము నిచ్చునది అనగా మనసును రంజింపజేయు అర్థము నిచ్చు శబ్దం కావ్యం అన్నాడు.

ముగ్గురూ ప్రత్యక్షముగను పరోక్షముగను రసమునకే ప్రాధాన్యత నిచ్చియున్నారు. విశ్వనాథుడు రసమునకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చియున్నాడు. విశ్వనాథుని ఈ పరిభాష సర్వమాన్యమైనది. షేక్స్పియర్ వర్డ్సువర్తు, మిల్టన్, కౌలరిజ్, కారలాయల్, హడసన్, ఆచార్య జాన్సన్ మొదలైన ప్రముఖ ఆంగ్ల సాహిత్యార్చకులు కూడ కవిత్వమునకు చక్కని సారవంతమైన పరిభాష నిచ్చియున్నారు. షేక్సపియర్ కల్పనకు ప్రాధాన్యత నిస్తూ ఇలా అన్నాడు: "కవికల్పన అజ్ఞాతవస్తువులకు రూపము నిస్తుంది. అతనికలం వాయవీ, నగణ్య, అస్తిత్వ శూన్యపదార్థములకు మూర్తాకారము నిచ్చి వాటికి నామగ్రామమును ప్రసాదిస్తుంది." వర్డ్సువర్తు భావమునకు ప్రాధాన్యత నిస్తూ "కావ్యం శాంతిసమయంలో స్మరింపబడు తున్న ప్రబలమనోవేగముల స్వచ్ఛందప్రవాహ" మన్నాడు. మిల్టన్ "రాగాత్మకమైనది, సాదగీతో కూడినది, ప్రత్యక్షమూలకమైనది కవిత్వ" మన్నాడు.

కౌలరిజ్ అభివ్యక్తీకరణకు ప్రాధాన్యతనిస్తూ "ఉత్తమోత్తమ శబ్దముల ఉత్తమోత్తమ క్రమవిధానము కవిత్వ" మన్నాడు.

కారలైల్ కవిత్వములో సంగీతమునకు ప్రాధాన్యత నిస్తూ "కవిత్వం మనోవేగమయమై, సంగీతమయ భాషలో మానవాంతఃకరణను కళాత్మకంగా చిత్రిస్తుం"దన్నాడు. "కవిత్వం కల్పనలద్వారా, మనోవేగముతో జీవితవ్యాఖ్య చేస్తుందని" హడసన్ అన్నాడు. ఆచార్య జాన్సన్ "కవిత్వం సత్యము, ప్రసన్నత మిశ్రమకళ. ఆ కళ బుద్ధి సహాయమునకు కల్పనను ఉపయోగిస్తుం" దన్నాడు. భక్త తులసీదాస్ కవిత్వం సమదర్శినియని నిరూపిస్తూ "సురసరి సమ సబకా హితహోఈ" అన్నాడు. ఇంకా ఆచార్య రామచంద్రశుక్ల, పండిత మహావీర ప్రసాద్ ద్వివేది మొదలైన నేటి ప్రముఖ హిందీ పండితులుకూడ కవిత్వమును గూర్చి చాల వ్రాశారు. "ఆచార్య రామచంద్రశుక్ల గారి "కవితాక్యాహై" వ్యాసము, మహావీర ప్రసాద్ ద్వివేది "కావ్యఔర్ కవితా" వ్యాసము చాల ఉత్కృష్టమైనవి వీరు మిల్టన్ పరిభాషకు చాల దగ్గరగా నున్నారు.

విశ్వనాథుని "వాక్యం రసాత్మకం కావ్యం" సిద్ధాంతం కవిత్వమునకు ఆయువుపట్టుగావున్నది. రసమునకు పరిభాష అలౌకికానందం, ఆత్మానందం అన్నారు. మానవునకు మానసిక ఆనందమును కలుగజేయడమే కావ్యలక్షణంగా పరిగణించిరి. కావ్యంయొక్క మూలతత్వం భావమన్నారు భారతీయులు. పాశ్చాత్యులు ఇంకా కొన్నింటిని భావమునకు జతజేర్చిరి. భావమునకు కల్పనాతత్వం, బుద్ధితత్వం; శైలీతత్వం అత్యవసర మన్నారు. కల్పనభావముల బలవత్తరపరచి దానికి తగిన సామగ్రిని సమకూర్చి భావాభివ్యక్తీకరణకు సహాయపడుతుందని, బుద్ధిభావమునకు మంచిని, మర్యాదను కలిగించి సత్యంశివమును కూడ సంరక్షిస్తుందన్నారు. కల్పన సుందరం యొక్క శరీరమును తయారు చేస్తుందని, సుందరం యొక్క ఆత్మభావములో సజీవముగ కల్పన ద్వారా ఉండగల్గుతుందని అన్నారు. పాశ్చాత్యులబుద్ధి, కల్పన, శైలీతత్వములు కూడ సర్వసమ్మతమైనవి.

సాహిత్యమునకు కవిత్వమునకు మన లాక్షణికులు ఒకే పరిభాష నిచ్చియున్నారు కవిత్వమంతయు సాహిత్య మనుపించుకుంటుంది. కాని సాహిత్య మంతయు కవిత్వ మనుపించుకొనదు. కారణం, సాహిత్యమందు మస్తిష్కమునకు, హృదయమునకు రెంటికి సంబంధించిన విషయములు—అనగా హృదయమును, మస్తిష్కమును రెంటినీ సాహిత్యం కలిగియుంటుంది. కవిత్వం అలాకాదు. రసోత్పత్తికి కారణమైన ఒక్క హృదయమును మాత్రమే కలిగియుంటుంది. కవిత్వం హృదయంయొక్క విషయం మాత్రమే. నేటి ఈ విజ్ఞాన యుగములో సాహిత్యం యొక్క కార్యక్షేత్రం విశాలమై పోతున్నది. విజ్ఞానమునకు సాహిత్యమునకు సన్నిహిత సంబంధము ఏర్పడుచున్నది. కవిత్వంయొక్క రంగస్థలం హృదయం. విజ్ఞానం యొక్క రంగస్థలం మస్తిష్కం. ఈ రెంటిని సాహిత్యమిముడ్చుకొనియున్నది. కవిత్వం భావోపేతంగా వుంటుంది. దాని భావం గంభీరంగా వుంటుంది. దాని నడత ప్రవాహవేగంగా వుంటుంది. దానిభాష భావోపేతముగా రసయుక్తముగా సరళంగా వుంటుంది. కవిత్వం ద్వారా రెండు ముఖ్యమైన పనులు జరగుతుంటాయి. కవిత్వం యొక్క భావోత్కృష్టత-హితోపదేశము నిస్తూ హృదయమున కానందం కలుగజేస్తుంది ఒకటి, రెండవది భావోచిత సరస—సరళ-సంగీతమయ భాషవలన శ్రవణసుఖదంగా ఉంటుంది.

ఇంకా కవిత్వం మన కల్పనలను యథార్థపరచి అనుభవపూరితపరచి జీవితమునకు కల్పనలందు నమ్మకము కలిగిస్తుంది. కల్పనలుకూడ సత్యగర్భితమైన మానవుని అభిప్రాయములే.

ప్రేమకు పుట్టిల్లు హృదయం. ఈ హృదయమే కవి కార్యక్షేత్రము. కవి సృష్టికి కవిత సృష్టికి ప్రేమయే కారణము. అతని ప్రేమ విశ్వవిశాలం. అది అంతర్జాతీయత నలవర్చుకొనియుంటుంది. కవి ఎల్లప్పుడు హృదయవిహారం చేస్తుంటాడు. అతని కవిత కథావస్తువుకూడ విశ్వప్రేమయే. ప్రేమ అతని ఆరాధ్యదేవత. అతని కవిత్వం ప్రేమయొక్క మధురతర శ్వేతధార. విశ్వమానవకల్యాణమే అతని కవితాపరమచరమ లక్ష్యము. అందువలననే "విశ్వశ్రేయః కావ్యం" అన్నారు. కవిత్వం పుట్టినిల్లు హృదయంగనుక దాని వర్ధము చేసుకొనుటకుకూడ హృదయమే కావాలి. కవి సర్వభూతదయ కలిగియుంటాడు. అతని కవిత్వంకూడ సర్వభూతదయనే నేర్పుతుంది. కవికి ప్రపంచములో నిరుపయోగమైన దేదీ లేదు.

ప్రపంచములోని ప్రతి చిన్నప్రాణినీ మానవాత్మకు సమన్వయపరచి మానవునకు ఉపయోగకారిగా చిత్రించును. ప్రకృతిని సజీవముగ చిత్రించి జీవితమునకు సహచరినిగా చేయును. కవి ప్రకృతిపూజారి. ప్రకృతిపాఠశాలలో జీవితాధ్యయనము చేసి తన మనోవృత్తికి మనోభావమునకు అనుకూలముగా ప్రకృతిని వర్ణించుచుంటాడు.

కవిత్వం: దాని ఆవశ్యకత

కవిత్వం మన మానసిక ప్రవృత్తిని మేల్కొల్పి మానవుని సంకుచితస్వార్థమునుంచి తరల్చి లోకోపకారకార్యములకు ప్రోత్సహిస్తుంది. తన సత్తువను లోకసత్తువతో లీనపరుస్తుంది. లోకమునంతా తనలో నిముడ్చుకొన నుబలాటపడుతుంది. ఈ విధముగ అంతర్జాతీయత నలవర్చుకొనియున్నది. అంతర్జాతీయత నలవర్చుకొన్న కవిత్వవిషయం ఎల్లప్పుడు విశేషంగా వుంటుంది. విశేషంగా ఉత్కృష్టంగా వుండాలనికూడ ఆశించుతాము కారణం, మన దైనిక జీవితము అష్టకష్టములతో నిండి నీరసముగా వుంటున్నప్పటికి మన ఆశయములు ఆదర్శములు, సాహిత్యము నీరసముగా వుండాలని మాత్రం కోరము. మనము లేకపోయినా మన సాహిత్యం సజీవముగా వుండాలని ఉత్తమ ఆశయములతో ఉన్నత ఆదర్శములతో నింపి జీవితసత్యమును చక్కని సిద్ధాంతములతో అధిక ఆకర్షణీయంగా లోకకల్యాణ భావగర్భితముగా చిత్రించుచుంటాము. మనం కవిత్వమును ప్రస్తుతానికేకాక భవిష్యత్తుకుకూడ ఉపయోగపడునట్లు ఉత్తమ ఉద్దేశ్యములతో ఉన్నతాశయములతో చిత్రించుదుము గనుక దాని భాషకూడ వ్యావహారికభాషకంటె కొంచెం విశేషముగాను, గంభీరముగాను ఉంటుంది. కవిత్వం పద్యమయంగా, సంగీతగర్భితముగా వుంటుంది గనుక గద్యభాషకు పద్యభాషకు తేడా వుంటుంది గంభీరభావములను, ఉత్తమోత్తమ సిద్ధాంతములను పచ్చి వ్యావహారికభాషలో వ్రాయడం పూర్తిగా సాధ్యపడదు చదువరి భాషకు, అశిక్షితుని భాషకు తేడా వుంటూనే వుంటుంది. సాహిత్యంగాని, కవిత్వంగాని చదువరికి మాత్రమే సాధ్యపడుతుంది. కనుక వ్యావహారిక భాషకు చదువరి భాషకు కొద్దియో గొప్పయో తేడా వుంటూనే ఉంటుంది. నూటికి నూర్గురు విద్యావంతులైననాడు గ్రాంథికమంటూ, గ్రామ్యమంటూ వుండనే వుండదు.

ఆనాడు ఒకేవిధమైన భాష అన్నింటికీ వాడబడవచ్చును. సాహిత్యం సజీవమైన సంపదయైనప్పటికి దాని భాష విశేషంగా వుంటున్నప్పటికి లోకభాషను అది ఎన్నడూ ఉపేక్షించదు. లోకభాషాస్తిత్వముకూడ సాహిత్యభాషయందు అగుపించుచునే యుండును లోకభాష నుపేక్షించిన, సాహిత్యంచావు తథ్యమౌతుంది.

కవిత్వమంతా ఛందోబద్ధముగా ఉండవలయునా అను ప్రశ్నకూడ ఉదయిస్తున్నది. కవిత్వం ఛందోబద్ధముగా ఉండాలను నిబంధన ఎక్కడా లేదు. కళాకాంక్షకులు ఛందస్సును, అలంకారమును ఆశించుచుంటారు. ఈ రెండూ కవిత్వమున కనివార్యమైనవేమీ కావు. స్వచ్ఛంద కవిత్వం ఆదినుంచి వస్తూనే యున్నది. లయతో కూడిన పదజాలం, ధారాప్రవాహంతో నిండిన సంగీతమయగతి కవిత్వమున కవుసరము. హృదయము నాకర్షించు గుణం, ప్రభావితునిజేయు గుణం కవిత్వమున కనివార్యం.

కవిత్వము—సమాజము

కవిత్వము ప్రజల నపేక్షించి వారి లౌకికానుభూతికి దగ్గరగా వుంటుంది. సమాజమునుంచి కవిత్వమును వేరు చేయలేము. ఆదినుంచి సమాజముయొక్క లౌకికానుభూతి కవిత్వమునకు కథావస్తువుగా వుంటూవచ్చింది. సమాజములో వచ్చిన మార్పులన్నీ కవిత్వములో వచ్చింది. కవిత్వమల్లు కవికూడ సంఘజీవి యైనప్పుడు కవిత కథావస్తువుకూడ సంఘానుభూతియై యుంటుంది. ఈ విధముగా కవిత్వాన్నిగాని, సాహిత్యాన్నిగాని సమాజమునుంచి వేరుచేయలేము. ఆదినుంచి కవిత్వం "విశ్వశ్రేయః కావ్యం" లక్ష్యంతో సామాజికజీవనంతోపాటు మార్పు చెందుతూ సామాజిక భాషాగౌరవాశ్రయముతో వివిధభాషాశరీరధారిణియై నిత్యం నూతనంగా వుంటూవచ్చింది. సమాజములో ధర్మమునకు ప్రాధాన్యత ఉన్నప్పుడు కవిత్వంకూడ ధార్మిక, దార్శనిక సిద్ధాంతములతో నిండి వున్నది. సమాజము నీతికి ప్రాధాన్యత నిచ్చినప్పుడు కవిత్వంకూడ నైతికంగా నడచింది. నేటి రాజకీయయుగంలో కవిత్వంకూడ రాజకీయ ప్రాధాన్యత నలవర్చుకొనియున్నది.

౨

ఆత్మాభివ్యక్తీకరణమే మానవుని గొప్పతనమునకు కారణమైయున్నది. ఈ కారణముచేతనే మానవునకు పశువునకు గల భేదము కానవచ్చుచున్నది. మానవుడు ఎల్లప్పుడు తాను కంటున్నది, వింటున్నది. అనుభవించుచున్నది వ్యక్తపరచ నుబలాటపడుచుండును. తన కష్ట-సుఖములను ఇతరులకు తెలియజేయుటయు ఇతరుల కష్టసుఖములను తెలుసుకొనుటయు మానవుని స్వాభావికమైయున్నది. తన, ఇతరుల అనుభవవ్యక్తీకరణమునకు అనేక సాధనములను, పద్ధతులను అవలంబించుచున్నాడు. అందులోని ఒక పద్ధతి కథ.

మానవుడు జన్మించినది మొదలుకొని మరణించువరకు గల కాలము జీవితమనబడినది. మానవుడు ఆదినించి అంతమువరకు తన జీవితములో అనేక విధములైన అనుభవములను కలిగియుంటున్నాడు అతని అనుభవములోని సారవంతమైన అనుభవము సాహిత్య మనబడినది. చైతన్య మానవుడు తన అనుభవ పరిచయమును, ఇతరుల ప్రవృత్తుల, మనోభావముల పరిచయమును లోకమునకు ఇవ్వడమునకు కథా సహాయమును అపేక్షించియున్నాడు. మానవుడు ఒంటరిగా నుండజాలడు. పదిమందితో కలసి మెలసి యుండ నభిలషించును. మానవుని ఈ ప్రేమ పూర్వకమైన పరాపేక్షిత ప్రవృత్తులు తమలో తాము ఏకాంతముగ నుండజాలక, తమ విస్తార, వ్యాపకములో యావత్తు ప్రపంచమును ఇముడ్చుకొనగల నంతటి శక్తిని కలిగి యుంటవి. ప్రపంచమునంతను తనలో నిముడ్చుకొనవలయునను మానవుని వ్యాకులతయే కథాసృష్టికి కారణమైయున్నది. ఆదినుండి మానవుని సభ్యతా సంస్కృతులు దేశకాల పరిస్థితుల పరిణామ ఫలితముగ వికసించినకొలది, మార్పు చెందిన కొలది కథావిషయంకూడ ఎప్పటికప్పుడు మారుతూ వచ్చినది. ఈ కథావిష్కరణ ఎక్కడ, ఎప్పుడు ఏవిధముగ జరిగినది చెప్పజాలము. మానవోత్పత్తి ప్రదేశమందు, మానవునితోపాటు కథాసృష్టి జరిగినట్లు ఊహించవలసియున్నది ప్రతిదేశమందువను అన్ని సాహిత్యాంగములకంటె కథావిష్కరణ ముందు జరిగినట్లు చరిత్ర తెలియజేయుచున్నది. ఈ కథాసాహిత్యము భారతదేశమునకు ఋగ్వేదకాలమునుండి యున్నట్లు తెలియుచున్నది. ఋగ్వేదములోని కథలన్నియు లోకకల్యాణ భావగర్భితమై కథాభివృద్ధికి తోడ్పడినవి. జాతక కథలతోను, పంచతంత్రములతోను భారతీయ కథాసాహిత్యము ఆరంభమైనది. ఇంకా సంస్కృతమందలి హితోపదేశకథలు, బృహత్కథా మంజరి మొదలైనవి భారతీయ కథాసాహిత్యమునకు తోడ్పడినవి ఇదే సమయములో భారతీయ ఉత్కృష్టకథలు అరబీ, ఫారసీ గ్రీస్ మొదలైన భాషలలోనికి అనువదించబడినవి.

ఆధునిక కథయొక్క నూతన 'ప్లాట్' పాశ్చాత్యుల నూతనావిష్కరణతో నిండియున్నది. ఈ నూతన కథావిష్కరణ జరిగి ఒక శతాబ్దమన్నను కాలేదు. దీని వ్యాపక-విస్తీర్ణము - దీని ప్రభావము, నేటి దీని ఆవశ్యకత, నవలకంటె నాటకము కంటె మితిమీరిపోయినది. దాని సాహిత్యం దినదినాభివృద్ధిగాంచుచున్నది. సాహిత్యములో ఇది ప్రత్యేకస్థానము నలంకరించినది. ఆధునిక ఆవశ్యకతలకనుసారముగ, పాఠక ప్రజలకు కథ సువిధాజనకముగనున్నది. దీని ప్రాబల్యము ఇంతింత యని చెప్పడమునకు అంతు లేదు త్రై, ద్వై, మాసపత్రిక నుండి పక్ష, వార, దినపత్రికలుకూడ కథావశ్యకతను కలిగియున్నవి కథను ప్రకటించని పత్రికయంటూ లేనే లేదు ప్రతిపత్రికాధిపతికథాకమలములతో తన పత్రికాపుత్రికను అలంకరించుచున్నాడు. ప్రజలలోని కథాకోర్కయే దీని కంతకు కారణమైయున్నది. ఈ నూతన కథా సాహిత్యము అల్పకాలంలో అమితాభివృద్ధి చెందిన దనడములో ఆనందము కలుగుచున్నది సమాజములో కథకునకు సమున్నతస్థాన మున్నదని సంతోషించాలి.

కథ - నవల

మొదట కథానిక చిన్న నవలగా వుండెడిది. నవలకు కథానికకు ఎంతో తేడావుండేది కాదు.

(22 వ పేజి చూడుడు)

సినిమా పుట :

సినిమా రచయితల సాధకబాధకాలు

"సినిమా మానిసి"



"ఊంఛ్—నీచ్" చిత్రంలో కుమారి భారతీ, సుమిత్రాదేవులు.

ఫిల్ము విమర్శకులు తమ విమర్శలలో అయా ఫిల్ములకు సాహిత్యం సమకూర్చిన రచయితలనుగురించి ఏమీ వ్రాయకపోవడము, (ఆవిధంగా రచయితకు ఖ్యాతి రాకపోవడము);

ఒకే ఫిలిం తాలూకు స్క్రిప్టురచనకు పలువురు రచయితలను నియమించడము;

స్క్రిప్టు రచనలో నిర్మాత, దర్శకుడు మొదలైనవారి అంతు లేని 'డిక్టేషన్', ఆ తర్వాత రచయితకు తెలుపకుండా, అతని ఆమోదము పొందకుండానే స్క్రిప్టులో మార్పులు చేయడము;

స్వతహాగా సినిమాకోసం వ్రాసిన కథలకు ప్రోత్సాహం లేకపోవడము, ఇతర రకాలలో (నాటకాలు, నవలలు మొదలైనవి) ఖ్యాతి పొందిన కథాంశాలను సినిమాకు అనుగుణంగా మార్చుకోవడానికే ఎక్కువ ఉత్సాహం చూపడము;

నిర్మాణం ఏకధాటీగా సాగకపోవడము, షూటింగు జరిగే సమయంలో రచయిత అక్కడ ఉండకపోవడము;

రచయితకు దర్శకునికి వలసినంత సన్నిహిత సంబంధం లేకపోవడము;

ఇతర మార్గాలలో (నాటకాలు, నవలలు మొదలైనవి వ్రాయడంలో) ప్రసిద్ధులైన రచయితలను, వారికి ఫిలిం టెక్నిక్ అనుభవం ఉన్నా లేకపోయినా ఈ పనిలో నియోగించడము;

సినిమా రచయితలకు మంచి శిక్షణ (తర్ఫీదు) ఇచ్చే అవకాశాలు లేకపోవడము :

—ఈ కారణాలవలన సినిమా రచన ఉత్కృష్టముగా ఉండడానికీ, సినిమా రచయితలు పేరు ప్రఖ్యాతులు పొందుతూ, గౌరవంగా ఉండడానికీ వీలులేకుండా ఉన్నదని బ్రిటిష్ సినిమా రచయితలు అభిప్రాయపడుతున్నారు.


బ్రిటిష్ సినిమా రచయితల సంఘం కార్యదర్శి గై మోర్గన్ 'సినిమా రచయితల సాధక బాధకాలు తెలుసుకోవాలనేడి ఉద్దేశంతో ఇటీవ ఒక ప్రశ్నావళి తయారుచేసి, ఆ సంఘసభ్యులు 160 మందికీ పంపించాడు. దానికి సమాధానముగా 50 మంది పంపిన వివరాలను క్రోడీకరిస్తే వారి సాధక బాధకాలు పైన చెప్పిన అంశాలుగా తేలినట్లు మోర్గన్ 'పెంగ్విన్ ఫిలిం రివ్యూ' 6-వ సంపుటంలో ప్రచురించాడు.

ఇక్కడ మనదేశంలో మన తెలుగు ఫిల్ములకు రచనలు చేసేవారు అప్పుడప్పుడు వెలిబుచ్చే సాధక బాధకాలు దృష్టిలో ఉంచుకొని చూస్తే ప్రపంచంలో ప్రతిచోటా సినిమా రచయితల స్థితిగతులు ఇట్లాగే ఉన్నాయేమో ననిపిస్తుంది.

ఐతే, 'విమర్శకులు సినిమా రచయితలను గురించి ఏమీ వ్రాయడం లేదన్న బాధ మాత్రం మన వాళ్ళకు లే దనవచ్చు. ఆవిధంగా మన సినిమా రచయితల స్థితే కొంత మెరుగుగా ఉన్నట్లు ఎంచవచ్చు.

ఇది ఇట్లావుంచి, అసలు సినిమా రచయితల స్థితిగతులు ఇట్లా ఉండడానికి కారణ మేమిటో ఆలోచించడం అవుసరం. పైన చెప్పిన 8 అంశాలనుబట్టి నిర్మాతలూ, దర్శకులూ రచయితలను చులకనగా చూస్తారని వ్యక్తమవుతుంది. వారట్లా చూడడానికి, అవకాశం ఎట్లా ఏర్పడింది? మన దేశంలో స్థితిగతులనుబట్టి చూస్తే రచయితల 'మెతక' తనంవల్లనే నని అనవలసివస్తుంది. 'సరస్వతి' కీ 'శ్రీ మహాలక్ష్మి' కీ ఎప్పుడూ 'ఎడముఖం పెడముఖ'మే కనుకనూ, నిత్యజీవనం సాగడవడానికి 'లక్ష్మీకటాక్షం' అగత్యం కనుకనూ, రచయితలు 'మెతకతనం' చూపక తప్పదనిపిస్తుంది. అందువల్లనే వారు, తమకు ఏవిధంగానూ దీటుకానివారు కూడా తమను చులకనగా చూస్తూ, ఎన్నో 'అవమానాలు' చేస్తున్నప్పటికీ కూడా, సరస్వతీ ప్రసన్నం ఉండీ, 'నోరూవాయీ' లేనివారల్లే పడిఉంటున్నారు— అనక తప్పదు.

ఐతే, ఈ స్థితిగతులు తొలగి, రచయితలు స్వశక్తి స్వయం కృషులతో సినిమారచనను అభివృద్ధిచేయడానికీ, పేరుప్రఖ్యాతులు పొందుతూ గౌరవంగా గడపడానికీ మార్గమేమిటి? రచయితలు 'కష్టీఫలీ' అనే ఆర్యోక్తి ననుసరించి, సాహసంతో, సహనంతో కొంత త్యాగానికి సిద్ధపడడము, తమ శక్తిసామర్థ్యాలలో విశ్వాసం, ఆత్మగౌరవం కలిగి, 'మెతక' తనం విడనాడడము, తమతో పని కావలసినవారు తమ మాట వినక తప్పని సరి అయే స్థితి కలుగ చేసుకోవడము;—ఇదే అందుకు మార్గ మనవచ్చు.



"ఊంఛ్—నీచ్" చిత్రంలో, సుమిత్రాదేవి, చంద్రావతి, పూర్ణేంద్రులు నటిస్తున్న ఒక దృశ్యము.

కొత్త పాతలు

"కోణార్క"లో మాత్రమే సూర్యుని గుడి ఉంది దానికి ప్రతిష్ఠ జరగలేదు!

* * *

త్రివేణీ సంగమములో రెండు వేణులే కలియుచున్నవి!

* * *

భిల్సాలో సాంచీస్తూపము హిందూదేశములో అందమైన స్తూపాలలో మొదటిది. ఆ స్తూపము చుట్టూ ఉన్న మహాద్వారములందున్న శిల్పచమత్కృతి ఇంకోచోట లేదు. ఆ మహాద్వారాల్లో ఒకటి ఆంధ్రచక్రవర్తి ఆస్థాన శిల్పి ధాన్యకటకమునుండి వెళ్ళి నిర్మించినదన్న.

కొరిశల్లివాడ పల్లిబాబు

కమ్యూనిస్టుపార్టీ విరుద్ధ విధానాలు

(10 వ పేజీ తరువాయి)

పట్నాల్లో కాంగ్రెసు, సోషలిస్టు, ఇతర పార్టీల వారి అందరికంటె నెహ్రూపైద అభిమానం హెచ్చుగా ప్రదర్శించారు.

అదంతా శుద్ధసంస్కారవాదం. విప్లవవాదం ఇది అని రణదే విలా చెప్పాడు:

"......శ్రమజీవులయొక్క, వారి పార్టీయొక్క మూలవిధానం, ఈ ప్రభుత్వాన్ని ప్రతిఘటించటమే."

ఇదివరకు పార్టీ విధానాని కిప్పుడు పూర్తి విరుద్ధం. ఈ ప్రభుత్వపతనమే ఇప్పటి లక్ష్యం.

ఇట్టి విరుద్ధవిధానాలను సిర్వచిస్తున్న పార్టీ నాయకులకు ఆలోచనాశక్తి తగినంతగా లే దని రుజువవుతోంది. నిన్న ప్రభుత్వాన్ని బలపరచమంటే పార్టీ సభ్యులు నెహ్రూకి జై అని అన్నారు. ప్రభుత్వాన్ని ప్రతిఘటించమని ఇవ్వాళ అంటే, వాళ్ళు నెహ్రూని శపిస్తున్నారు. ఇట్టి ఆలోచనే అనవసర, అకాల సంఘర్షణకు దారితీస్తుంది; తీస్తోంది.

హైదరాబాదు విషయంలో మటుకు ఆయుధాలను చేబట్టమన్నాం. అంతే. ఇండియాలో ఆ విధానాన్ని మేం సూచించలేదు అని పార్టీ నాయకుల వాదన.

కాని మలబారులో కమ్యూనిస్టులు ఆయుధాలను ఉపయోగించారు. తుపాకులతో పోలీసుల నెదుర్కొన్నారు. మరి దీనికి వీరి సమాధానం ఏమిటి?

రష్యాలో జారు ప్రభుత్వాన్ని నిర్మూలించటానికి అవలంబించిన విధానాన్ని ఈ యుగంలో ప్రజాస్వామిక ప్రభుత్వ విషయంలో ఉపయోగించటం విప్లవతత్వం కాదు. చాందసం. జారుతో మంత్రివర్గాలను పోల్చటం అతిశయోక్తే కాక, అశాస్త్రీయం.

"కమ్యూనిస్టులు గల్లంతు చేస్తున్నారని కొంతమంది అంటున్నారు. అలా అంటూనే రష్యా చక్రవర్తి జారు ప్రాణం పోగొట్టుకున్నాడు" అని కామ్రేడ్ భవానీసేన్ ఉల్లాసంతో చెప్పాడు. విమర్శకులు జారులు (రష్యన్) అయినా కాకపోయినా, భవానీసేన్ అతని సహచరులు మటుకు తామంతా లెనిన్లలా ప్రవర్తించటం హాస్యాస్పదం.

యుద్ధకాలంలో కమ్యూనిస్టు దేశంలో తమ సిద్ధాంతాలను సిద్ధింపచేసుకోటానికి మంచి అవకాశం వచ్చింది. జన్మలో అలాంటిది మళ్ళీ రాదు. కాని మన కమ్యూనిస్టుపార్టీవారు ఆ అవకాశాన్ని పోగొట్టుకున్నారని ఒకప్పుడు నెహ్రూ విమర్శించాడు. ఆ విమర్శే ఈనాటి కమ్యూనిస్టు వ్యవహారాలపట్లకూడా సరిపోతుంది.

ఆర్థిక పారిశ్రామిక వ్యాపార విషయాలు



రాష్ట్ర ఆహారపరిస్థితి

మద్రాసు రాష్ట్ర శాసనసభలో రాష్ట్ర ఆహార పరిస్థితిని గూర్చి ఆహారశాఖ మంత్రి డా. రాజన్ గారొక సమగ్రమగు ప్రకటన చేశారు. రాష్ట్ర ఆహారపరిస్థితిని శాసనసభ్యులు రెండురోజులు చర్చించి, ప్రభుత్వ విధానమును ఆమోదించిరి. ప్రభుత్వ కంట్రోల్ రద్దువిధానం వలన ధరలు పెరిగిపోయి ప్రజలు చాల ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి కంట్రోలు, రేషనింగ్ తిరిగి విధించాలని సూచిస్తూ ప్రతిపక్షము ప్రవేశ పెట్టిన సవరణ వీగిపోయినది.

మన రాష్ట్రంలో మామూలుగా 49 లక్షల టన్నుల బియ్యము సరిపోవు(రద్దు), 27 లక్షల టన్నుల ఇతర ఆహారధాన్యములు ఉత్పత్తిఅగును. 1946-47 వ సం. ఉత్పత్తి అయిన నికరం మొత్తం 49 లక్షల టన్నుల బియ్యము, 21 లక్షల టన్నుల ఇతర ధాన్యములు. ఈ సంవత్సరం వర్షాలు సకాలంలో కురవక పోవటంవలన దక్షిణాదిన పంటలు బాగా దెబ్బతిన్నవి. అందువలన ఈ సంవత్సరం మొత్తం 40 లక్షల 6 వేల టన్నుల బియ్యము, 19 లక్షల 29 వేల టన్నుల ఇతర ధాన్యము ఉత్పత్తి అయిన దని అంచనా వేశారు. ఈసంవత్సరం మామూలు కన్న 9 లక్షల టన్నులు బియ్యము, 8 లక్షల టన్నుల ఇతర ఆహార ధాన్యాలు తక్కువ ఉత్పత్తి అయినవని ఈ లెక్కలవలన తేలుచున్నది.

భారతప్రభుత్వ కంట్రోల్ రద్దు విధానము, ఆహారవిధానము నిర్ణయింపబడినప్పుడు, మన రాష్ట్రమును కొరత రాష్ట్రములలో చేర్చి, ఈసంవత్సరమునకు మొత్తం ఒకటిన్నర లక్షల టన్నుల ఆహారధాన్యము మనకు సరఫరాచేయుటకు నిర్ణయించినారు. ఈ మొత్తము చాల తక్కువని రాష్ట్రప్రభుత్వము వాదించుటచే, దానిని రెండులక్షల టన్నులవరకు పెంచారు. దక్షిణాదిన పంట బాగా చెడిపోయినదనీ, ఈ మొత్తం చాలనే చాలదనీ మళ్ళీ చెప్పుకోగా 5 లక్షల టన్నుల ధాన్యం సరఫరాచేయుటానికి కేంద్రప్రభుత్వం అంగీకరించినది. కేంద్రప్రభుత్వ ఆహారశాఖమంత్రి జైరాందాస్ దౌలత్‌రాం గారు ఈమధ్య మన రాష్ట్రములలో కొరత జిల్లాలలో పర్యటించి, పరిస్థితులను స్వయముగా పరిశీలించి, మరొక లక్షటన్నుల ఆహారధాన్యమును సరఫరాచేయుటకు అంగీకరించినారు.

ఈ 5 లక్షల టన్నుల మొత్తములో ఇంకొక 1,28,705 టన్నుల ధాన్యంతప్ప తక్కినదంతా ఇప్పటికే మనకు వచ్చిచేరింది. మన రాష్ట్రంలో ఈ ఏడు 18 లక్షలు టన్నులు ధాన్యం ఉత్పత్తి తగ్గిపోయినది కాబట్టి ఈ 5 లక్షల టన్నులతో మనం సరిపెట్టుకోలేము. కేంద్రప్రభుత్వం ఇంకా కొన్ని లక్షల టన్నుల ధాన్యం సరఫరాచేసి, మళ్ళీ పంటలు వచ్చేదాకా మన రాష్ట్రాన్ని పోషించవలసివున్నది.

జూలై 3 వతేదీ నాటికి మన రాష్ట్రంలో ఆహార ధాన్యాల నిలువ మొత్తం 4,63,641 టన్నులు. ఇందులో 3,84,635 టన్నులు బియ్యము, 17,503 టన్నులు గోధుమలు, 47,770 టన్నులు మొక్కజొన్న వగైరా లున్నవి. భారతప్రభుత్వం వద్దనుండి 1,28,705 టన్నులు ఇంకనూ సరఫరా కావలసియున్నది.

మన రాష్ట్రములో నీ మిగులు జిల్లాలనుండి ఈ సంవత్సరాంతంలోగా మరొక 60 వేల టన్నులు ధాన్యం సేకరింపబడునని అంచనా వేయుచున్నారు. మనరాష్ట్రములో ఈ సంవత్సరం మొత్తము 17 లక్షల 86 వేల టన్నులు బియ్యము 1 లక్ష 76 వేల టన్నులు ఇతర ధాన్యములు సేకరింపవలెనని మొదట్లో, కంట్రోల్, రేషనింగ్ వుండగా నిర్ణయమయ్యాను. కాని తరువాత కంట్రోల్ తొలగించుటవలన ఈ సేకరణ మొత్తము అనిశ్చితముగా వదలివేసిరి. ఈ సంవత్సరం ఇంతవరకు 7 లక్షల 57 వేల టన్నుల బియ్యంమాత్రమే సేకరింపబడినది. కాబట్టి ఈసంవత్సరాంతంవరకు మనకు ఇప్పటి లెక్కలప్రకారం లభించగల ధాన్యం మొత్తం 6,51,346 టన్నులని తేలుచున్నది.

ప్రస్తుతము వారమునకు 36 వేల టన్నుల చొప్పున రాష్ట్రప్రభుత్వము తన నిలువలనుండి ధాన్యము విడుదలచేయించుచున్నది. రేషనింగ్ ఇంకా అమలులోనున్న 17 పట్టణములకు, రిలీఫ్ దుకాణములను. మలబార్, నీలగిరి జిల్లాలకు సరఫరా చేయుటకు ఈ మొత్తము వినియోగిస్తున్నారు. రిలీఫ్‌దుకాణములసంఖ్య జూలై 3 వ తేదీన 8500. ఇప్పటికా సంఖ్య 9200 కు పెరిగినది; ఇంకా పెరుగు సూచన లున్నవి. పైగా రేషనింగ్ వున్న మలబార్, నీలగిరి జిల్లాలలో బియ్యం రేషన్ 6 ఔన్సుల నుండి 8 ఔన్సుల వరకు, రిలీఫ్ దుకాణములు ఇచ్చే రేషన్ బియ్యం 5 ఔన్సులనుండి 6 ఔన్సులకు పెంచవలెనని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందువలన ఇకముందు ప్రతివారము ఇప్పటివలె 36 వేల టన్నుల ధాన్యంకాక 40, 42 వేల టన్నుల ధాన్యం విడుదలచేయవలసి రావచ్చును. ఇప్పుడున్న ధాన్యం నిలువలు త్వరగా ఖర్చయిపోవును. కాబట్టి ఇప్పుడున్న నిలువలు కేంద్ర ప్రభుత్వం సరఫరా చేయు మొత్తము, రాష్ట్రములో సేకరింపబడు మొత్తము అన్నీ కలసి దాదాపు ఇంకొక 15, 16 వారములకు మాత్రమే సరిపోవును. క్రొత్త పంట అక్కడక్కడా ఈ సంవత్సరాంతములోగానే కోతకు వచ్చినా, ఇప్పటినుండి సంవత్సరాంతివరకు గల 22 వారాలు గడుపుట చాల కష్టమగును. పైగా అత్యవసర (ఎమర్జెన్సీ) పరిస్థితుల నెదుర్కొనుటకు కొంత నిలువ వుండి తీరవలెను. కాబట్టి మరల క్రొత్త పంట వచ్చే వరకు 2 లక్షల టన్నులైనా భారతప్రభుత్వము సరఫరా చేస్తే, తక్కిన మొత్తము ముందుగా పంటకు వచ్చిన క్రొత్తధాన్యం నుండి భర్తీ చేసుకొన వచ్చును. ఇప్పుడున్న ధాన్యం నిలువలు చాలవనీ, ఇంకా ఎక్కువ మొత్తం సరఫరా చేయవలసిందనీ రాష్ట్రప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని అర్థించింది. కేంద్రప్రభుత్వం మనం కోరినంత ధాన్యము సరఫరాచేస్తుంటే, రాష్ట్ర ఆహారపరిస్థితిని గురించి మనం ఏమీ ఆందోళన పడనక్కరలేదు.

కంట్రోల్ తొలగించినతర్వాత సర్వత్రా కనిపిస్తున్నది ధరలు పెరిగిపోవటమే. ధరలు కొంచెం పెరిగినా, రెట్టికి రెట్టింపై పోవునని కంట్రోల్ తొలగించేటప్పుడు ఎవ్వరూ భావించలేదు. పైగా, ధరలు విపరీతంగా పెరిగిపోకుండా కాపాడగలమని వర్తకులసంఘాలు ప్రభుత్వానికి హామీకూడా ఇచ్చాయి. అయినా ప్రతిచోటా ధరలుపెరిగిపోయిన వనే ఫిర్యాదు వినవస్తున్నది. మన ఒక్కరాష్ట్రంలోనే గాక ధరలు ఇతర అన్నిరాష్ట్రాలలోను పెరిగిపోయాయనిగాని, ఇతరరాష్ట్రాలలో కన్న మన రాష్ట్రంలోనే తక్కువ పెరిగాయని గాని మనం ఓదార్చుకుని ఏమీ లాభం లేదు. ధరల పెరుగుదలను అరికట్టడానికి ప్రభుత్వం ఏమీ చెయ్యలేకపోతున్నదని మంత్రిగారే అంగీకరిస్తున్నారు. ఎక్కువ ధరలకు అమ్ముతున్న వర్తకులందరిపైనా కేసులు పెడితే, అనవసరపు గందరగోళం ప్రారంభమౌతుంది కాబట్టి, మరీ విపరీతధరలకు అమ్ముతున్న వారిపైననే కేసులు పెట్టవలసిందని కలెక్టర్లకు ఉత్తరవులు జారీ చేశారు. బ్లాక్‌మార్కెట్ దారులను శిక్షించటానికి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రం చేసిన చట్టంవంటి చట్టం ఒకటి చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నదని మంత్రిగారు తెలియచేశారు.

ఒక జిల్లానుండి వేరొక జిల్లాకు ధాన్యం తీసుకుపోరాదను ఉత్తరువులు ఉల్లంఘించి, చాటుగా రవాణా విరివిగా చేస్తున్నారని చాల మంది సభ్యులు సోదాహరణంగా వివరించారు. ఇట్లు దొంగరవాణా జరుగుచున్నట్లు తమకూ తెలుసుననీ, అయినా దానిని పూర్తిగా నిర్మూలించటానికి తగినంత పోలీసు సిబ్బంది లేకపోవటం వలన దీనిని అరికట్టడం సాధ్యం కాకుండా ఉన్నదని మంత్రిగారన్నారు. జిల్లాలమధ్య రవాణా నిషేధాలను ఇప్పుడిప్పుడే తొలగించివచో, అసలు సేకరణే జరుగదు కాబట్టి, జరుగవలసినంత సేకరణ జరిగిన తర్వాత, ఈ నిషేధాలను తొలగిస్తామని మంత్రిగారన్నారు. వాస్తవానికి, రవాణా నిషేధాలు పూర్తిగా తొలగించిన తర్వాత ఇంక సేకరణ జరుపబూనటం అనవసరం. వెంటనే ధరలు తగ్గించేటందుకు చర్యలు తీసుకోవలసిందని సభ్యులు కోరారుగాని అది తేలికగా సాధ్యపడే విషయంకాదు. ధాన్యంపంపకం ప్రైవేటు వ్యాపారస్థులకు అప్పజెప్పినప్పుడే, ధరలు పెరగటానికి అంగీకరించామన్నమాట. దీనినిగురించి ఇప్పుడు విచారించి లాభం లేదు. సహకార సంస్థలు మొదలగు పబ్లిక్ సంస్థలద్వారా పంపకం జరిగితేనే సరియైన ధరలకు అమ్మించటానికి వీలు పడుతుంది.

రాష్ట్రంలో ఇప్పుడు 9200 రిలీఫ్ దుకాణాలున్నవి. ఇదివరకు ఈ ప్రాంతంలోవున్న రేషన్ షాపులు మొత్తం 12 వేలు. ఇప్పుడు ఈ రిలీఫ్ షాపులుగాక ఒక వెయ్యి రేషన్‌షాపులుకూడా వున్నాయి. కాబట్టి ఇప్పుడుకూడా ఇదివరకటన్ని కంట్రోల్‌ధరల కమ్మే దుకాణాలున్నవి. కాబట్టి ప్రజలు నష్టపడుతున్నారని భావించనవసరంలేదని మంత్రిగారు వాదించారు. కాని రిలీఫ్ దుకాణాలు రేషన్ దుకాణాలవంటివి గాక ఎక్కువ అవినీతికి అస్కారమిస్తవి. బీదవారికి ధాన్యం ఈ దుకాణదారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి దొరుకుతుంటవి ఇప్పుడు రిలీఫ్ దుకాణాలూ, ఇదివరకు రేషన్‌షాపులూ సంఖ్య ఒకటే అయినట్లయితే రేషన్ పద్ధతి అమలుజరిపితేనే ప్రజలకు ఎక్కువ సౌకర్యం. భారతప్రభుత్వం కంట్రోల్ తొలగింపు విధానాన్ననుసరిస్తున్నది కాబట్టి తిరిగి ఇప్పుడు కంట్రోల్‌మాట తలపెట్టటానికి మన ప్రభుత్వం ఇష్టపడటంలేదు. యు. పి. రాష్ట్రంలో ఇప్పుడు కంట్రోల్ తిరిగి విధిస్తున్నారు. మన రాష్ట్రంలో ఇట్టి అవసరము ఇప్పుడే ఏర్పడకపోయినా, ధరలను, దొంగ నిలువలను అరికట్టటానికి ప్రభుత్వం వెంటనే చర్యతీసుకోకపోతే, ఇట్టి పరిస్థితి త్వరలోనే ఏర్పడకపోదు. రిలీఫ్ దుకాణాల నిర్వహణను గూర్చి, వానిలో సరుకు నిలువ వుండకపోవటాన్ని గూర్చి అనేకులు ఫిర్యాదు చేశారు. ఇవి రేషన్ దుకాణములంత క్రమబద్ధంగా నడువవు. ఈ లోపాలు ఎట్లాగూ వుండేవేలే అని అశ్రద్ధ వహించకుండా, లోటుపాట్లు సరిదిద్దటానికి వెంటనే పూనుకోవటం మంచిది.

ఈ సంవత్సరం ఎట్లానూ గడిచిపోయింది. కేంద్రప్రభుత్వం అదనపు సరఫరాలు పంపించి అయినా రాష్ట్రాన్ని ఆహారకొరతనుండి తప్పించకపోదు. ముందు సంవత్సరం కూడా ఇట్టి పరిస్థితే ఏర్పడకుండా వుండాలంటే అధికాహారోత్పత్తి ఉద్యమం తీవ్రంగా సాగించాలి. మన రాష్ట్రంలో ఈ ఆహారకొరత గత మూడు సంవత్సరాలనుండి వున్నది. అయినా అధికాహారోత్పత్తికి మన రాష్ట్రప్రభుత్వం ఏమీ క్రమబద్ధంగా, తీవ్రంగా కృషి చేయటం లేనే లేదు. కేంద్రప్రభుత్వం మనం కోరినంతా పంపుతుంటే ఆహారపరిస్థితినిగురించి ఆందోళనపడనక్కరలేదని ఒకరు చెప్పనక్కరలేదు. కేంద్రప్రభుత్వమునుండి వీలైనంత తక్కువ, గతసంవత్సరంకన్న తక్కువ సరఫరాలు పొంది, మనకృషివలన ఇంత ఎక్కువ ధాన్యం పండించి, ఆహార పరిస్థితిని చక్కబరుస్తున్నామని ఆహారమంత్రి చెప్పగల్గిననాడు ఆయన రాష్ట్రానికి నిజమైన సేవ చేసినవాడౌతాడు. మొన్న మంత్రిగారు చేసిన సుదీర్ఘమైన ప్రకటనలో అధికాహారోత్పత్తి ఎంత బాగా జరిగినదీ, ఇకముందు ఎట్లా జరుగనున్నదీ ఏమీ చెప్పబడనేలేదు. ఇది చాల అసంతృప్తికరమైన విషయం. ఈసంవత్సరం దక్షిణాదిన పంటలు బాగా చెడిపోయినా, మనం కరువు నెదుర్కొనక్కరలేకుండా బయటపడగలుగుతున్నామనేది ఒక్కటే ఈప్రకటనలో ఉత్సాహాన్ని కలిగిస్తున్న విషయం.



బ్రిటనులో విరివిగా తయారుచేయనున్న క్రొత్తరకం మోటారుకారు మోడలు. బ్రిటిష్ పారిశ్రామిక ప్రదర్శనంలో దీనిని ప్రదర్శించారు.

యుగసంధి

(6-వ పేజీ తరువాయి)

అతని కాళ్లు పట్లు తప్పుతున్నాయి. ఊరికే, "కాట్యా, కాట్యా......" అని అనగలుగుతున్నాడు. ఆమె అమాయకంగా కన్నీరు కార్చుతోంది. ఆ కన్నీటిని చూసి, తనే చిరునవ్వు నవ్వుకుంటోంది. ప్రియురాలి కళ్లల్లో ఆ కన్నీరు చూడని ఏ వ్యక్తికీ, ఈ లోకంలో సుఖం, ఆనందం అనేవాటికిహద్దులు ఎక్కడఉన్నాయో తెలుసుకోడం అసంభవం.

మరునాడు ఉదయాన్నే ఆనాసర్గీవ్నా, తన గదిలోకి రమ్మని బజరోవ్‌కి కబురు పంపింది. అతను రాగానే మడచిఉన్న ఒక ఉత్తరాన్ని చేతికిచ్చింది. ఆర్కాడీ వ్రాసిన ఉత్తరం అది. కాట్యాని తన కిచ్చి పాణిగ్రహణం చెయ్యమని కోరుతూ వ్రాసినది.

బజరోవ్ తొందరగా అది చదివాడు. తన ఉద్వేగాన్ని అతి ప్రయత్నంతో అడచుకున్నాడు. తన గుండెల్లో మెదిలిన విద్వేషాగ్ని పైకి పొడుచుకురాకుండా ఆపుకున్నాడు.

"అదన్నమాట, సంగతి," అన్నాడు, "నిన్న కూడా మీరు కాటెరీనా సర్గీవ్నాను అకడు చెల్లెలిలాగ చూస్తున్నాడని అనుకున్నారు. ఇప్పుడు ఏం చేద్దామని మీ అభిప్రాయం?"

"మీ సలహా ఏమిటి?" ఇంకా నవ్వుతూనే అడిగింది ఆనా సర్గీవ్నా.

"సరే, నా అభిప్రాయం," బజరోవ్ కూడా నవ్వుతూనే సమాధానం చెప్పాడు; కాని అతనికి ఏమీ కులాసాగా లేదు. ఆమె కూడా అల్లాగే ఉంది, "ఇంక ఆ చిన్నవాళ్లు ఇద్దరినీ ఆశీర్వదించడం తప్ప చేసేది ఏదీ లేదనుకుంటాను. అన్ని విధాలా తగిన సంబంధమే. కిర్సనోవ్‌లకు తగుమాత్రం సంపద ఉంది. ఒక్కడే కొడుకు. తండ్రి చాలా మంచివాడు. కొడుకుసుఖానికి ఎన్నడూ అడ్డు రాడు."

ఓడిఙ్‌స్టోవ్ సతి గదిలో ఇటూ అటూ పచారుచేసింది. అప్పుడప్పుడు ఆమెముఖం ఎర్రబడుతోంది, అప్పుడప్పుడు వాడిపోతోంది. "అదా మీ అభిప్రాయం," అంది ఆమె.

"నాకూ అడ్డంకు లేవీ కనపడడం లేదు... కాట్యా విషయమయి నాకు చాలా ఆనందంగా ఉంది......ఆర్కాడీ నికోలైచ్ విషయమయికూడా. వాళ్లతండ్రిగారి అనుమతి వచ్చేదాకా ఆగాలనుకోండి. అతన్నే పంపుతాను. చూశారా, చివరకి నేనన్నది నిజం. మనమిద్దరం ముసలివాళ్లమయిపోయామని నేనన్న మాట జ్ఞాపకం ఉందా?......ఇన్నాళ్ళూ నా కెందుకు తెలియలేదు? అదే వింతగా ఉంది!" అనాసర్గీవ్నామళ్లా నవ్వింది. గబుక్కున ముఖం వెనక్కి తిప్పుకుంది.

"చిన్నవాళ్లు చాలా రహస్యంగా మనులుకోడం నేర్చుకున్నారు," అన్నాడు బజరోవ్. అతనూ నవ్వాడు. "నాకు శలవు," అన్నాడు కొంతసేపు ఆగి. "ఈ విషయాన్ని మీరు సవ్యమయిన పరిణామాన్ని పొందేటట్లు చేస్తారని ఆశిస్తున్నాను. నేను దూరంగా ఉండి ఆనందిస్తుంటాను."

ఓడిఙ్‌స్టోవ్ సతి చటుకుని అతనివేపు తిరిగింది. "మీరు వెళ్ళిపోతున్నారా? ఇప్పుడయినా మీరు ఎందుకు ఉండకూడదూ? ఉండండి...మీతో మాట్లాడుతుంటే ఉత్సాహంగా ఉంటుంది. పర్వతపు అంచుని ప్రమాదంగా నడుస్తున్నట్టు ఉంటుంది. మొదట కొంచెం భయంగా ఉన్నా క్రమంగా అలవాటయిపోతుంది. మీరు ఆగండి."

"ఆనాసర్గీవ్నా, మీరుచేసిన సూచనకు ధన్యవాదాలు. నాకు సంభాషణలోగల చాకచక్యాన్ని మెచ్చుకున్నందుకు సంతోషం. కాని నాకు సంబంధంలేని వాతావరణంలో ఇప్పటికే ఎక్కువకాలం మెదులుతున్నట్టు నాకు తెలుసును. గాలిలో ఎగరవేస్తే చేపకొద్దిసేపు మాత్రం ఏదో బిగబట్టి ప్రాణం నిలుపుకోగలదు. కాని తొందరగా మళ్లీ అది నీళ్ళలోకి చేరుకోవాలి. అంచేత నన్ను నా వాతావరణంలోకి పోనీయండి."

ఓడిఙ్‌స్టోవ్ సతి బజరోవ్ వేపు చూసింది. అతనిముఖం పాలిపోయింది. వెగటయిన చిరునవ్వుతో పెదవులు వంపుతిరిగాయి. "ఈ వ్యక్తి నన్నొకప్పుడు ప్రేమించాడు?" అనుకుంది ఆమె. అతన్నిచూస్తే ఆమెకు జాలివేసింది. తన చేతిని అతనికి అందించింది.

కాని అతనూ ఆమెను అర్థంచేసుకున్నాడు. ఒక అడుగు వెనక్కి వేసి అన్నాడు. "నేను పేదవాడినే. కాని ఇంతవరకూ ఎవరినీ నేను ఏదీ యాచించలేదు. నాకు శలవు. మీకు శుభం కలగాలని నా కోరిక."

"మనం కలుసుకోడం ఇదే ఆఖరుసారి కాదని నా నిశ్చితాభిప్రాయం," అనాసర్గీవ్నా పరధ్యానంగా అంది.

"ఏదన్నా జరగవచ్చు," అన్నాడు బజరోవ్. వంగి నమస్కరించి అవతలికి వెళ్ళిపోయాడు.

"అయితే ఇంక నీ కొక గూడుసంపాదించుకుంటున్నావన్నమాట," అన్నాడు బజరోవ్ ఆవేళే ఆర్కాడీతో. తనపెట్టె సద్దుకుంటూ అన్నాడు. "చాలా బాగుంది కాని నువ్వంత వంచకుడవని నే ననుకోలేదు. నే నసలు ఇంకో చోట ఇది జరుగుతుందని ఆశించాను. బహుశా, ఇల్లా జరుగుతుందని నీ కయినా తెలిసి ఉండదనుకుంటాను."

"నీ దగ్గరనించి వచ్చేటప్పటికి నా మనస్సులో ఇది లేదు," అన్నాడు ఆర్కాడీ; "కాని నువ్వుమాత్రం వంచకుడవు కాదూ! చాలా బాగుం దంటున్నావు. పెళ్ళి అంటే నీకున్న అభిప్రాయం నాకు తెలియదూ?"

"వెర్రివాడా," అన్నాడు బజరోవ్ "ఎల్లా మాట్లాడుతున్నావు! నేను చేసే పని చూస్తున్నావుగదా. ఈ పెట్టెలో ఏదో కాళీగా ఉన్నట్టు తోస్తుంది. దేనితోటో ఆ కాళీ నింపుతున్నాను. మన జీవితంకూడా ఒక పెట్టెలాంటి దయితే అందులో కాళీ ఉంటే అది ఎన్నడూ మనం అల్లా వదలి బ్రతకలేం. ఆ కాళీలో ఏదో కుక్కి సంతృప్తిపడతాం. ఏమీ బాధపడకు. కాటెరీనాసర్గీవ్నాను గురించి నే నిదివరకు అన్న మాటలు నువ్వు జ్ఞాపకం తెచ్చుకో, తెలివిగా నిట్టూర్చగలిగితే చాలు, ఆ యువతి తెలివయినదిగా చలామణి అయిపోతుంది. నువ్వు ఏరుకున్న యువతి ఆ లెక్కలోది కాదు. తన బాధ్యతని తను అద్భుతంగా నిర్వహించగలదు. ఎంత బాగా నిర్వహిస్తుందంటే, నిన్ను చిటికిన వేలిమీద ఆడిస్తుంది. అసలు నిజానికి నీ విషయంలో అలా ఉండడమే శ్రేయస్కరం." అతను పెట్టెతలుపు గట్టిగా నొక్కాడు. నేల మీదినించి లేచాడు. "సరే, ఇంక శలవు. నేను మళ్లీ అంటున్నాను. ఇంక ఆత్మవంచన లాభం లేదు. మనం శాశ్వతంగా విడిపోతున్నాం. అది నీకూ తెలుసు.. .. నువ్వు తెలివయిన పని చేశావు. మాలాగ కఠినమయిన, ఏకాంతమయిన బ్రతుకు నువ్వు బ్రతకలేవు. నీలో చొచ్చుకు పోయే తీవ్రత లేదు. నీకు అసహనం లేదు. నీలో యౌవనముంది, యౌవనసహజమయిన సాహసముంది, నీబోటివాళ్లు, నాగరకులు, నాజూకుగా లొంగిపోతారు, నాజూకుగా అసహ్యించుకుంటారు. అది లాభంలేదు. మీరు యుద్ధంలోకి దిగరు—అయినా పెద్దయోధులమని అనుకుంటూ ఉంటారు. మేము యుద్ధం చెయ్యాలి. సరే! మేం లేవదీసిన దుమ్ము మీ కళ్లలో పడుతుంది. మేం తొక్కిన బురద మీ దుస్తులను పాడుచేస్తుంది. అయినా మా శ్రేణిలో మీరు కలవడం. మీకు తెలియకుండానే మిమ్మల్ని మీరు మెచ్చుకుంటారు. మిమ్మల్ని మీరు దూషించుకుంటారు కూడా. కాని మేం అదంతా చూసి విసుగెత్తిపోయాం. మాకు కావలసింది ఇంకొకటి. మేం ఇతరుల్ని పచ్చడి చెయ్యాలి. నువ్వు అద్భుతమయిన వ్యక్తివి. కాని నువ్వు పంచదారలాగ తియ్యనివాడవు. సదుద్దేశాలున్న గౌరవ వ్యక్తివి—మా నాన్న అన్నట్టుగా."

"యవ్‌గనీ, ఇంక కనపడకుండా వెళ్ళిపోతున్నావు," ఆర్కాడీ విషాదంగా అన్నాడు, "నాతో చెప్పవలసింది ఇంకేమీ లేదూ"

బజరోవ్ తల గోక్కున్నాడు, "ఉంది ఆర్కాడీ! లేకేం. ఇంకా చెప్పగలిసిన విషయాలు ఎన్నో ఉన్నాయి. కాని అవన్నీ నేను అనదలుచుకోలేదు. ఎంచేతంటే, వట్టిమెత్తని అనురాగ ప్రదర్శనంలాగ ఉంటుంది అది. నీకు త్వరలోనే వివాహం అయిపోతుంది. నీగూడు నీకు తయారవుతుంది. కడుపునిండా పిల్లల్ని కంటావు. నీకంటేనూ, నాకంటేనూ కూడా ఎక్కువ సుఖపడిగలిగిన కాలంలో పుట్టే అదృష్టం వాళ్లకి పడుతుంది. అహా! అప్పుడే గుర్రాలను పూన్చారు. వేళయింది......అందరి దగ్గరా శెలవు తీసుకున్నాను..... ఇప్పుడింకేమిటి?......కౌగిలించుకొంటావా?"

ఆర్కాడీ అతని భుజంమీద వాలాడు. పాత గురువు భుజంమీద కన్నీళ్లు విరివిగా కార్చాడు.

"అదంతా యౌవనలక్షణం," బజరోవ్ శాంతంగా అన్నాడు. "కాని నా ఆశలన్నీ కాటెరీనా సర్గీవ్నామీద పెట్టాను. ఆమె ఎంత తొందరగా నిన్ను ఓదార్చుతుందో నీకే తెలుస్తుంది. శలవోయి! తమ్ముడూ!" బండిలోకి ఎక్కుతూ బజరోవ్ ఆర్కాడీతో అన్నాడు. ఒక ఇంటి కప్పుమీద దగ్గరగా కూర్చున్న గువ్వల జంటను చూపిస్తూ అన్నాడు "అది చూడు, అదీ నీకు ఆదర్శం!"

"దాని అర్థం?" అన్నాడు ఆర్కాడీ.

"ఏమిటి? అంతమాత్రం నీకు ప్రకృతి శాస్త్రం తెలియదూ? లేక మరిచిపోయావా? గువ్వ చాలా గౌరవమయిన కుటుంబపదరికి అలవాటుపడ్డ పక్షి. నీ కొక ఆదర్శం...శలవు!"

బండి కిరకిరమంటూ కదిలిపోయింది.

బజరోవ్ అన్నది నిజమే అయింది. ఆ సాయంత్రం కాట్యాతో మాట్లాడుతున్నప్పుడు ఆర్కాడీ పూర్తిగా తన వెనకటి గురువునిగురించి మరిచిపోయాడు. ఆమె గీసినగీత వెంట అతను అప్పుడే నడవడం ప్రారంభించాడు. కాట్యాకి ఇది తెలుసును. అయినా ఆమెకు ఇది వింతగా కనిపించలేదు. నికోలై పెట్రోవిచ్‌తో మాట్లాడానికి అతను మరునాడు మేరీనోకి వెళ్ళాలి. ఆనాసర్గీవ్నాకి ఆ యువతీ యువకులకు ఏ విధమయిన నిర్బంధాలు కలిగించటానికీ ఇష్టంలేదు. కొన్ని మామూలు మర్యాదలకోసమని వారిని ఎక్కువసేపు ఏకాంతంగా ఉండనిచ్చేది కాదు. చాలా ఔదార్యంతో ఆమె ముసలి రాకుమారి వారికి అంతరాయాలు కల్పించకుండా చేసింది. రాబోతున్న ఆ పెళ్లివిషయం తెలిసేసరికి ఆమెకు దుఃఖం, ఆవేశం వచ్చాయి. తన చెల్లెలి ఆనందం తనకు అసూయాజనకంగా ఉంటుందేమోనని మొదట ఆనాసర్గీవ్నా భయపడింది. కాని ఆ ఆనందం ఆమెకు కష్టకారణంగా లేకపోవడమే కాక, కుతూహలజనకంగా కూడా ఉంది. ఆమె హృదయం మెత్తబడింది కూడా. ఆనాసర్గీవ్నాకు ఈ మార్పు ఒకపక్క సంతోషంగానూ, ఒకపక్క విషాదంగానూ ఉంది. "బజరోవ్ అన్నది నిజమని స్పష్టంగా తెలుస్తోంది," అనుకుంది ఆమె, "వట్టి కుతూహలమే, కుతూహలంతప్ప ఇంకేమీ లేదు, తరవాత కొంత సుఖాపేక్ష, అహంభావం......"

"పిల్లల్లారా," అంది ఆమె పైకి, "ఏమంటారు మీరు, ప్రేమ అనేది, ఊరికే ఊహలో జనించే ఉద్రేకమేనా?"

కాని ఈ ప్రశ్న ఆర్కాడీకిగాని, కాట్యాకిగాని అర్థమే కాలేదు. ఆమె ఎదట వారిద్దరికీ సిగ్గు. వారు రహస్యంగా విన్న సంభాషణలో ముక్కలు వారి మనస్సుల్లో వేధిస్తున్నాయి. కాని ఆనాసర్గీవ్నా త్వరలోనే వారి మనస్సులు కుదుటపడేటట్టు చేసింది. అది ఆమెకు అంత కష్టమయిన పనికాదు—తన మనస్సునే ఆమె కుదుటపరచుకుంది.

కథాసాహిత్యము

(19 వ పేజీ తరువాయి)


కథ కొంచెం పెద్దదైతే నవలగాను, చిన్నదయిన కథానికగాను ఎంచబడెడిది. కాని నేడు ఈ రెంటి రంగం పూర్తిగా విడిపోయినది. దాదాపు లక్ష, లక్షకు పైగా నున్న శబ్దజాలముతో కూడిన రచన నవలగను, దాదాపు వెయ్యి, వెయ్యికి పైగా నున్న శబ్దజాలముతో కూడిన రచన కథగను ఎంచబడుచున్నది. నవల మానవజీవితకమలమయిన కథ కమలముయొక్క ఒక దళం (రేకు) మాత్రమై యున్నది. నవల మానవుని సంపూర్ణజీవితమును చిత్రించ గలుగుచున్నది. కథజీవితములోని ఒక సారవంతమైన ఘట్టమును మాత్రమే చిత్రించ గలుగుచున్నది. నవల రచనారంగం పెద్దదవడంచేత పాత్రలను సజీవముగ చిత్రించడములో ప్రయాస లేదు. కథయొక్క రచనారంగము చిన్నదిగనుక కథలోని పాత్రలను సజీవముగ చిత్రించడము చాల కఠినమైన పని. కథకుడు ఎంతో కార్యకుశలత కలిగియుండవలసి యున్నది. సూక్ష్మములో మోక్షమన్నట్లు కొద్దిలోనే తన గొప్పతనమును చూపించవలసియున్నది. నవలలో ఏడి వరకు పాత్ర లుంటే, కథలో ఇద్దరు ముగ్గురు మాత్రమే వుంటారు. కథలోని భాష, భావము క్లుప్తముగా వుంటుంది. నిరర్థక శబ్దము ఉపయోగించబడదు. కథనుంచి ఏ ఒక్క శబ్దము తీసివేసినా కథాసరి చెడునట్లుగా వుంటుంది. నవలారచయిత అలా లేదు. భాషను, భావములను, పాత్రలను, ఘట్టములను చేతినిండా వాడుచుండును. కథకుడు అలా కాక, ప్రతిదానిని తూచితూచి వాడుతుంటాడు. కథా కార్యరంగము చిన్నదిగనుక ఇంటికి తగినట్లుగా అతిథులనాహ్వానించునట్లుగా పరిమిత పాత్రలతో, భాషతో భావములతో పనిపూర్తిచేస్తుంటాడు. కథకుడు ఒకేఒక లక్ష్యముతో, ధ్యేయముతో పూర్తి జేస్తాడు. మన ప్రాచీన కథలు, ఆధునిక ఆది కథలుకూడ దార్మిక, దార్శనిక సిద్ధాంతములతోను దయాదృష్టి పూర్ణదృశ్యములతోను, విశేషవర్ణనలతో నిండియున్నవి. నేటి కథలలో పై సిద్ధాంతములు అత్యల్పముగమాత్రమే యున్నవి. నేటి కథలు సాంఘిక, రాజకీయ ఆర్థిక పరిస్థితులు పరిష్కార పరిణామములతో నిండి పాఠకుల ప్రత్యక్షమున వారితో సంభాషించునట్లుగా కనపించుచున్నవి. నేటి కథలు వాస్తవికత కదగ్గరగా యుండి ప్రజాసమస్యల పరిష్కార పరిణామ ఫలితములతో వారి ప్రత్యక్షతను చిత్రిస్తున్నవి. కథలో కథకుని వ్యక్తిత్వముకూడ వెల్లడౌతుంటుంది. నవల కల్పనాధిక్యతతో నిండియుంటుంది. కథకుడు తనలక్ష్యానువర్తియై కథన మానవుని మానసిక సూక్ష్మాతి సూక్ష్మరహస్యములతో, కార్యకలాపములతో నింపును. కథ చిన్నదైనను పెద్దదైనను తన భావ సామరస్యమును తన నలువైపులనున్న వాతావరణంతో జతజేర్చును.

ఆధునిక కథా వికాసమునకు ఫ్రాన్సు, రష్యా, అమెరికా రచయితలు ఎక్కువగా తోడ్పడ్డారు. ఫ్లోబేర్, మొపాసాం, బాలజాక్ మొదలైన ఫ్రాన్సు రచయితలు, టాల్‌స్టాయ్, గోర్కీ మొదలైన అమెరికారచయితలు ఆధునిక కథాభివృద్ధికి ఆధారభూతులైరి. ప్రజాచైతన్యమునకు, వారి జాగృతికి పైవారు చూపిన రచనా పద్ధతి ఎంతో సువిధాజనకమైనది. ఈ విధమైన పద్ధతి నవలంబించి రష్యారచయితలు తొందరలో ప్రజాచైతన్యమును, ప్రజాకర్షణను పొందగల్గిరి. రష్యా రాజకీయ, సాంఘిక విప్లవమునకు ఈవిధమైన కథా పద్ధతి ఒక సూత్రయంత్రముగ పనిచేసినది. కాని రష్యాకథలన్నియు దుఃఖాంతములై యున్నవి. ఇదిమాత్రము పెద్దలోటుగా కనడినది.


లాక్షణికులు కథకు దుఃఖాంతము, సుఖాంతము రెండూ అవుసరమని యన్నారు. రష్యా కథలు ఎక్కువగా దుఃఖాంతముగ నుండుటకు ఆనాటివారి దేశపరిస్థితులే కారణము లైనవి. ఈ అంతర్జాతీయ రచయితల్లో కల్లా టాల్‌స్టాయ్, గోర్కీ కథాపద్ధతిని భారతీయులు ఎక్కువగా అనుసరించిరి. వీరి కథలు అన్ని దేశీయభాషలందు ఇంచుమించుగా కొద్దియో గొప్పయో అనువదించబడినవి. టాల్‌స్టాయ్ కథలు హిందీయందద్భుతముగ అనువదించబడినది.

నేటి తెలుగు కథాసాహిత్యము అభివృద్ధిలోనే యున్నదని చెప్పవచ్చును. నిత్యం నూతన కథకారు లుదయిస్తున్నారు. నూతన ఫక్కీన చిన్న చిన్న సారవంతమైన కథలు వ్రాయుటలో తెలుగువారు పేరుగాంచుకున్నారు. రాజకీయ, సాంఘిక ఆర్థిక పరిస్థితుల కనుగుణ్యంగా, ప్రజాచైతన్యాభిలాషతో - ప్రజాకర్షణాభిలాషతో వ్రాసేవారిలో సిద్ధహస్తులు మునిమాణిక్యం, కొడవటిగంటి, చింతా, చలం, మల్లాది, శ్రీపాద, సంపత్, జమదగ్ని, మొక్కపాటి, కవికొండల, ఆరుద్ర, తెన్నేటి మొదలైనవారెందరో ముందుకు సాగిపోతున్నారు. వీరంతా పాత్రోచితమైన, ప్రజాపరిష్కృత భాషలో వ్రాసి, ప్రజాహృదయమును చూరగొని పాఠకులలో కథాకౌశల్యాను కలిగిస్తున్నారు.


వార్తా చిత్రాలు




జులై 15 న పాటియాల్లా, తూర్పుపంజాబు సంస్థానముల రాజప్రముఖ్ గా పాటియాలా మహారాజాచే భారత ఉపప్రధాని, సంస్థానశాఖామాత్యుడు సర్దార్ పటేల్ ప్రమాణస్వీకారం చేయించారు. సర్దార్ పటేల్, రాజప్రముఖ్ పాటియాలా మహారాజు, ఉపరాజప్రముఖ్ కపుర్తల్లా మహారాజు వరుసగా నిలబడిఉన్నారు.




కాశ్మీర్ లో సోనమార్గరంగాన్ని ఇటీవల దర్శించినప్పుడు భారతప్రధాని నెహ్రూ రక్షణమంత్రి బలదేవ్ సింగ్ గారలు అనేక కార్యకలాపాలు వున్నప్పటికీస్వల్ప వ్యవధి తీసుకొని బ్యాడ్ మింటన్ ఆడుతున్న దృశ్యం




1-7-48 న గవర్నర్ గారు లాముఫారం దర్శించినపుడు తీసిన ఛాయాపటము. ఈ ఒంగోలు వృషభరాజము, అఖిలభారత పశుప్రదర్శనము—ఢిల్లీలో మొదటి బహుమానము పొందినది. గా॥ నై గారు ఉత్సాహముల చూచుచున్నారు.



లాము ఫారంలోనున్న పశువులను దర్శించుచు గా॥ నై గారు ఆఫీసర్లతో మాట్లాడుచున్నారు



మహాపూర్ వంతెన ప్రారంభోత్సవాన్ని దర్శిస్తున్న ప్రజా సమూహాలు.



గవర్నరుగారు లాము ఉద్యోగస్థులతో ఒంగోలు పశుసందముగూర్చి సంభాషించుచున్నారు

Regd. No M. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7 Thambu Chetty St., G. T. Madras.